మార్చి
2014

# 95

సంపుటి : 8 సంచిక : 11

వెల రు. 10/-

## ఈ సంచికలో........

కుల వివక్ష పోవాలంటే ఆర్థిక సాధికారికత ఒక్కటే సరిపోదు

కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదు

21వ శతాబ్దపు భూ దోపిడీ

పురోగామి శక్తులకు సవాలు విసురుతున్న ప్రపంచ పరిణామాలు

మంచి పాలనా వ్యవస్థ

ఆహారభద్రతను దెబ్బతీసే బాలి ఒప్పందం

మూఢనమ్మకాల వ్యతిరేక పోరాటంలో ప్రాణాలర్పించిన డా॥ నరేంద్ర దభోల్కర్

ప్రజాఉద్యమ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే బూర్జువాపార్టీలతో సర్దుబాట్లు చేసుకోవాలి

స్ఫూర్తి

# మూఢనమ్మకాల వ్యతిరేక పోరాటంలో ప్రాణాలర్పించిన

# డా॥ నరేంద్ర దభోల్కర్



ఎల్.ఎస్. భారవి

పదిమంది సంతానం గల ఆ కుటుంబంలో ఆయన చివరి వాడు. పెద్దన్నయ్య విద్యావేత్త, గాంధేయవాది, సామాజిక కార్యకర్తగా కావటంతో అదే స్ఫూర్తితో పట్టుదలతో తన విద్యాబ్యాసం పూర్తి చేసి, వైద్యశాస్త్రంలో పట్టభద్రుడైనాడు. అయితే ఆయన తన వైద్య విద్యను వ్యాపారానికి వాడుకోలేదు. పేద ప్రజానీకానికి వైద్యసేవలు అందించటం ద్వారా ప్రజావైద్యునిగా నిలిచాడు. అంతటితో ఆగలేదు ప్రజలలో నెలకొని ఉన్న మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాల మీద అలుపెరుగని పోరాటం చేశాడు. ఆ పోరాటంలో ఆయన తన ప్రాణాలనే అర్పించాడు. మత ఛాందసానికీ, మూఢనమ్మకాలకూ వ్యతిరేకంగా పోరాడినందుకు కిరాయి గూండాల కిరాతక కత్తులకు నేలకొరిగిన ఆ మహానుభావుడు భారతదేశంలోనే పేరెన్నిక గన్న హేతువాది, రచయిత. ఆయనే డా॥ నరేంద్ర దభోల్కర్.

1945 నవంబరు 1వ తేదీన మహారాష్ట్రలోని సతారాలో అచ్యుత్ దభోల్కర్, తారాబాయి దంపతులకు జన్మించిన పది మంది సంతానంలో నరేంద్ర దభోల్కర్ ఆఖరివాడు. సతారాలోని "న్యూ ఇంగ్లీష్ స్కూల్"లో పదో తరగతి వరకు, సాంగ్లీలోని వెల్లింగ్టన్ కాలేజీలో విద్యాభ్యాసం చేసి, మీరాజ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యుడిగా పట్టభద్రుడైనాడు. శివాజీ విశ్వవిద్యాలయ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన టోర్నమెంట్‌కి ఆయన భారత జట్టుకి నాయకత్వం వహించాడు. కబడ్డీలో ఆయన చూపించిన ప్రతిభకు ఆయనకు మహారాష్ట్ర ప్రభుత్వం శ్రీ ఛత్రపతి యువ అవార్డును ప్రదానం చేసింది. తదనంతర కాలంలో ఆయన షైలా అనే ఆమెను వివాహమాడారు. వారికి ఇద్దరు పిల్లలు హమీద్ దభోల్కర్, ముక్త దభోల్కర్. ప్రముఖ సామాజిక పరివర్తన కార్యకర్త హమీద్ దల్వాయి పేరును ఒక పెట్టుకున్నారు. ఆయనకు వాస్తు శాస్త్రంపై నమ్మకం లేదు. నమ్మకం లేదు అని చెప్పుకోవటంతో పరిమితం కాకుండా తాను నిర్మించిన ఇంటిని ఎటువంటి వాస్తు సూత్రాలు అనుసరించకుండా కట్టించారు. అంతే కాదు, వివాహాలకు అత్యంత భారీగా ఖర్చు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించేవారు. విమర్శలకు పరిమితం కాకుండా తన పిల్లల వివాహాలు కూడా చాలా నిరాడంబరంగా జరిపారు. వివాహాలకి ముహూర్తం నిర్ణయించే పండితులను కూడా సంప్రదించకుండా తన పిల్లల వివాహాలు జరిపించాడు. అంటే తాను ఏ సిద్ధాంతాన్ని నమ్మాడో దానిని కేవలం ప్రచారం చేయటమే కాకుండా ఆచరణలో దానిని అన్ని విధాల చేసి చూపించిన అరుదైన వైద్య వైజ్ఞానికుడు నరేంద్ర దభోల్కర్. నరేంద్ర దభోల్కర్ తాను జీవించిన్నంత కాలం హేతువాదిగానే నిలబడ్డాడు. ఆయన నాస్తికుడు కూడా.

1968 నుంచి దాదాపు 12 సంవత్సరాలు వైద్యునిగా ప్రజలకు సేవలందించిన దభోల్కర్ 1980 నుండి పూర్తికాలం సామాజిక కార్యకర్తగా మారిపోయాడు. తొలిరోజుల్లో సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాల్లో భాగస్వామి అయ్యాడు. బాబా ఆధవ్ జరిపిన "ఒక గ్రామం – ఒక బావి" పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాడు. కాలక్రమేణ, సమాజంలోని మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు తొలగించే కార్యక్రమంపై కేంద్రీకరించి పని చేయటం ప్రారంభించాడు. ఆ ప్రేరణతోనే అఖిల భారత అంధ శ్రద్ధ నిర్మూలన సమితిలో చేరాడు. 1989లో ఆయన మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన సమితిని ఏర్పాటు చేశాడు. మహారాష్ట్ర అంధవిశ్వాసాల నిర్మూలన కమిటీ లేదా మూఢ నమ్మకాల నిర్మూలనా కమిటీల పేరుతో ఆయన మహారాష్ట్రలో పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించాడు. అప్పటికే సమాజంలో ఉన్న అనేక మంది తాంత్రికులనూ, దొంగ స్వామీజీలనూ ధైర్యంగా ఎదుర్కొన్నాడు. దేశంలో ఉన్న స్వీయ ప్రకటిత భగవానులు, బాబాలు, హిందూ ధర్మశాస్త్ర ఉద్ధారకులుగా ప్రచారం చేసుకునే స్వామీజీలను ఆయన తీవ్రంగా విమర్శించేవారు.

ఆ కాలంలోనే ఆయాన సతారా జిల్లాలో ప్రారంభించిన "పరివర్తన" అనే సామాజిక కార్యాచరణ సెంటరు ప్రారంభకులలో ఒకడిగా ప్రముఖ పాత్ర పోషించాడు. సమాజంలోని అణగారిన వర్గాల ప్రజల జీవితాలలో మార్పుకై పోరాడటం, తద్వారా వారి జీవితాలలోకి భద్రత, గౌరవం, అభివృద్ధి తీసుకురావటం అనే లక్ష్యంతో ఈ సంస్థ పని చేసింది. తాగుడు వ్యసనాన్ని మాన్పించే బృహత్తర కార్యక్రమం ఈ సంస్థ చేపట్టింది.

ఈ కాలంలోనే ఆయన జాతీయ హేతువాద సంస్థతో కూడా కలిసి పని చేశాడు. సానే గురూజీ ప్రారంభించిన ప్రముఖ మరాఠా వారపత్రిక అయిన "సాధన"కి ఆయన ఎడిటర్‌గా పని చేశాడు. అంతకు ముందరే ఆయన భారతీయ హేతువాద సంస్థ ఉపాధ్యక్షులుగా కూడా పని చేశాడు.

1990–2010 మధ్యకాలంలో దభోల్కర్ దేశంలో మరీముఖ్యంగా మహారాష్ట్రలో దళితుల సమానత్వం కోసం, అంటరానితనం నిర్మూలన కోసం జరిగిన పోరాటాలలో మంచి పోషించారు. సమాజంలో గాఢంగా పాతుకుపోయిన కుల వ్యవస్థకి వ్యతిరేకంగా, అలాగే కులాల పేరుతో జరిగే కొట్లాటలు, ఉన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఆయన ఉక్కుమనిషిలా పోరాడారు. ఆ క్రమంలోనే ఆయన మరత్వాడా విశ్వ విద్యాలయాన్ని అంబేద్కర్ విశ్వ విద్యాలయంగా మార్చాలనీ, దళితుల హక్కుల కోసం, సమానత్వం కోసం పోరాడి, భారత రాజ్యాంగ రూపశిల్పిగా పేరుగాంచిన డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరున ఆ విశ్వవిద్యాలయం నడవాలని కోరారు. దభోల్కర్ తన జీవిత కాలంలో దాదాపు 3 వేల బహిరంగ సభల్లో పాల్గొన్నారు. సమాజంలోని మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అలుపెరుగని ప్రచారం చేశారు. నరేంద్ర దభోల్కర్ స్థాపించిన మహారాష్ట్ర అంధ విశ్వాస నిర్మూలన సమితి అనతికాలంలోనే

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. మూఢనమ్మకాల వ్యతిరేక పోరాటంలో ప్రాణాలర్పించిన డా॥ నరేంద్ర దభోల్కర్
- ఎల్.ఎస్. భారవి 2

2. కుల వివక్ష పోవాలంటే ఆర్థిక సాధికారికత ఒక్కటే సరిపోదు
- బి.వి. రాఘవులు 4

3. కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదు
- ఎస్. వీరయ్య 9

4. 21వ శతాబ్దపు భూ దోపిడీ
- ఫ్రెడ్ మెగ్డాఫ్ 11

5. పురోగామి శక్తులకు సవాలు విసురుతున్న ప్రపంచ పరిణామాలు
- ఆర్. అరుణ్ 19

6. మంచి పాలనా వ్యవస్థ
- ఇర్ఫాన్ హబీబ్‌తో ఇంటర్వ్యూ 23

7. ఆహారభద్రతను దెబ్బతీసే బాలి ఒప్పందం
- కొండూరు వీరయ్య 29

8. ప్రజాద్యమ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే బూర్జువాపార్టీలతో సర్దుబాట్లు చేసుకోవాలి
- బివి రాఘవులు 33



ఎడిటర్:
ఎస్. వెంకట్రావు

ఎడిటోరియల్ బోర్డు:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822
మేనేజర్: 040-27673787
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at: cpim.org


# అభివృద్ధి

దేశంలో తొలి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికిన ఆంధ్ర ప్రదేశ్ రెండుగా చీలిపోయింది. ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా ఇక తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాల కింద మనుగడ సాగించక తప్పదు. విభజన జరిగే వరకూ రాష్ట్రంలో విభజన, సమైక్యతపై చర్చ సాగింది. ఇప్పుడు అభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాలు వగైరా అంశాలపై చర్చ జరుగుతోంది.

రానున్న ఎన్నికల్లో రెండు ప్రాంతాల్లోనూ అభివృద్ధి అనేది ప్రధాన ఎజెండాగా ఉండబోతున్నదని బూర్జువా రాజకీయ పార్టీల ప్రచార వ్యూహాలు తెలియజేస్తున్నాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది మేమేనంటే మేమేనని నేతలు అప్పుడే ప్రచారం ప్రారంభించారు. రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రంలో అభివృద్ధి ప్రధానంగా హైదరాబాద్‌లో కేంద్రీకరించబడినందున రాష్ట్ర విభజనకు అది ఒక ప్రధాన సమస్యగా మారింది. తెలంగాణా, సమైక్యాంధ్ర పేరుతో తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిన నాయకులే ఇప్పుడు సీమాంధ్ర రాజధాని గురించి రగడ సృష్టిస్తున్నారు. ఎక్కడ రాజధాని నగరం ప్రకటిస్తే అక్కడ అభివృద్ధి జరుగుతుందన్న భ్రమలు కల్పించి ప్రజల మధ్య చీలికలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలు వీరి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండడం అవసరం.

అభివృద్ధి కేంద్రీకరణ అనేది పెట్టుబడిదారీ అభివృద్ధి లక్షణం. దీని వల్ల ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య అసమానతలు పెరుగుతాయి. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు మార్కెట్టుకు పూర్తి స్వేచ్ఛ కావాలని చెబుతున్నాయి. ప్రభుత్వ జోక్యాన్ని నిరాకరిస్తున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ విధానాల్లో ఎక్కడ ప్రాథమిక సదుపాయాలుంటాయో అక్కడ అభివృద్ధి కేంద్రీకరించబడుతుంది. ప్రజల్లో కూడా కొద్దిమంది కోటీశ్వరులూ, శతకోటీశ్వరులుగా మారితే విస్తారమైన ప్రజానీకం పేదరికంలోకి నెట్టబడతారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకృత విధానాల వల్ల శాశ్వత ఉపాధి తగ్గిపోతోంది. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు పెరుగుతున్నారు. వీరికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కరువవుతోంది. సంఘటిత కార్మిక వర్గం తగ్గి అసంఘటిత కార్మికులు పెరుగుతున్నారు. ప్రజలకు తగిన ఆదాయాలు లేకపోతే ఏ ప్రాంతమూ అభివృద్ధి కాదు.

గత రెండు దశాబ్దాలుగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు ఈ స్వేచ్ఛా మార్కెట్ విధానాలనే అమలు చేశాయి. అందుకే సమగ్రమైన అభివృద్ధి కొరవడింది. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడే ఉన్నాయి. ప్రాంతాలే కాదు ప్రతి జిల్లాలోనూ కొన్ని ప్రాంతాలు వెనుకబడిపోయిన పరిస్థితి ఉంది.

అందువల్ల ఇప్పుడు తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతాల్లో జరగాల్సింది గతంలో మాదిరిగా కేంద్రీకృత అభివృద్ధికాదు. వికేంద్రీకరణ జరగాలి. అన్ని ప్రాంతాలూ సమగ్రంగా అభివృద్ధి చెందే ప్రణాళికాబద్ధ విధానం కావాలి. స్థానిక వనరులు, నిధులు, మానవ వనరులను గరిష్టంగా ఉపయోగపెట్టుకుని ఆయా ప్రాంతాలన్నిటినీ అభివృద్ధి చేయాలంటే అధికార వికేంద్రీకరణ జరగాలి. ఇటువంటి సమగ్ర, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి సరళీకృత ఆర్థిక విధానాలు వ్యతిరేకం. పెట్టుబడికి ఎక్కడ గరిష్ట లాభాలు వస్తే అక్కడికి పోవాలన్నది ఆ విధానాల సారాంశం.

అందువల్ల ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్లు సరళీకరణ ఆర్థిక విధానాలు, సమగ్ర వికేంద్రీకృత అభివృద్ధి ఒక చోట ఉండవు. కనుక అన్ని ప్రాంతాలనూ, అన్ని తరగతుల ప్రజలనూ అభివృద్ధి చేయాలనుకునే పాలకులు నయా-ఉదారవాద విధానాలను విడనాడాలి. అలా కాకుండా సరళీకరణ విధానలతోనే అభివృద్ధి సాధిస్తామనుకుంటే కొన్ని ప్రాంతాలు వెనుబాటుతనంలోనే ఉండిపోతాయి. ప్రజల మధ్య అసమానతలు పెరుగుతూనే ఉంటాయి. ఇది మళ్లీ వేర్పాటు వాద ఉద్యమాలకు భూమిక నేర్పరుస్తుంది. దాంతో మళ్లీ కథ మొదటికే వస్తుంది.

కనుక మనం అభివృద్ధిని మాత్రమే కాదు ఎటువంటి అభివృద్ధి కావాలో కూడా నిర్ణయించుకోవాలి. సరళీకృత ఆర్థిక విధానాలపై పోరాడడం ద్వారానే సమగ్ర అభివృద్ధిని సాధించుకోగలం.


**చందా వివరాలు**

విడిప్రతి: రూ.10, సంవత్సర చందా: రూ.100, పోస్టు ద్వారా రూ. 120

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

మేనేజర్,
మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),
అజామాబాద్, హైదరాబాద్- 20

**ఈ మాసం ముఖ్యాంశం**

# కుల వివక్ష పోవాలంటే ఆర్థిక సాధికారికత ఒక్కటే సరిపోదు

**సామాజిక వివక్షకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమం ఒక సమగ్రమైన స్థాయిలో జరగాలి. భూ కేంద్రీకరణ బద్దలు కొట్టడం కోసం జరిగే మౌలికమైన, దీర్ఘకాలికమైన పోరాటంతో విద్య కోసం, ప్రభుత్వ సౌకర్యాల కోసం, హక్కుల కోసం తక్షణం జరిగే పోరాటాలను మేళవించి నడపాలి. దాంతోపాటు దళితులు, దళితేతర పేదల మధ్య గిరిష్ట స్థాయిలో ఐక్యత నిర్మించేందుకు సాంస్కృతిక భావజాల కృషిని కూడా జోడించాలి. అప్పుడే దళితులకు, దళితేతరులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చగల్గుతాం.**

**బి.వి. రాఘవులు**

ఆర్థిక సాధికారికత అంటే ఏమిటి? భూమి, ఇల్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, రాజకీయ రిజర్వేషన్లు వీటన్నిటినీ సమకూర్చడాన్ని ఆర్థిక సాధికారికత అంటాం. నా అభిప్రాయం ఏమంటే దళితులమీద జరుగుతున్న కులవివక్ష, అంటరానితనాలను నిర్మూలించకుండా వారి సాధికారికత, సమానావకాశాలకోసం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా దళితులకూ, దళితేతరులకూ మధ్యనున్న అంతరాన్ని పూడ్చలేము. ఎందుకంటే ప్రభుత్వంగానీ, మరో సంస్థగానీ ఎంత సదుద్దేశాలతో చేపట్టిన కార్యక్రమాలైనా సమాజంలో, ముఖ్యంగా గ్రామాల్లో నెలకొని ఉన్న కుల వివక్ష వాటిని కొరగాకుండా చేసేస్తుంది.

మరోవంక ప్రభుత్వం పేద ప్రజల్లోని ఇతరుల పొట్టగొట్టి దళితులకు పెడుతున్నదనే భావన దళితేతరుల్లో బాగా వ్యాప్తి చెంది ఉన్నది. కానీ ఆరు దశాబ్దాలపాటు దళితుల సాధికారికత, సమానావకాశాలకోసం విధానాలు చేపట్టినప్పటికీ దళితులు, దళితేతరుల మధ్య అంతరం ఇంకా పూడలేదు. వాస్తవానికి చెప్పాలంటే కొన్ని సందర్భాల్లో ఈ అంతరం ఇంకా పెరిగింది. అనేక మంది విద్యావేత్తలు, సంస్థలు జరిపిన అధ్యయనాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆంధ్ర ప్రదేశ్‌కు సంబంధించి 2007-09 మధ్య జరిపిన సర్వే దళితులకూ, దళితేతరులకూ మధ్య ఉన్న అంతరాలను స్పష్టంగా మన ముందుంచింది.

ఈ సందర్భంగా 22 జిల్లాల్లోని 88 గ్రామాల్లో 21,657 గృహాలను వారు సర్వే చేశారు. ఎంపిక చేసిన ఈ గ్రామాల్లో ప్రతి కేటగిరి నుండి 10 శాతం గృహాలను స్టాటిఫైడ్ రాండమ్ సాంప్లింగ్ పద్ధతిలో ఎంపిక చేశారు. పట్టిక 1,2 లో కొన్ని ఫలితాలను ఇచ్చాం:

గ్రామాల్లో దళితులు సమాజంలో అన్ని రకాలుగా వెనకబడి ఉన్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో ఇరుక్కుని ఉన్నారు.

**దళితులపై రాజ్యం వివక్ష**

దళితులపై రాజ్యమే అనేక విధాలుగా వివక్ష చూపుతోంది. దీనికి ఒక ముఖ్యమైన కొలబద్ద దళితులకు బడ్జెట్‌లో చేసే కేటాయింపులు, ఖర్చులు. ఆంధ్ర ప్రదేశ్‌లో గత మూడు దశాబ్దాలుగా షెడ్యూల్డ్ కూలాలకు ఉప-ప్రణాళిక అమలులో ఉంది. ఈ ఉప ప్రణాళిక కింద నిధుల కేటాయింపులు, ఖర్చులు పట్టిక 3లో ఇచ్చాం.

కులవివక్ష, అంటరానితనం నిర్మూలించడానికి అనేక కఠిన చట్టాలు చేసినప్పటికీ, అనేక రకాల రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించినప్పటికీ కొద్దిమంది మినహా విస్తారమైన దళితుల సామాజిక పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు.

కులవివక్ష, అంటరానితం విస్తారంగా అమలులో ఉందని చెబితే ప్రధాన రాజకీయ పార్టీలు, మీడియా, పట్టణ మేధావులూ నమ్మరు. అలా ఏమీ లేదని చెప్పేస్తారు. కాని వాస్తవం చూస్తే మన సమాజంలో సామాజిక వివక్ష, అంటరానితనం అనేక రూపాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలే ఈ విషయాన్ని చెబుతున్నాయి.

కులవివక్షపై ప్రత్యక్ష సమాచారం తెలుసుకోడానికి 1998లో ఆంధ్ర ప్రదేశ్‌లోని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఒక రాష్ట్ర వ్యాపిత సర్వే నిర్వహించింది. నేను పాల్గొన్న 'సైకిల్ జాతా' సందర్భంగా నాకు గతంలో అనుకున్న దానికన్నా తీవ్రమైన వివక్ష రూపాలు కనిపించాయి. ప్రజాఉద్యమాల ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం దళితుల సామాజిక-ఆర్థిక స్థితిగతుల గురించి అధ్యయనం చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించింది. ఆయన బహిరంగ దర్యాప్తు జరిపి, ఒక సమగ్రమైన నివేదిక తయారు చేశారు. అధికార నివేదిక కనుక అది అందరి కళ్లూ తెరిపించింది.

కులవివక్ష, అంటరానితనం నిర్మూలనలో భూమి, విద్య, ప్రభుత్వ సేవలు, రిజర్వేషన్ అనే నాలుగు అంశాల పాత్రను పరిశీలిద్దాం.

**భూ కేంద్రీకరణను బద్దలు కొట్టడం**

దళితులకు భూమి పంపిణీ చేస్తే అగ్రకులాల భూస్వాములపై ఆధారపడటం తొలగిపోయి ఆ రకంగా కులవివక్ష నుండి అంటరాని తనం నుండి వారికి విముక్తి గల్గుతుందని ఒక సాధారణ అభిప్రాయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పొందిన అనుభవాలు ఈ అభిప్రాయాలు సరియైనవి కాదని చెబుతున్నాయి.

అధికారిక సమాచార ప్రకారం రాష్ట్రంలో దళితులకు విస్తారంగా భూమి పంపిణీ జరిగింది. 1956లో రాష్ట్రం ఏర్పడిన దగ్గరినుండి 2000 సం॥ వరకు 43 లక్షల ఎకరాలు పేదలకు, అందులో ముఖ్యంగా దళితులకు పంపిణీ జేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. గడచిన 7 సంవత్సరాల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం 7 సార్లు నిర్వహించిన భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 8 లక్షల ఎకరాలు పంపిణీ జేసినట్టు చెబుతున్నది. ఈ లెక్కలు అతిగా జేసి ప్రభుత్వం చెప్పుకున్నవిగా భావించినా భూమిని గణనీయం గా పంపిణీ చేసిన దానిని కాదనలేము.



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి.**

> "కులవివక్ష, అంటరానితం విస్తారంగా అమలులో వుందని చెబితే ప్రధాన రాజకీయ పార్టీలు, మీడియా, పట్టణ మేధావులూ నమ్మరు. అలా ఏమీ లేదని చెప్పేస్తారు. కాని వాస్తవం చూస్తే మన సమాజంలో సామాజిక వివక్ష, అంటరానితనం అనేక రూపాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలే ఈ విషయాన్ని చెబుతున్నాయి."

ఈ భూమిలో ఎక్కువగా ప్రభుత్వ బంజర్లు, ఇనాం భూములు, కొంతమేరకు సీలింగు భూములు వున్నాయి. లబ్దిపొందినవారిలో దళితుల నిష్పత్తి గణనీయంగా వుంది.

అయితే ఈ భూమి పంపిణీ పేదలకు ముఖ్యంగా దళితులకు ఉపయోగపడిందా? దళితులను, అగ్రకుల భూ యజమానులమీద ఆధారపడకుండా చేసిందా? అనేది పరిశీలిస్తే ఆశించిన ప్రయోజనం జరగలేదనేది స్పష్టం అవుతుంది. పంపిణీ జేసిన భూములు అత్యధిక భాగం కరువు ప్రాంతాల్లో, మెట్టప్రాంతాల్లో వున్నాయి. వ్యవసాయోగ్యం కాని భూములు కూడా పంపిణీ చేసిన భూముల్లో ఎక్కువగా వున్నాయి. అందువలన ఈ భూముల్లో వ్యవసాయం ఏమాత్రం దళితులకు ఉపయోగపడలేదు.

ఇటువంటి నిరుపయోగకరమైన భూములు కూడా దళితులు, ఇతర పేదల దగ్గర ప్రస్తుతం లేదు. అత్యధిక భాగం దళితేతర చేతుల్లోకి వెళ్లిపోయింది. 2004 సంవత్సరంలో ప్రభుత్వం నియమించిన కోనేరు రంగారావు భూ కమిటీ ఈ పరిణామాన్ని గుర్తించింది. పంపిణీ అయిన భూమిలో 30 శాతానికి పైగా భూమి లబ్దిదారు చేతుల్లో లేదని చెప్పింది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం సేకరిస్తున్న భూముల్లో సైతం ఎక్కువగా ఇటువంటి అసైన్డ్ భూములే ఉంటున్నాయి.

రాష్ట్రంలోని కోస్తా ప్రాంతంతో పోల్చిచూసినప్పుడు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో దళితుల్లో ఎక్కువ కుటుంబాలకు భూమి వున్నది. అయినా కులవివక్ష, అంటరాని తనం నుండి అధిగమించడానికి ఇదేమీ తోడ్పడటం లేదు. వాస్తవంగా ఈ ప్రాంతాల్లోనే కులవివక్ష, అంటరానితనం యొక్క క్రూరమైన రూపాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి.

భూ పంపిణీతోపాటు ఆధునిక వ్యవసాయాన్ని నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనందునే పంపిణీ చేసిన భూమి దళితుల ఆర్థిక స్వతంత్రతకు ఉపయోగపడటంలేదన్న భావన కూడా వున్నది. దళితులు తమ భూములను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం అనేక పథకాలను చేపట్టినప్పటికీ పెద్ద ప్రయోజనం జరగలేదని పరిశీలనలు తెలియజేస్తున్నాయి. వాస్తవంగా వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో దళితులు తమ వద్ద ఉన్న భూమిని పోగొట్టుకుంటున్నందున ఆర్థిక స్వాలంబను సాధించలేక పోతున్నారు. నీటి పారుదల సౌకర్యాలు, వ్యాపార వ్యవసాయ పద్ధతులు అభివృద్ధయిన ప్రాంతాల్లో పేదలు ముఖ్యంగా పేద రైతులు భూములను పోగొట్టుకుని వ్యవసాయ కార్మికులవుతున్నారు. అందుకే కోస్తా డెల్టా ప్రాంతంలో వ్యవసాయ కార్మికుల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నది. ఈ పరిణామం దళితుల్లో ఇంకా ఎక్కువగా వున్నది.

1975-76లో ఒక దళిత కుటుంబం సగటున 1.19 హెక్టార్ల భూమి కలిగి ఉండగా, 1995-96 నాటికి కుటుంబ కమత విస్తీర్ణం 0.83 హెక్టార్లకు తగ్గిపోయింది.

అందువలన దళిత కుటుంబాలకు కొద్దిపాటి భూమిని పంపిణీ జేసినంత మాత్రానే కులవివక్ష, అంటరాని తనాన్ని అధిగమించగలరని అనుకోవడం సరైందికాదు. ఆధిపత్య కులాల చేతుల్లో అత్యధికంగా భూమి కేంద్రీకరించబడి ఉన్నంత కాలం తద్వారా దళితులు తమ బతుకు తెరువుకోసం వారిపై ఆధారపడి వుండాల్సినంత కాలం సామాజిక అణచివేత కొనసాగడానికి అనువైన పరిస్థితులు కొనసాగుతాయి. ఆధిపత్య కులాలు, అగ్రకులాలు కులవివక్షను, అంటరానితనాన్ని కొనసాగించే శక్తి వారిచేతుల్లో వున్న భూ కేంద్రీకరణ నుండే వస్తున్నది. భూ సంస్కరణ చట్టాలను అమలు జరిపామని ప్రకటించిన తర్వాత కూడా భూ కేంద్రీకరణలో మౌలికమైన మార్పు రాలేదు. కుటుంబాల మధ్య భూమి పంపకాల ద్వారా కమతాలు ఎక్కువైనా భూ కేంద్రీకరణ తీవ్రంగానే కొనసాగుతూనే వుంది. అందువలన ఆధిపత్య కులాల చేతుల్లో వున్న భూ ఆధిపత్యాన్ని బద్దలు చేయకుండా కులవివక్షను కొనసాగించే వారి శక్తిని నాశనం చేయలేము.

విద్య, ఉపాది అంశాలలో అమలవుతున్న రిజర్వేషన్ల మూలంగా కొంతమంది దళితులు అగ్రకులాలపై ఆర్థికంగా ఆధారపడే పరిస్థితిని అధిగమించగల్గారు. అయినా అత్యధిక దళితులు ఆర్థిక పరాధీనతనుండి బయటపడడానికీ, సామాజిక అణచివేతనుండి బయటపడటానికీ రిజర్వేషన్లు పెద్దగా తోడ్పడటంలేదు. అలాగే తాజాగా డెల్టా ప్రాంతాల్లో కౌలు వ్యవస్థ వేగంగా పునరుద్ధరించబడుతున్నది. దళితులు వ్యవసాయ కార్మికులుగా మారినప్పుడు ఒకే భూస్వామి కుటుంబానికి కట్టివేయబడకుండా కొంత స్వేచ్ఛను పొందుతాడు. కొంతమేరకు వివక్షను ఎదిరించే శక్తిని లేదా దాని నుండి తప్పుకునే అవకాశాలను పొందుతాడు. కానీ కౌలు వ్యవస్థ పునరుద్ధరణతో పెత్తందారీ కులాల్లోని భూయజమానుల ఆధిపత్యంలో బతకాల్సిన పరిస్థితి లోకి కౌలుదారుడు నెట్టబడుతున్నాడు. ఆ రకంగా కౌలు వ్యవస్థ ఆర్థిక దోపిడీనే కాకుండా సామాజిక అణిచివేతను కూడా పెంచుతున్నది.

**(పట్టిక 1) వివిధ సామాజిక వర్గాలకు భూమి**

| సామాజిక వర్గం | కుటుంబాలు | మొత్తం కుటుంబాల్లో శాతం | మొత్తం భూమిలో వీరి శాతం |
|---|---|---|---|
| ఎస్సీ | 5,541 | 25.59 | 10.18 |
| ఎస్టీ | 1,467 | 6.77 | 5.38 |
| బిసి | 10,426 | 48.14 | 45.99 |
| ఓసి | 4,223 | 19.50 | 38.46 |
| మొత్తం | 21,657 | 100 | 100 |

**(పట్టిక 2) వివిధ సామాజిక వర్గాలకు రుణాలు**

| సామాజిక వర్గం | మొత్తం కుటుంబాల్లో శాతం | వ్యవస్థాగత రుణాలు శాతం | ప్రయివేటు రుణాలు శాతం |
|---|---|---|---|
| ఎస్సీ | 22.66 | 23.94 | 76.06 |
| ఎస్టీ | 6.76 | 18.43 | 81.57 |
| బిసి | 50.80 | 30.75 | 69.25 |
| ఓసి | 19.78 | 59.07 | 40.93 |
| మొత్తం | 100 | 40.46 | 59.54 |

> **❝ కులవివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటం భూస్వాములకు వ్యతిరేకంగా విస్తృతమైన ఐక్యతను సాధించే కృషికి విఘాతం కలిగిస్తుందన్న భావం బలంగా ఉంది. ఇటువంటి అభిప్రాయం కులవివక్షకు వ్యతిరేకంగా జరగాల్సిన కృషి నిర్లక్ష్యం కావడానికి దారితీస్తున్నది. ❞**

ఆధిపత్య కులాలలోని భూస్వాముల చేతుల్లో ఉన్న భూ గుత్తాధిపత్యాన్ని బద్దలు చేయాలంటే భూస్వాములను ఒంటరి చేసి వారికి వ్యతిరేకంగా అన్ని వర్గాల, అన్ని తరగతుల ప్రజలను ఐక్యం చేసి పోరాడాల్సి ఉంది. ఇటువంటి విశాల ఐక్యతను సాధించాలంటే సామాజిక వివక్షకు గురవుతున్న దళితులతో సహా దళితేతర కులాల ప్రజలను కూడా ఈ సంఘటనలో సమీకరించాల్సి ఉంటుంది. అయితే కులవివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటం భూస్వాములకు వ్యతిరేకంగా విస్తృతమైన ఐక్యతను సాధించే కృషికి విఘాతం కలిగిస్తుందన్న భావం బలంగా ఉంది. ఇటువంటి అభిప్రాయం కులవివక్షకు వ్యతిరేకంగా జరగాల్సిన కృషి నిర్లక్ష్యం కావడానికి దారితీస్తున్నది. కులవివక్ష, అంటరానితనంపై జరిగే ఉద్యమం వలన దళితులకూ, దళితేతర శ్రమజీవులకూ మధ్య వైరుధ్యం పెంచుతుందనే దాంట్లో సందేహం లేదు. కానీ ఆ వైరుధ్యం పెరగకుండా చూడాలనే పేరుతో కులవివక్ష సమస్యను విస్మరించినా, నిర్లక్ష్యం చేసినా దళితులు మనస్ఫూర్తిగా భూస్వామ్య వ్యతిరేక ఐక్య సంఘటనలో భాగస్వాములు కాలేరు. దళితేతర పేదలు తమని సమానంగా స్వీకరిస్తారన్న నమ్మకం కలిగినప్పుడే పరిపూర్ణ ఐక్యతకు దళితులు సిద్ధమవుతారు. భూస్వామ్య వ్యతిరేక శక్తుల్లో అగ్రభాగాన ఉండాల్సిన అత్యధిక దళితులు అన్య మనస్కతతో ఉంటే భూస్వామ్య వ్యతిరేక పోరాటం జయప్రదం కావడం అసాధ్యం. కులవివక్ష ప్రాతిపదికన చీలిఉన్న పేదల్లో ఉన్న వైరుద్యాన్ని పరిష్కరించుకోకపోతే పెత్తందారీ అధిపత్య కులాలు, వర్గాలు దాన్ని వినియోగించుకొని చీలికలు సృష్టించి భూసామ్య వ్యతిరేక పోరాటాన్ని సులభంగా బలహీనపరుస్తాయి. అందువలన సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటం దీర్ఘకాలంలో వర్గ ఐక్యతను బలపర్చుతుందితప్ప బలహీనపర్చదు. సామాజిక కృషి మాత్రమే దళితుల్లో దళితేతర పేదల పట్ల విశ్వాసం పెంచుతుంది. దళితేతర పేదల్లో ఉన్న కులాధిపత్య ధోరణులను బలహీనపర్చి ఐక్యతకు తోడ్పడుతుంది.

పార్లమెంటరీ ఎన్నికల అవసరాల పేరుతో సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా జరగాల్సిన కృషి నిర్లక్ష్యం చేయబడుతుంది. ఎన్నికల్లో గెలుపు సాధించాలంటే దళితుల ఓట్లే సరిపోవు. దళితేతర కులాల ఓట్లు కూడా అవసరమవుతాయి. కులవివక్ష, అంటరానితనం విషయాలపై తీవ్రంగా స్పందించినా, వాటి నిర్మూలనకు కృషి చేసినా దళితేతర కులాల ఓటర్లు దూరమవుతారన్న భయం వలన కులవివక్ష పట్ల గ్రామాలలో చూసీ చూడనట్లు ఉండే వైఖరి ఉంటున్నది. వామపక్షాలు, ఇతర అభ్యుదయ శక్తులు పార్లమెంటరీ రంగంలో పని చేస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో ఇటువంటి ధోరణులు వ్యక్తమవుతున్న సందర్భాలు ఉంటున్నాయి. యథాతథ స్థితిని కోరుకుంటున్న పార్టీలకు సామాజిక అణిచివేత పట్ల ఉదాసీనంగా వ్యవహరించటం వాటి వర్గ ప్రయోజనంలోనే ఉంది. కానీ వామపక్ష, అభ్యుదయ శక్తులు తాత్కాలిక ప్రయోజనం కోసం, ఎన్నికల్లో తక్షణ లాభం కోసం సామాజిక అణచివేత సమస్యలను ఉపేక్షిస్తే దీర్ఘకాలంలో ఆ ఎన్నికల ప్రయోజనం కూడా ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వస్తున్నది.

### పోరాట సహాయకారిగా విద్య

సామాజిక అణచివేతను ఎదిరించడంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను గమనించడంలో ఉద్యమాలలో లోపం ఉన్నది. కొంత మంది ప్రతిపాదిస్తున్నట్టుగా దళితులు సామాజిక అణిచివేతను అధిగమించటానికి విద్యే సర్వస్వమని చెప్తున్న విషయం పాక్షికమైన భావన అయినప్పటికీ మరే తరగతికీ లేనటువంటి ప్రయోజనం దళితులకు విద్య వలన ఉంటుందనేదాంట్లో సందేహం లేదు.

కుల వ్యవస్థను రక్షించడంలో అవిద్యకున్న పాత్రను ప్రాచీన పండితులు బాగా గమనించారు. అందుకే శూద్రులకు, మహిళలకు, అంటరాని కులాలకు విద్యను నిషేధించారు. విద్యార్జన ప్రయత్నం చేసేవారి నేరానికి శిక్షలు ప్రతిపాదించారు. కులవివక్షను నిర్మూలించాలనుకునేవారు విద్యకున్న ప్రాధాన్యతను నిర్లక్ష్యం చేస్తే పోరాటంలో ఉపయోగపడే ఒక ప్రధాన సాధనాన్ని కోల్పోతాం.

పుట్టుకతోనే వచ్చే అంశాలు ముఖ్యమా, పరిసర ప్రభావాలు ముఖ్యమా అన్న వివాదం వున్నా ఒక వ్యక్తి విద్య ద్వారా విజ్ఞానాన్ని సంపాదించుకునే శక్తిపై పరిసరాల ప్రభావం ఎక్కువగా వుంటుంది. బలహీనవర్గాలకు విద్యా-విజ్ఞానాల సాధనకు ప్రస్తుతం అనువైన వనరులు, పరిసరాలు లేవు. ఇప్పటికీ అనేక కులాలలో మొదటి తరం చదువరులు కూడా లేని కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలలోని పిల్లలు చదివి అన్ని అవకాశాలున్న పిల్లలతో పోటీ పడడం అనేది అసాధ్యం. అందువలన బలహీనవర్గాల కుటుంబాలు విద్యా సముపార్జనలోకి ఎంత తొందరగా ప్రవేశిస్తే తమపై వివక్షను అధిగమించే అవకాశం అంత మెరుగుపడుతుంది.

నాణ్యమైన విద్యను దళితులు పొందగలిగితే గ్రామంలోపల, గ్రామం బయట భూకామందు మీద ఆధారపడకుండా బతకగలిగే అవకాశాలను పొందవచ్చు. వివక్షకు కేంద్రబిందువుగా ఉండే గ్రామం నుండి బయటపడవచ్చు. ఆధునిక వృత్తుల్లోకి ప్రవేశించే అవకాశాలను మెరుగుపర్చుకోవచ్చు. వాస్తవంగా భూస్వాముల మీద ఆధారపడకుండా గ్రామం బయట పనుల్లోకి ఇతర కులాల వారికన్నా ఎంత ఎక్కువగా దళితులు ప్రవేశించగల్గితే సామాజిక అణచివేత నుండి బయటపడేందుకు అంత ఎక్కువ అవకాశం ఏర్పడుతుంది. అయితే విద్యావంతుడైన ప్రతి దళితుడూ గ్రామం నుండి బయటపడ్తాడని అనుకోలేం. ఆధిపత్య కులాల భూస్వాముల వ్యవసాయంలో లభించే ఉపాధిని కాదని బతకగలగడం సాధ్యంకాదు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా దళితుల విద్యాభివృద్ధి సామాజిక వివక్షకూ, అణిచివేతకూ వ్యతిరేకంగా గ్రామంలోనే పోరాడే శక్తినిస్తుంది. తమ ఆత్మాభిమానాన్నీ, గౌరవాన్నీ, పౌరహక్కులనూ రక్షించుకోవాలన్న చైతన్యాన్నీ, సంఘటితం కావాలన్న స్పృహనూ ఇస్తుంది.

విద్యావసరాన్ని దళితులు గమనించడం ప్రారంభించిన కాలంలోనే నాణ్యమైన విద్య నుండి దళితులు, ఇతర పేదలను దూరం చేసే వ్యవస్థీకృత మార్పులు విద్యారంగంలో జరుగుతు న్నాయి. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తరువాత విద్యారంగం రెండు సమాంతర పాయలుగా చీలిపోయింది. సంపన్నులకు తోడ్ప డే ప్రైవేటు విద్యారంగం అన్ని స్థాయిల్లో శరవేగంగా పెరుగుతున్నది. సంపన్నులు, ఆధిపత్య కులాల్లోని స్తోమత కలిగిన అత్యధికులు తమ పిల్లలను నాణ్యమైన విద్యను అందించే ప్రైవేటు రంగానికి తరలిస్తున్నారు. ప్రభు త్వ విద్యారంగం

దళితులు, వెనక బడిన కులాలు, మైనారిటీలు, ఇతర కులాల్లోని పేదలకు పరిమితమైపోయింది. నిధుల కేటాయింపు తగ్గిపోతున్నది. నాణ్యత తీవ్రంగా దెబ్బతింటున్నది. గత దశాబ్దంలో కేంద్ర-రాష్ట్ర స్థాయి ల్లో విద్యారంగంపై చేసిన ఖర్చు నిష్పత్తిని పరిశీలిస్తే ప్రభుత్వాలు విద్యపట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించాయో స్పష్టమవుతోంది. అఖిల భారత స్థాయిలో విద్యపై ఖర్చు నిష్పత్తి 2000- 01 సంవత్సరంలో 17.4 శాతం వుండగా, 2009-10 నాటికి 10.5 శాతానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో కూడా విద్యపై ఖర్చు నిష్పత్తి 2000-01లో ఉన్న 13.4 శాతం నుండి 2009-10 నాటికి 10.4 శాతానికి పడిపోయింది. ఈ పరిణామం మూలంగా అత్యధికంగా నష్టపోతున్నది దళితులు, ఇతర బలహీనవర్గాలు. విద్యా సాధన ద్వారా వివక్ష నుండి బయటపడొచ్చన్న ఆశ భగ్నమై పోతున్నది.

> **"కుల వ్యవస్థను రక్షించడంలో అవిద్యకున్న పాత్రను ప్రాచీన పండితులు బాగా గమనించారు. అందుకే శూద్రులకు, మహిళలకు, అంటరాని కులాలకు విద్యను నిషేధించారు. విద్యార్జన ప్రయత్నం చేసేవారి నేరానికి శిక్షలు ప్రతిపాదించారు. కులవివక్షను నిర్మూలించాలనుకునే వారు విద్యకున్న ప్రాధాన్యతను నిర్లక్ష్యం చేస్తే పోరాటంలో ఉపయోగపడే ఒక ప్రధాన సాధనాన్ని కోల్పోతాం."**

సామాజిక అణిచివేతను అధిగమించడంలో విద్య యొక్క ప్రాధాన్యతను గమనించినా దళిత సంఘాలు, ఇతర ప్రజాసంస్థలు రిజర్వేషన్ల సమస్యకు ఇచ్చిన ప్రాధాన్యతను ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ఇవ్వడంలేదు. వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు బలహీన వర్గాల కోసం కృషి చేస్తున్న ఇతర సంఘాలు, విద్య అంశాన్ని దాదాపు విస్మరించాయనే చెప్పాలి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రారంభ కాలంలో ప్రజా వుద్యమాలు విద్యకిచ్చిన ప్రాధాన్యతను కూడా ఈనాడు ఇవ్వడం లేదు. సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలోనే కాక, పీడిత వర్గ ఐక్యతను నిర్మించేకృషిలో కూడా విద్యకు చాలా ప్రాధాన్యత వుందనేది సామాజిక మార్పును కోరేవారు విస్మరించ రాదు.

### పరోక్ష పరిష్కారం- ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సేవలను దళితులకు అందుబాటు లోకి తేవడం, కుల వివక్షను తప్పించుకోడానికి ఒక మార్గంగా భావించబడుతున్నది. కులవివక్ష బహిరంగ ప్రదేశాల్లోను, ప్రైవేటు ప్రదేశాల్లోను అగ్రకుల వ్యక్తులతో దళితులు **ఇంటరాక్ట్** అయ్యే సందర్భాల్లో వ్యక్తమవుతున్నది. కులవివక్షకు తావులేకుండా అన్ని కులాలకు చెందిన వ్యక్తులు సమానత్వం, పరస్పర గౌరవం ప్రాతిపదికన కలిసి మెలిసి (ఇంటిగ్రేషన్) ఉండడం అత్యుత్తమమైన మార్గం. అది సమూలమైన మార్పులు వచ్చినప్పుడే సాధ్యమవుతుంది. ఈలోపు ప్రభుత్వం చేపడుతున్న కొన్ని చర్యలు, విధానాలు దళితులు, దళితేతరుల మధ్య ఇంటరాక్షన్‌ను పరిమితం చేయడం ద్వారా కులవివక్షను అవాయిడ్ చేసేదానికి దోహదం చేస్తున్నాయి. కలిసిమెలిసి కాకుండా ఎవరిది వారికి కేటాయించే మంచినీటి పథకాలు, శ్మశానాలు, కమ్యూనిటీ హాల్స్ ప్రత్యేకంగా దళిత వాడల్లో నిర్మాణం చేయడం, ప్రార్థనా మందిరాలను కూడా వేరుగా నిర్మించుకోవడం కొన్ని ఉదాహరణలు. కానీ రవాణా సౌకర్యాలు, పాఠశాలలు, పరిపాలనా కార్యాలయాలను దళితేతర కులాలతో సంబంధం లేకుండా అవాయిడ్ చేయడం సాధ్యంకాదు. ఇక్కడ కూడా ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు అగ్రకులాల్లోని ధనవంతులను ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వైపుకు, ప్రైవేట్ విద్యా సంస్థల వైపుకు మళ్ళించడం ద్వారా పరోక్షంగా ఆధునిక సెగ్రిగేషన్‌ను పునరుద్ధరిస్తున్నాయి. ఈ సెగ్రిగేషన్ కులవివక్ష నిర్మూలనకు చిహ్నం కాకపోయినా దాన్ని కొంత మేరకు అవాయిడ్ చేయ దానికి తోడ్పడుతుందన్న భావంతో దళితులు అంగీకరిస్తున్నారు. సామాజిక అణిచివేతను నిర్మూలించడానికి సిద్ధంగాని పాలకులకు దళితుల ఓట్లను ఆకర్షించడానికి సరిపోయే మార్గంగా ఉన్నది. సంపూర్ణంగా కులవివక్షను నిర్మూలించి అన్ని కులాల ప్రజలు పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో కలిసిపోయే పరిస్థితిని సాధించుకునేందుకు తగినంత సానుకూల పరిస్థితి లేని ప్రస్తుత నేపథ్యంలో అభ్యుదయ శక్తులు కూడా ఈ పరిమిత పరిష్కారాల కోసం అడగాల్సి వస్తున్నది.

### సైద్ధాంతిక -సాంస్కృతిక కృషి ప్రాధాన్యత

అనేక మంది సంస్కర్తలు కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు భావజాల మార్పే కీలకమని చెప్పిన విషయాన్ని అంగీకరించ నప్పటికీ దాని ప్రాధాన్యతను విస్మరించలేం. కులవివక్ష వలన లబ్ధి పొందుతున్న ఆధిపత్య కులాల్లోని భూస్వామ్య శక్తుల మనస్సులను భావజాల కృషి ద్వారా మార్చగలమని అను కోకపోయినా కులవివక్ష నిర్మూలనలో ఆశక్తి ఉన్న దళితులను, కులవివక్ష నిర్మూలన వలన నష్టంలేని దళితేతర పేదలను భావజాల కృషి ద్వారా కులవివక్షకు వ్యతిరేకంగా చైతన్యం చేయగలం. ఇటువంటి అవసరం కూడా వున్నది. కులవివక్ష, అంటరానితనం పూర్వజన్మ కర్మ ఫలితమని,

**రాష్ట్రంలో ఎస్సీ వుప ప్రణాళికకు కేటాయించిన /ఖర్చు చేసిన నిధులు, మళ్లించిన నిధులు రూ. కోట్లలో**

| వ.నె | సం॥ | రాష్ట్ర | ఎస్‌సిఎస్‌పి | ఖర్చులు | %ఎస్‌సిఎస్‌పి | %ఖర్చులు | 15/16% | తేడా |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | 1992-93 | 1996.94 | 170.84 | 182.78 | 8.56 | 106.99 | 299.54 | 116.76 |
| 2. | 1993-94 | 2075.55 | 207.66 | 214.99 | 10.01 | 103.53 | 311.33 | 96.34 |
| 3. | 1994-95 | 2179 | 256.7 | 216.97 | 11.83 | 84.52 | 325.5 | 108.53 |
| 4. | 1995-96 | 2719.78 | 300.57 | 267.46 | 11.05 | 88.98 | 407.97 | 140.51 |
| 5. | 1996-97 | 2773.13 | 232.82 | 227.95 | 8.04 | 97.91 | 415.97 | 188.02 |
| 6. | 1997-98 | 3585.05 | 339.72 | 213.92 | 9.48 | 62.97 | 537.76 | 323.84 |
| 7. | 1998-99 | 4678.95 | 510.83 | 532.61 | 10.92 | 104.26 | 701.84 | 169.23 |
| 8. | 1999-00 | 5479.50 | 545.21 | 189.42 | 9.95 | 34.74 | 821.93 | 632.51 |
| 9. | 2000-01 | 8228.12 | 450.51 | 344.38 | 5.48 | 76.44 | 1234.22 | 889.84 |
| 10. | 2001-02 | 8319.02 | 424.52 | 225.29 | 5.10 | 0 | 1247.85 | 1022.56 |
| 11. | 2002-03 | 8553.19 | 903.91 | 873.84 | 10.57 | 0 | 1282.98 | 409.14 |
| 12. | 2003-04 | 10970.45 | 1113.19 | 1274.41 | 10.51 | 0 | 1645.57 | 271.16 |
| 13. | 2004-05 | 13291.20 | 1181.03 | 1341.50 | 8.89 | 0 | 1993.68 | 652.18 |
| 14. | 2005-06 | 15650.77 | 1332.12 | 1333.54 | 8.51 | 0 | 2347.62 | 1014.08 |
| 15. | 2006-07 | 20000 | 1557.65 | 2369.37 | 7.79 | 0 | 3240 | 870.63 |
| 16. | 2007-08 | 30500 | 4355.9 | 3830.16 | 14.28 | 0 | 4941 | 1110.84 |
| 17. | 2008-09 | 44000 | 7630.42 | 3611.44 | 17.34 | 47.33 | 7128 | 3516.56 |
| 18. | 2009-10 | 36635.58 | 5609.3 | 2764.8 | 15.31 | 49.29 | 5934.96 | 3170.16 |
| 19. | 2010-11 | 36727.97 | 6132.55 | 3739.9 | 16.70 | 60.98 | 5949.93 | 2210.03 |
| 20. | 2011-12 | 7233.35 | 6966 | 3557.84 | 16.82 | 8.27 | -- | 34.8.16 |
| 21. | 2012-13 | 8369.08 | 7927.45 | 4467.48 | 17.10 | 9.13 | -- | 2459.97 |
| 22. | 2013-14 | 8584 | 8578.76 | 2643.99 | 14.27 | 8.68 | -- | 5934.77 |
| | **మొత్తం** | **57536.07** | **55354.78** | **34523.80** | **14.27** | **8.56** | **--** | **30801.98** |

> “ కులవివక్ష వలన లబ్ధి పొందుతున్న ఆధిపత్య కులాల్లోని భూస్వామ్య శక్తుల మనస్సులను భావజాల కృషి ద్వారా మార్చగలమని అనుకోకపోయినా కులవివక్ష నిర్మూలనలో ఆసక్తి ఉన్న దళితులను, కులవివక్ష నిర్మూలన వలన నష్టంలేని దళితేతర పేదలను భావజాల కృషి ద్వారా కులవివక్షకు వ్యతిరేకంగా చైతన్యం చేయగలం. ఇటువంటి అవసరం కూడా ఉన్నది. ”

ఈ జన్మలో అనుభవించకతప్పదని నమ్మేవారు దళితుల్లో ఇప్పటికీ ఉన్నారు. కుల వ్యవస్థను ప్రస్తుత జన్మలోనే ఎదిరించాలనుకునే వారిలో భ్రమలు కల్పించే భావజాలం హిందూ మతం కల్పించబడింది. ఈ జన్మలో సుకృతాలు చేసుకుంటే పునర్జన్మలో ఉన్నత కులాలలో జన్మించే అవకాశం కల్పించబడింది. అంటే కులవ్యవస్థ దుర్మార్గాలను బతికున్నప్పుడు ప్రతిఘటించకుండా చనిపోయిన తరువాత మంచి జరుగుతుందని ఎదురు చూసేట్లు చేస్తున్నది. ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం వంటి ఇతర మతాలలో కూడా పరలోకం, పునర్జన్మ, పాపం అని భావాలున్నందున మతం మార్చుకున్న బలహీనవర్గాలు కుల వ్యత్యాసాలను తప్పించు కోలేకపోతున్నాయి.

ఎక్కువ కులం, తక్కువ కులం అన్న భావాలు, దళితుల్లోని ఉప కులాల మధ్య కూడా ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఉప కులాల మధ్య ఉన్న కులవివక్ష భావాలను నిర్మూలించుకోకుండా అగ్రకులాలు పాటిస్తున్న సామాజిక అణిచివేతను ఎదిరించే నైతిక శక్తి దళితులకు బలపడదు. ఈ భావాలకు దళితుల జీవితాల్లో భౌతిక పునాది లేకపోయినప్పటికీ సమాజంలోని వేల సంవత్సరాల సామాజిక అణిచివేతను అనుభవించడం వలన దళితుల్లో అవి జీర్ణించుకొని ఉన్నాయి. అనేక దళితేతర కులాలు కూడా పైకులాల చేత హీనంగా చూడబడుతున్నప్పటికీ దళితులకన్నా అధికమన్న భావాలను కలిగిఉన్నాయి. తరతరాల నుండి స్థిరపడిపోయిన ఈ భావాలను బద్దలు కొట్టడానికి తీవ్రమైన భావజాల, సాంస్కృతిక కృషి అవసరం. ఈ కృషి విద్యాధికుల్లో మాత్రమే జరిగితే సరిపోదు. గ్రామస్థాయిలో దళిత, దళితేతర పేదల్లో విడిగాను, పోరాటాల సందర్భాల్లోను నిరంతరం జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ కృషి తగినంతగా జరగడంలేదు.

వివక్షతను నిరసించే దళిత పురుషులు తమ కుటుంబాల్లోని మహిళలను సమానంగానో, మర్యాదగానో చూడలేనప్పుడు తమపై జరిగే వివక్షను సంపూర్ణంగా ఎదిరించడం సాధ్యంకాదు. అగ్రకులాల్లో మహిళలను అసమానంగా చూడడం, మొత్తం అసమాన వ్యవస్థ పరిరక్షణకు తోడ్పడుతుంది. మహిళల విషయంలో అగ్రకులాలను అనుకరించడం, పితృస్వామిక భావాలను పాటించడం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగే పోరాటానికి దళితులకు బలం చేకూర్చదు. అందువలన మహిళా సమానత్వం పట్ల సానుకూలత ప్రదర్శించటం అస్పృశ్యత వ్యతిరేక పోరాటానికి బలం చేకూర్చుతుంది.

### రిజర్వేషన్-పరిమిత శక్తి

రిజర్వేషన్లకు అటువంటి శక్తి లేకపోయినా దళితుల సమస్యలన్నింటినీ పరిష్కారం చేయగలిగిన శక్తి వాటికి ఉందని పాలకవర్గాలు భ్రమలు సృష్టిస్తుంటాయి. దళితుల్లోని మధ్య తరగతి కూడా రిజర్వేషన్లు, రిజర్వేషన్ రిప్రజెంటేషన్లకే అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. వాస్తవంగా రిజర్వేషన్లు పాలకవర్గాలలోకి కోఆప్ట్ చేసుకోవడానికి అవసరమైన ఒక మధ్యతరగతిని సృష్టించాయే తప్ప, సామాజిక పీడనను నిర్మూలించడానికి పెద్దగా తోడ్పడలేదు. రిజర్వేషన్ రెప్రజెంటేషన్ దళితుల్లోని కొంత మంది పై వర్గాలకు ఎగబాకడం ఆహ్వానించాల్సిన విషయమైనా, పై వర్గాలను ప్రజాస్వామీకరించడానికి తోడ్పడదే అయినా సామాజిక పీడనకు గురవుతున్న అత్యధిక దళితుల జీవితంలో మౌలిక మార్పు తేవడానికి తోడ్పడలేదు.

స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాలు తమ వ్యవస్థలో ఇముడ్చుకోవడానికి దళితుల్లో నుండి ఒక తరగతిని అభివృద్ధి చేసుకోవడానికి రిజర్వేషన్ను ఒక సాధనంగా వినియోగించుకున్నది. ఈ రకంగా అభివృద్ధి అయిన మధ్య తరగతి అస్పృశ్యత, కులవివక్ష నిర్మూలన వంటి సమస్యలకన్నా రిజర్వేషన్లు, ప్రమోషన్లు వంటి సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది. రాజకీయ ప్రాతినిధ్యం పొందిన ఎక్కువ మంది ప్రస్తుత వ్యవస్థలో అంతర్భాగం అయిపోయారు. మరి కొంత మంది అగ్రకులాలను అనుకరించడానికి పూనుకుంటున్నారు. దళితుల వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్లో జరిగిన ఉద్యమాల సందర్భంగా ప్రత్యర్థి పక్షాలు చేసుకున్న విమర్శలను పరిశీలిస్తే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రకులాలు చేసిన వాదనలను ఏరకంగా దళిత నాయకులు కూడా దిగమింగారో చూడవచ్చు. ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా లక్ష్మిపేట గ్రామంలో 2012లో లో ఐదుగురి దళితుల్ని ఆధిపత్య కులాలకు చెందినవారు హత్య చేసినప్పుడు జిల్లాలోని దళిత ప్రజా ప్రతినిధులు, పరిపాలన యంత్రాంగంలో కీలక స్థానాల్లో ఉన్న దళిత అధికారులు వ్యవహరించినతీరు దళితుల పేరుతో రిజర్వేషన్లను ఉపయోగించుకుని అధికార యంత్రాంగంలో చేరినవారు దళితులకు న్యాయం చేయకపోగా పాలకవర్గాలకూ, ఆధిపత్య కులాలకూ ఏ రకంగా లోబడి ఉన్నారో స్పష్టం చేసింది.

రిజర్వేషన్ల ద్వారా దళితుల్లో అభివృద్ధి అయిన మధ్య తరగతి మొత్తం దళితులకు సమాజిక న్యాయం సాధించే పోరాటానికి నాయకత్వం వహిస్తుందని అంశించారు. కొంత మంది వ్యక్తులు మినహా, మొత్తం బృందంగా ఈ మధ్యతరగతి అటువంటి పాత్రను నిర్వహించడం లేదు. దళితుల విముక్తి కోసం కృషి చేయడంలో విద్యాధిక దళితుల వైఫల్యంపై డా॥అంబేద్కర్ అనేక సందర్భాల్లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసారు. దళిత విద్యాధికుల్లో కొంతమంది వ్యక్తులు దళితుల పక్షాన నిలబడి ఉద్యమిస్తున్నప్పటికీ వారి సంఖ్య చాలా పరిమితం. అందువలన దళితుల్లోని మధ్యతరగతితో పరిమితం కాకుండా, అత్యధిక మంది దళితులను సమీకరిస్తేనే సామాజిక అణచివేతపై పోరాటం ఫలితాలను సాధించగల్గుతుంది.

### హక్కుల అసర్షన్ ముఖ్యం

కులవివక్షతపైనా, అంటరానితనంపైనా అవిశ్రాంతంగా, నిరంతరంగా పోరాడినప్పుడే వాటి నిర్మూలన సాధ్యమవుతుంది. అటువంటి కృషి కొంతమేరకు జరుగుతున్నా ప్రధానంగా దళిత సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు ఘటనలకు స్పందించడమే ఎక్కువగా ఉన్నది. ఇప్పుడిప్పుడు మాత్రమే దళితులు తమ హక్కులను అసెర్ట్ చేసుకునే పద్ధతిలో ఉద్యమాలు జరగాలన్న ఆలోచన పెరుగుతున్నది.

సామాజిక వివక్షకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమం ఒక సమగ్రమైన స్థాయిలో జరగాలి. భూ కేంద్రీకరణ బద్దలు కొట్టడం కోసం జరిగే మౌలికమైన, దీర్ఘకాలికమైన పోరాటంతో విద్య కోసం, ప్రభుత్వ సౌకర్యాల కోసం, హక్కుల కోసం తక్షణం జరిగే పోరాటాలను మేళవించి నడపాలి. దాంతోపాటు దళితులు, దళితేతర పేదల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత నిర్మించేందుకు సాంస్కృతిక భావజాల కృషిని కూడా జోడించాలి. అప్పుడే దళితులకు, దళితేతరులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చగల్గుతాం.

# కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదు




**ఎస్. వీరయ్య**

ఒక్క అవకాశం ఇస్తే అరచేతిలో స్వర్గం చూపిస్తానన్నది గతంలో బిజేపీ. ప్రజలు ఏకంగా ఆరు సంవత్సరాలకు పైగానే దేశాన్ని పరిపాలించేందుకు బిజేపీకి అవకాశం ఇచ్చారు. వాజ్‌పేయ్ నాయకత్వంలో ఎన్‌డిఏ పాలనను ప్రజలు చూసారు. అవినీతి, ముఠాకుమ్ములాటలతో ప్రస్తుతం కాంగ్రెస్ భ్రష్టుపట్టిపోయింది. దేశ ప్రయోజనాలను బహుళజాతి సంస్థలకూ, దేశీయ బడా పారిశ్రామికవేత్తలకూ తాకట్టు పెట్టింది. కాంగ్రెస్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తామేనని బిజేపీ చెప్పుకుంటున్నది. నీతివంతమైన పాలన అందించగలమనీ, క్రమశిక్షణకు బిజేపీ మారు పేరని కూడా చెప్పుకున్నది. దేశభక్తిపై తమకే పేటెంట్ హక్కు ఉన్నట్టు చెప్పుకుంటోంది. దేశ ప్రయోజనాలకు అంకితమై పనిచేస్తున్న పార్టీ బిజేపీ మాత్రమేనని ప్రకటిస్తున్నది. ఆరు సంవత్సరాల వాజ్‌పేయ్ పాలన, గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ వంటి రాష్ట్రాల్లో బిజేపీ పాలనను ఇప్పటికే ప్రజలు రుచిచూసారు.

ఆర్థిక విధానాలు, అవినీతి, ముఠాకుమ్ములాటలు, విదేశాంగ విధానం వంటి అనేక విషయాల్లో కాంగ్రెస్, బిజేపి ఒకే గూటి పక్షులు. ఒకే నాణానికి బొమ్మా–బొరుసులు. 2జి స్పెక్ట్రం, బొగ్గు, కామెన్ వెల్త్ క్రీడలు, ఆదర్శ హౌసింగ్ వంటి పెద్ద పెద్ద అవినీతి కుంభకోణాలన్నింటిలోనూ కాంగ్రెస్–బిజేపీల పాత్ర బట్టబయలైంది. ప్రధానమంత్రిగా ఉన్న వాజిపేయ్ చేతుల్లో టెలికాం మంత్రిత్వ శాఖ ఉండగానే 2జి కుంభకోణానికి మూలమైన లైసెన్సింగ్ పాలసీలో మార్పులు చేసారు. యుపీఏ ప్రభుత్వంలో ప్రతి విషయం ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు చెప్పే చేసామని డిఎంకే స్పష్టం చేసింది. గనుల కుంభకోణంలో మూడు సంవత్సరాల జైలు శిక్ష పడిన వ్యక్తి, మోడీ ప్రభుత్వంలో నేటికీ మంత్రిగా కొనసాగుతున్నారు. అనేక అవినీతి కుంభకోణాలు బయటకు వస్తున్నాయి. కర్నాటక బిజేపి ప్రభుత్వంలో అవినీతి తారాస్థాయికి చేరింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఎడ్యూరప్ప పదవినుండి వైదొలగవలసి వచ్చింది. అయినా ఆయన తనంతట తాను బిజేపిని వదిలారే తప్ప, ఆయన మీద బిజేపీ చర్య తీసుకోలేదు. పైగా మళ్లీ పార్టీలోకి ఆహ్వానించి ప్రముఖ స్థానం కల్పించింది. కర్నాటక బిజేపీ ప్రభుత్వంలో గాలి జనార్ధన రెడ్డీ బ్రదర్స్ గనుల కుంభకోణం దేశమంతా తెలిసిందే. గాలి సోదరులను నేటికీ అక్కున చేర్చుకుని కాపాడుతూనే ఉన్నది. గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా జరిగిన గనుల కుంభకోణాన్ని ఎంబి షా కమిషన్ బట్టబయలు చేసింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ ప్రభుత్వాల్లోనూ అనేక మంది మంత్రులు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రధాని అభ్యర్థిని ఎంపిక చేసే క్రమంలో బిజేపీలో ముఠాకుమ్ములాటలు బహిరంగంగానే వెల్లడైనాయి. అవినీతి, ముఠాకుమ్ములాటలు, పదవీకాంక్ష, ఆశ్రితపక్షపాతం వంటి విషయా ల్లో కాంగ్రెస్–బిజేపీలు దొందూ దొందే అని తేలిపోయింది.

వాజ్‌పేయ్ ప్రధానమంత్రిగా ఉండగానే అమెరికాతో అణుఒప్పందానికి ప్రతిపాదించారు. మన్మోహన్‌సింగ్ సారథ్యంలో ఒప్పందం పూర్తిచేసారు. చిల్లర వర్తకంలో విదేశీ పెట్టుబడుల గురించి ఎన్డీఏ ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రి జస్వంత్‌సింగ్, వాణిజ్యశాఖా మంత్రి మురసోలీమారన్ ప్రతిపాదించారు. యుపిఏ ప్రభుత్వంలో చిదంబరం సారథ్యంలో దానిని పూర్తిచేసారు. విదేశీ పెట్టుబడులు వస్తే ప్రమాదం ఏమీ లేదనీ, పెప్సీ, కోకాకోలాలు వచ్చినంత మాత్రాన భారతీయ షర్బత్ విలువ తగ్గిపోతుందా? అనీ జస్వంత్‌సింగ్ ప్రశ్నించారు. “ఈ రెండు పార్టీల విధానాలు ఒక్కటే” నని బడా పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ ఫ్రంట్‌లైన్‌కు, ఒక ఇంగ్లీష్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బహిరంగంగానే చెప్పారు. బిజేపీ, శివసేన మద్దతుతోనే రాహుల్ బజాజ్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తమ కుటుంబానికి కాంగ్రెస్‌తో 70 సంవత్సరాలకు పైగా ఉన్న అనుబంధాన్ని కూడా రాహుల్‌బజాజ్ విస్మరించజాలనంటారు. ఎన్డీయే పాలనలో పెట్టుబడుల ఉపసంహరణకు అరుణ్‌శౌరి ఆధ్వర్యంలో ఒక మంత్రిత్వశాఖనే ప్రారంభించింది. యుపీఏ అధికారంలోకి రాగానే ఆ మంత్రిత్వ శాఖను రద్దు చేసినప్పటికీ పెట్టుబడుల ఉపసంహరణ క్రమాన్ని కొనసాగించింది. ఇన్సూరెన్స్ రంగంలో ప్రయివేటు పెట్టుబడులను పెంచేందుకు, కొత్త పెన్షన్ విధానం పేరుతో ఉన్న పెన్షన్ హక్కును హరించేందుకు ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని కొనసాగింపుగానే యుపీఏ ప్రభుత్వంలో ఇన్సూరెన్స్ బిల్లు, పెన్షన్ సంస్కరణల బిల్లు పార్లమెంట్‌లో ప్రతిపాదించారు. అవి తమ ప్రభుత్వం హాండగా ప్రతిపాదించినవేనని బహాటంగానే చెప్పి బిజేపీ వాటిని ఆమోదించింది. పెట్టుబడి దారులు సొంత బ్యాంకులు ఏర్పాటు



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు నాయకులు.**

> **"కాంగ్రెస్-బిజెపీలు రెండూ దేశంలో రెండు పార్టీల వ్యవస్థ లేదా రెండు రాజకీయ క్యాంపుల వ్యవస్థ ఏర్పడాలని కోరుకుంటున్నాయి. అధికార కేంద్రీకరణవైపే అడుగులు వేస్తున్నాయి. నిరంకుశ విధానాలు బలపడడానికి పునాదులు వేస్తున్నాయి. విధానాల స్థానంలో వ్యక్తులను ప్రధాని అభ్యర్థులుగా ముందుకు తెస్తున్నాయి."**

చేసుకునేందుకు, బ్యాంకింగ్ రంగంలో విదేశీ సంస్థల పాత్ర పెంచేందుకు యుపీఏ ప్రతిపాదించిన బిల్లును బిజేపీ సమర్థించింది. ఇవన్నీ పార్లమెంట్‌లో కాంగ్రెస్–బిజేపీలు పరస్పరం సహకరించుకుని ఆమోదించారు. ప్రకృతి వనరులను బడా పారిశ్రామికవేత్తలు కొల్లగొట్టేందుకు సహకరించడంలో కూడా కాంగ్రెస్–బిజేపీలకు తేడాలేదు. విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడంలోనూ పోటీ పడుతున్నారు. గుజరాత్ ప్రభుత్వానికి "ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ గుజరాత్" (పెట్టుబడులకు అనుకూలమైన గుజరాత్) అని ముద్దుపేరును నరేంద్రమోడి ప్రకటించుకున్నారు. గుజరాత్‌లో మోడీ ప్రభుత్వాన్ని సమర్ధవంతమైన ప్రభుత్వమనీ, వ్యాపారాలకు అనుకూలమైన ప్రభుత్వమనీ అమెరికన్ ఆటోమొబైల్ అధినేత ఫోర్డ్ కితాబులిచ్చారు. మోడీ మురిసిపోయారు. విదేశీ పెట్టుబడులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం ఆధ్వర్యంలో క్యాబినెట్ కమిటీనే ఏర్పాటు చేసారు. కాంగ్రెస్ ఆర్థిక స్వాతంత్ర్యం గురించి మాట్లాడినా, బిజేపీ స్వదేశీ నినాదం ఇచ్చినా ఆచరణలో ఇద్దరూ విదేశీ సేవలోనే తరిస్తున్నారు.

సంక్షేమ పథకాలను కుదించేందుకు ఆధార్‌కార్డ్‌ను యుపిఏ ప్రభుత్వం ఒక ఆయుధంగా వాడుకుంటున్నది. 2009 బిజేపీ ఎన్నికల ప్రణాళికలో కూడా ఆధార్‌కార్డు గురించే ప్రస్థావించడం యాదృచ్ఛికం కాదు. ఈ రెండు పార్టీల ఎన్నికల ప్రణాళికల్లోనూ ప్రయివేటు రంగంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, మైనింగ్ రంగంలో ప్రయివేటు పెట్టుబడులు, ఖనిజ సంపదకు సంబంధించిన అనుమతులు, ప్రయివేటు రంగంలో నూతన బొగ్గు బ్లాకులు, స్పెషల్ ఎకనామిక్ జోన్స్ వంటివి రామ్మడిగా దర్శనమిస్తాయి.

కాంగ్రెస్–బిజేపీలు రెండూ దేశంలో రెండు పార్టీల వ్యవస్థ లేదా రెండు రాజకీయ క్యాంపుల వ్యవస్థ ఏర్పడాలని కోరుకుంటున్నాయి. అధికార కేంద్రీకరణవైపే అడుగులు వేస్తున్నాయి. నిరంకుశ విధానాలు బలపడడానికి పునాదులు వేస్తున్నాయి. విధానాల స్థానంలో వ్యక్తులను ప్రధాని అభ్యర్థులుగా ముందుకు తెస్తున్నాయి.

కాంగ్రెస్–బిజేపీలలో ఎవరి నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పడినా ఒకే ఆర్థిక విధానాలు అనుసరించారు. యుపిఏ అయినా, ఎన్డీయే అయినా ఈ రెండూ రాజకీయ క్యాంపులు అంతిమంగా సరళీకృత విధానాలనే అమలు చేసాయి. 1990 నుండి నేటి వరకు కేంద్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా వ్యక్తుల పేర్లు, పార్టీల పేర్లు, ఫ్రంట్‌ల పేర్లు మారినా విధానాలు మాత్రం దండలో దారం లాగా కొనసాగాయి. కాంగ్రెస్–బిజేపి రెండూ అభివృద్ధి పేరుతో ఈ విధానాలు అమలు చేయడంలో పోటీ పడుతున్నాయి. వీరిద్దరి మధ్య పోట్లాట పదవుల కోసమే తప్ప, విధానాల కోసం కాదు. పదవులకు సంబంధించినంతవరకు బద్ధశత్రువులైన వీరిద్దరూ విధానాల విషయంలో మాత్రం ప్రియమిత్రులు.

కాంగ్రెస్–బిజేపీల మధ్య విధాన పరమైన తేడాలేమీ లేవు. బిజేపీ మతోన్మాద విధానాలను అనుసరిస్తుండగా, కాంగ్రెస్ అవకాశవాద వైఖరి ప్రదర్శిస్తున్నది. ఇంతకు మించి ఈ రెండు పార్టీల మధ్య మౌలికంగా తేడా ఏమి లేదని తేలిపోయింది. నాయకులు కూడా ఈ విషయాన్ని దాచుకోవడం లేదు. రానున్న ఎన్నికల్లో బిజేపీ అధికారంలోకి వచ్చినట్లయితే విదేశాంగ విధానంలో ముఖ్యంగా అమెరికాకు సంబంధించినంత వరకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలనే అనుసరిస్తుందని జూలై 2013లో బిజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ వాషింగ్‌టన్‌లో ప్రకటించారు. విదేశీ పాలకుల మన్ననలను పొందేందుకు ఈ "స్వదేశీ" నాయకుడు పడిన పాట్లివి. యుపిఏ పాలనలో ఏర్పడిన అణు ఒప్పందానికి పునాదులు తమ పాలనలోనే పడ్డాయని కూడా బహిరంగంగానే చెప్పుకున్నారు. "2004లో మేము అధికారం నుండి వైదొలిగే నాటికే భారత్–అమెరికా సంబంధాలు చారిత్రాత్మక స్థాయికి తెచ్చాము. ఇప్పుడు ఇరు దేశాలు ఆర్థిక భాగస్వాములే కాదు, వ్యూహాత్మక భాగస్వాములు కూడా అయ్యాయ"ని అన్నారు. బిజేపీ ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకమనికొంత మంది భావిస్తున్నారని, కానీ ఆర్థిక సంస్కరణలకు తాము పూర్తిగా అనుకూలమని స్పష్టం చేసారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆర్థిక విధానాలకు తాము ఏనాడు ఆటంకం కాలేదని వివరణ ఇచ్చుకున్నారు. గత జనవరిలో "మోడీ నామిక్స్" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ... 90వ దశకంలో పివి నరసింహారావు ప్రారంభించిన సరళీకృత ఆర్థిక విధానాలనే ఇప్పుడు గుజరాత్‌లో నరేంద్రమోడి ప్రభుత్వం అమలు జరుపుతున్నదని బిజేపీ నేత అరుణ్‌జేట్లీ సగర్వంగా ప్రకటించారు. బిజేపీ నేత శత్రఘ్న సిన్హా మరో అడుగు ముందుకేసారు. ఆర్థిక విధానాలు, విదేశాంగ విధానం, రక్షణ వంటి కీలకమైన అంశాల్లో కాంగ్రెస్ – బిజేపీలు ఒకే అభిప్రాయం కలిగి ఉన్నాయని అన్నారు. భారత రాజకీయాల్లో ఎవరూ అంటరానివారు కారన్నారు. ఎన్నికల అనంతరం అవసరమైతే ఈ రెండు పార్టీలు కలిసి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయం పరిశీలించాలని ప్రకటించారు. ఈ ప్రకటన కూడా వాషింగ్‌టన్‌లోనే సుమా! ఈ తాపత్రాయమంతా ఎవరిని ప్రసన్నం చేసుకోవడానికో ఇంకా వేరే చెప్పాలా?

ఈ రెండు పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలు గమనిస్తున్నారు. "ప్రతిపక్షంలో రాన్నప్పుడు తాను వ్యతిరేకించిన విధానాలనే తాను అధికారంలోకి రాగానే బిజేపీ కూడా అమలు చేస్తున్నద"ని 37వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి విమర్శించారు. 2012 ఫిబ్రవరిలో రెండు రోజుల సార్వత్రిక సమ్మె సందర్భంగా యుపిఏ ప్రభుత్వ విధానాలను ఐఎన్‌టియుసీ అగ్ర నాయకత్వం కూడా తూర్పార బట్టింది. దేశ చరిత్రలోనే మొదటిసారిగా కొన్ని ముఖ్యమైన విధానపరమైన అంశాలపైన కార్మికవర్గం ఐక్యంగా పోరాడుతున్నది. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటానికి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఒక నాయకుడికి మరొక నాయకుడు ప్రత్యామ్నాయం కాదు. ఒక పార్టీకి మరొక పార్టీ లేదా ఒక ఫ్రంట్‌కు మరొక ఫ్రంటు కూడా ప్రత్యామ్నాయం కాదు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయం కావాలి. ఈ ప్రత్యామ్నాయ విధానాలకోసం రాద్యమాలు బలోపేతం చేయాలి.




# 21వ శతాబ్దపు భూ దోపిడీ

ఫ్రెడ్ మెగ్డాఫ్

పెట్టుబడికి పట్టుకొమ్మలైన దేశాల్లోని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలు గానీ, ప్రైవేటు పెట్టుబడులు గానీ, మధ్య ప్రాచ్య దేశాల్లోని సంపదలు గానీ, భారతదేశంలోని ప్రభుత్వాలు గానీ... ఇవాళా రేపూ అవి దోచేస్తున్న భూముల గురించిన వార్తలు నిత్యం 'శిఖర వార్త'ల్లోకి ఎక్కుతూనే వున్నాయి. ఈ భూదోపిడీ ఏ మేరకు సాగుతోందో ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. అమెరికన్ కార్పొరేట్ కంపెనీ కార్గిల్, కొన్ని సూట్‌కేస్ కంపెనీల ద్వారా కొలంబియా దేశంలోని 1 లక్షా 30 వేల ఎకరాల భూమిని వ్యవసాయేతర ప్రయోజనాలకోసం అంటే మైనింగ్, రోడ్లు, భవన నిర్మాణాల వంటివాటికోసం చట్ట వ్యతిరేక పద్ధతుల ద్వారా దిగమింగడానికి ప్రయత్నించిన ఉదంతంలో ఆ దేశంలోని అమెరికా రాయబారి ప్రమేయం వున్నదని బయట పడడంతో 2013 జులైలో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇంత భారీ ఎత్తున భూములు స్వాహా చేయడం అంటే ఆ భూముల మీద ఆధారపడిన జనాభా, వారి కుటుంబాలు నిర్వాసితులు కావడమే. కొన్ని లక్షల కుటుంబాలు వారి జీవనాధారాన్నీ, సమిష్టిగా జీవించే స్వభావాన్నీ, వారి సంస్కృతినీ కోల్పోవలసిరావడమే.

ఈ పరిణామాలన్నింటినీ పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క చారిత్రక నేపథ్యం నుండి మనం పరిశీలించాలి. అంటే గత మూడు శతాబ్దాల చరిత్రను మొత్తంగా తిరగవెయ్యమని కాదుగానీ, ఆ పరిణామక్రమాన్ని పెట్టుబడి, (లేదా అప్పుడే పోగుబడుతున్న పెట్టుబడి) ప్రజలను భూమి నుండి వేరు చేయడానికి ఉపయోగించిన టెక్నిక్‌లను నిర్దిష్ట ఉదాహరణల ద్వారా మనం గ్రహించగలగాలి. నిరంతరాయంగా ప్రజలను పల్లెలనుండి పట్టణాలకు వలస కట్టేలా ఎలా చెయ్యగలిగిందీ మనం అర్థం చేసుకోవాలి.

మానవ నాగరికత అభివృద్ధి చెందడంలో ప్రధానమైన వనరు భూమి. అటువంటి ప్రధానమైన వనరును సరుకుగా మారద్చడం ద్వారా పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి మొదలయ్యింది. మానవాళి తిండికి అవసరమైన ఆహారధాన్యాలు, పశువుల మేత, కట్టెల ఇంధనం ఒకటేమిటి సమస్తం అందిస్తున్న భూమిని ఆధునిక పెట్టుబడిదారీ విధానం మొదలైన నాటినుండి అమ్మడం, కొనడం దానిమీద స్పెక్యులేషన్ వ్యాపారం చెయ్యడం మొదలైంది. ఏ భూమిని ఏం చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయో గ్రహించాక పెట్టుబడి ఆయా భూముల్ని లాక్కుని అక్కడి ప్రజానీకాన్ని నిర్వాసితులు చేయడం ఒక పరిశ్రమగా మొదలుబెట్టింది.

గత మూడు శతాబ్దాల చరిత్రను తరచి చూస్తే పెట్టుబడి పోగువేతకు భూదోపిడీ ఒక రాజమార్గంగా నిలిచింది. ప్రజలను ఆ భూములనుండి వెళ్ళగొట్టడానికి అవసరమైతే గన్ను లేకపోతే పెన్ను (చట్టాలు) లేకుంటే రెండూ ఉపయోగపెట్టారు. పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలవల్ల మార్కెట్‌లో నెలకొన్న పోటీ తట్టుకోలేక, కౌళ్ళు చెల్లించలేక రైతులు, వ్యవసాయదార్లు తమ భూములు వదిలేసుకోవాల్సి వచ్చింది.

**పెట్టుబడి ప్రాథమిక సంచయం**

1700 సంవత్సరం నాటికి బ్రిటీష్ వ్యవసాయంలో నూతన పరిణామాలు చోటు చేసుకున్నాయి. వ్యవసాయ దిగుబడి బాగా పెరిగి కరవుల తాకిడి తగ్గుముఖం పట్టింది. 1750 నాటికి ఇంగ్లాండ్ సమృద్ధిగా ఆహార ధాన్యాలు పండించగలిగింది. దాదాపు 13 శాతం పంటను ఎగుమతి చేసింది. పంతొమ్మిదవ శతాబ్దారంభానికల్లా పంట ఉత్పత్తిని గణనీయంగా పెంచింది.

ఇది అద్భుతమైన మార్పు అని మాటల్తో సరిపెట్టలేం. ఆహారోత్పత్తి, ఉత్పాదకత ఇంత వేగంగా పెరగడానికి అనేక కారణాలున్నాయి. ఆహారపంట అవగానే అదే భూమిని గ్రాసం పెంచడం కోసం వాడటం మరుసటి ఏడాది రెండు పంటలూ ఆహార పంటలు వెయ్యడం ఇలా అనేక మార్పులు చేర్పులు ఆలంబనగా ఆహారోత్పత్తి పెంచారు. దిగుబడి పెంచడం ఒక ఉద్యమంగా సాగింది. ఇంగ్లీషులో ఆ కాలంలో



**రచయిత యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్‌లో ప్లాంట్, సాయిల్ సైన్స్‌లో ప్రొఫెసర్. మంత్లీ రివ్యూ ఎడిటర్ జాన్ బెల్లమీ ఫాస్టర్‌తో కలిసి 'మహా ఆర్థిక సంక్షోభం' (2009), 'ప్రతి వాతావరణ సైంటిస్టు తెలుసుకోవలసిన విషయాలు' (2011) అన్న పుస్తకాలు రాశారు.**

> **"1830లలో ఈ రకంగా కొల్లగొట్టబడిన లక్షలాది ఎకరాల భూమిని సర్వేచేయించి అమెరికా 'లాట్లు'గా అమ్మకానికి పెట్టింది. ఆ రకంగా భూమిని ప్రైవేటీకరించడం వల్ల అప్పటి వరకూ ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో ఆర్థిక ఉత్తేజం (బూమ్) ఏర్పడింది. బ్రిటన్ నుండి, ఉత్తర అమెరికా ఖండం నుండి ఈ భూముల కొనుగోళ్ళ మార్కెట్‌కు పెట్టుబడులు వరదలా ప్రవహించాయి."**

దీన్ని 'ఇంప్రూవ్‌మెంట్ మూవ్‌మెంట్' అనేవారు.

వ్యవసాయ ఉత్పాదకత ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో నికరమైన ఆదాయం తెచ్చిపెడుతున్న భూములమీద ఆసాముల దృక్పథంలో మార్పులు వచ్చాయి. ఈ మార్పులే పారిశ్రామిక విప్లవాభివృద్ధికి దోహదం చేశాయి. బ్రిటన్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికీ, వ్యవసాయానికీ మధ్య వున్న సంబంధం గురించి మైక్‌సిన్స్ వుడ్స్ ఇలా చెప్పాడు.

"భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవడానికి వీలుగా - ఉత్పాదకతనూ, లాభాలను పెంచుకోవడానికి వీలుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా భూమిని విముక్తి చెయ్యాలని కోరుకున్నారు. పెట్టుబడి పోగువేతకు ఆటంకంగా వున్న సంప్రదాయక చట్టాలను రద్దు చెయ్యాలని 16-18 శతాబ్దాల మధ్యన విపరీతమైన ఒత్తిడి పెరిగింది. ఉమ్మడి భూములమీద సమిష్టి హక్కుకు బదులు ప్రైవేటు హక్కులు కావాలనీ, ప్రైవేటు భూముల మీద కౌలుహక్కులు రద్దుచేసి యాజమాన్య హక్కులు ఇవ్వాలనీ, చట్టపరంగా చిన్న కమతాల మీద కౌల్దారీ హక్కులు కావాలనీ.. ఇలా అనేకానేక డిమాండ్లు ముందుకు వచ్చాయి. ఈ డిమాండ్లు అన్నీ 'ఆస్తి' మీద సంప్రదాయంగా వుండే అభిప్రాయాల్లో వచ్చిన మార్పులకు సంకేతాలు. పెట్టుబడిదారీ విధానానికి అంకురార్పణ చేసిన 'ప్రైవేటు ఆస్తి' ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు. గ్రామ కట్టుబాట్లు, చట్టాలు, నియంత్రణలూ అన్నీ పక్కనబెట్టి వ్యక్తులకూ, సమూహాలకూ భూమిమీద వున్న సంప్రదాయక హక్కును రద్దుచేస్తూ ప్రైవేటు ఆస్తిగా నికిలోకి వచ్చింది"

దాంతో అప్పటిదాకా ఆ భూమిమీద ఆధారపడి జీవించినవారు నిర్వాసితులయ్యారు. పొట్ట గడుపుకోడానికి కూలినాలి పనులకు, ఊళ్ళో వున్న చిన్న ఫ్యాక్టరీలో పనులకు వెళ్ళడం అవీ కరువైతే దాపునే వున్న పట్టణాలకు వలస పోవడం లేదా ఉత్తర అమెరికా ఖండంలో ఏర్పాటు చేసిన నూతన వలస కాలనీలకు పోవడం చేసేవారు. కొంపాగోడు లేకుండా ఇలా ఏ ఆధారం లేకుండా పోయిన వాళ్ళను ఆ రోజుల్లో 'పాపర్లు' అనేవాళ్ళు. పంతొమ్మిదవ శతాబ్దం చివరి భాగంలో "ఇలా యూరప్‌నుండి వలస పోయిన వాళ్ళ సంఖ్య లక్షల్లో వుండింది.

**పంతొమ్మిదవ శతాబ్దపు పత్తి**

పారిశ్రామిక విప్లవంలో భాగంగా మొదట పత్తిని ఏకడానికీ, తరువాత గుడ్డ వడకడానికీ అనేక మిల్లులూ, ఫ్యాక్టరీలూ వచ్చాయి. ఇందుకు అవసరమైన పత్తినంతా మొదట్లో వలస భారతదేశం నుండి కొల్లగొట్టుకువచ్చేవాళ్ళు. తర్వాత ఈజిప్టు వంతయ్యింది. అయితే పంతొమ్మిదవ శతాబ్దం మధ్యభాగానికి వచ్చేసరికి పత్తి మార్కెట్‌లో పెను విస్ఫోటనం సంభవించింది. అమెరికా, దక్షిణాసియా దేశాలు ఈ మార్కెట్‌కు సేవలు అందించే ప్రధాన కేంద్రాలుగా ఆవిర్భవించాయి.

ఐరోపా సామ్రాజ్యాధిపతులు నెలకొల్పిన ఈ వలస కాలనీలకు భూమి ఎక్కడనుండి వచ్చిందంటే అప్పటిదాకా ఆదివాసులు, మూలవాసులు, గిరిజన ప్రాంతాలకు చెందిన 'రిజర్వ్' భూములను 'రిజర్వేషన్' నుండి ఎత్తేశారు. ఉమ్మడి భూములుగా ప్రకటించి ఐరోపానుండి వలసవచ్చిన వారికి అందుబాటులోకి తెచ్చారు. ఈ భూముల్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యం కిందికి తీసుకువచ్చారు. దక్షిణ అమెరికాకు పత్తికి వున్న సంబంధం గురించి వాల్టర్ జాన్సన్ ఈ రకంగా చెప్పుకొచ్చాడు.

"1830ల చివరినాటికి సెమినోల్, క్రీక్, చికాసా, చోక్‌తావ్, చిరాకీ తెగలకు చెందిన వారి భూములన్నీ లాక్కుని వారిని పశ్చిమ మిసిసిపి ప్రాంతానికి పరిమితం చేశారు. అలా మూలవాసులనుండి కొల్లగొట్టబడిన భూమి పంతొమ్మిదవ శతాబ్దపు ప్రథమార్థంలో అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థకు కావల్సిన ప్రధాన రంగానికి పునాదిగా మారింది."

1830లలో ఈ రకంగా కొల్లగొట్టబడిన లక్షలాది ఎకరాల భూమిని సర్వేచేయించి అమెరికా 'లాట్లు'గా అమ్మకానికి పెట్టింది. ఆ రకంగా భూమిని ప్రైవేటీకరించడం వల్ల అప్పటివరకూ ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో ఆర్థిక ఉత్తేజం (బూమ్) ఏర్పడింది. బ్రిటన్ నుండి, ఉత్తర అమెరికా ఖండం నుండి ఈ భూముల కొనుగోళ్ళ మార్కెట్‌కు పెట్టుబడులు వరదలా ప్రవహించాయి.

ఆఫ్రికా ఖండం నుండి తీసుకువచ్చిన వారినీ, రెడ్ ఇండియన్ తెగలకు చెందిన వారినీ బానిసలుగా చేసుకొని సాగుచేసిన పత్తి పంటే బ్రిటన్‌లోని మాంచెస్టర్, లాంక్‌షైర్, కౌంటీ వంటి పట్టణాలలో నెలకొల్పిన టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు ముడిసరుకుగా వచ్చి చేరేది. టెక్స్‌టైల్స్ మిల్లులకు అది స్వర్ణయుగం లాంటిది. అందాకా వ్యవసాయం చేసుకుంటున్న లక్షలాది మందికి రైతులు భూములనుండి బేదఖలయినందువల్ల వాళ్ళంతా పనులకోసం వచ్చి, ఈ మిల్లుల్లో కనాకష్టమైన కూలికి వేతన కార్మికులుగా చేరారు. ఆ రకంగా 'రెడ్ఇండియన్ల భూమి, నల్లజాతీయుల శ్రమ, అట్లాంటిక్ పెట్టుబడి, బ్రిటీష్ పరిశ్రమలూ కలిసి జాతీయంగా, అంతర్జాతీయంగా వర్ణాహంకార పూరితమైన ఆధిపత్య ఆర్థిక వ్యవస్థగా ఎదిగాయి.'

పత్తి పండించడానికి కావల్సిన భూముల వెంపర్లాటలో అమెరికాలోని మూలవాసుల నుండి లాక్కొన్న భూములతో ఒక్లహామా వంటి రాష్ట్రాలు ఏర్పడ్డాయి. మూలవాసులకు రిజర్వ్ చేసిన భూముల నుండి కూడా వాళ్ళు మళ్ళీ 'డాయిస్' (జనరల్ అలాట్‌మెంట్) చట్టం' 1887 ద్వారా మరోసారి నిర్వాసితులయ్యారు. భూమి మీద 'వ్యక్తిగత ఆస్తిహక్కు' కల్పించడం ద్వారా రెడ్ఇండియన్ తెగ ప్రజానీకం కూడా అమెరికన్ సమాజంలోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ ఇట్టే ఇముడుతారనీ, అందుకే ఈ చట్టం చేశారనీ పాలకశక్తులు చెప్పుకొచ్చాయి. కాని ఆచరణలో రెడ్ఇండియన్ తెగ ప్రజానీకం పెద్దఎత్తున భూములు కోల్పోయారు ఈ చట్టం మూలంగా.

**బలవంతపు గెంటివేతలు : ఆఫ్రికాలో వలసలు**

సబ్-సహారా ఆఫ్రికన్ దేశాలైన దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే (దక్షిణ రొడీషియా), జాంబియా (ఉత్తర రీడిషియా)లలోకి వ్యవసాయ సెటిలర్లు పెద్ద ఎత్తున వచ్చి చేరడంతో ఆయా దేశాల్లో భారీసంఖ్యలో జనాలు భూములు కోల్పోయారు. 19వ శతాబ్దాంతం నుండి 20వ శతాబ్దం మధ్య నాటివరకూ ఐరోపా 'సెటిలర్'లు జింబాబ్వేలో వ్యవసాయ భూముల్ని భారీఎత్తున సొంతం చేసుకున్నారు. ఆ దేశానికి స్వాతంత్ర్యం

వచ్చేనాటికి మూడోవంతు సాగుకి లాయకీ అయిన భూమి సెటిలర్‌ల చేతుల్లో చిక్కుకు పోయింది. అదే దక్షిణాఫ్రికా విషయానికి వస్తే 1930ల నాటికే 90 శాతం భూమి 'ఐరోపా సెటిలర్ల' ఆధీనంలోకి పోయింది. నమీబియాను చూస్తే 1990ల నాటికి సగానికి పైగా సాగుకి లాయకీ అయిన భూమి 'సెటిలర్ల' చేతుల్లోకి పోయింది.

**"వలస దేశాల్లోని సాగు భూముల దోపిడీ ఆ దేశాలకు స్వాతంత్య్రం వచ్చేనాటిదాకా యధేచ్ఛగా కొనసాగింది. ఈ సాగుభూముల దోపిడీకి పాల్పడినవన్నీ అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లోని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలే. 'ఫైరిస్టోన్' అనే కంపెనీ రబ్బర్ ప్లాంటేషన్‌ల కోసం లైబీరియాలో భూములు దోచేసింది. బ్రూక్ బ్రాండ్ కంపెనీ (ప్రస్తుతం దీన్ని యూనిలీవర్ కంపెనీ మింగేసింది) తేయాకు తోటల పెంపకానికి కెన్యాలో భూములు స్వాహం చేసింది"**

వలస దేశాల్లోని సాగు భూముల దోపిడీ ఆ దేశాలకు స్వాతంత్ర్యం వచ్చేనాటిదాకా యధేచ్ఛగా కొనసాగింది. ఈ సాగుభూముల దోపిడీకి పాల్పడినవన్నీ అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లోని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలే. 'ఫైరిస్టోన్' అనే కంపెనీ రబ్బర్ ప్లాంటేషన్‌ల కోసం లైబీరియాలో భూములు దోచేసింది. బ్రూక్ బ్రాండ్ కంపెనీ (ప్రస్తుతం దీన్ని యూనిలీవర్ కంపెనీ మింగేసింది) తేయాకు తోటల పెంప కానికి కెన్యాలో భూములు స్వాహం చేసింది. 'డెల్‌మాంట్' కంపెనీ పండ్ల తోటల పెంపకానికి అదే కెన్యాలో భూములు దిగమింగేసింది. మాలవి, అంగోలా, మొజాంబిక్ దేశాల్లోని సాగుభూమినీ శ్వేతజాతి సెటిలర్లు హక్కుభుక్తం చేసుకున్నారు.

**అమెరికా గుత్త పెట్టుబడిదారీ వ్యవసాయం**

20వ శతాబ్దపు కాలమంతా ఆహార పంటలు, పశుపోషణల మీద పెట్టుబడికి సము ఖత చూపించేవారు కాదు. కారణం ఈ రెండింటిమీదా రాబడి తక్కువగా వుండడమే. పశుపోషణమీద అంతో ఇంతో ఏటా నికర లాభాలు వచ్చినా వ్యవసాయ పరిస్థితి అలా వుండేది కాదు. ఓ ఏడాది లాభాలు వస్తే రెండే ళ్ళు కనీస మద్దతు ధర కూడా రాక రైతులు దివాళా ఎత్తి పోయేవారు. అప్పుల పాలయ్యే వాళ్ళు.

వ్యవసాయంలో ఆ కాలంలో పెట్టిన పెట్టుబడులు కూడా వ్యవసాయ భూమిమీదనో, సాగుబడి మీదనో పెట్టినవి కావు. వ్యవసాయే తర అనుబంధ పరిశ్రమల మీద పెట్టినవి. అంటే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ యంత్రాలు వంటి పరిశ్రమలలో పెట్టిన పెట్టుబడులు. గత మూడు, నాలుగు దశాబ్దాలలో ఈ 'ఇన్‌పుట్' పరిశ్రమల మీదా, వ్యవసాయ దిగుబడి కొనుగోళ్ళు, నిల్వలు, అమ్మకాలవంటి 'అవుట్‌పుట్' రంగాలమీదా పెట్టుబడుల ప్రాబల్యం పెరిగి గుత్తాధిపత్యం స్థాయికి చేరుకున్నాయి.

ఇదే కాలంలో అమెరికాలోని భారీ వ్యవసాయ కమతాలే కాకుండా ఐరోపా, బ్రెజిల్, చైనా వంటి దేశాలలో కూడా ఆహారోత్పత్తుల దిగుబడి విపరీతంగా పెరిగింది. ఈ రంగానికి పెద్దఎత్తున సాయం అందడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. అందుబాటులోనున్న వ్యవసాయ సామాగ్రి (యాంత్రీకరణ) వల్ల చిన్న కమతాల మీద అంత గిట్టుబాటు కాకున్నా భారీ భూమకమతాల మీద సాగుబడి మాత్రం ఆర్థికం గా బాగా అచ్చొచ్చింది. భారీ కమతాల యజ మానులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు భారీ పరిమాణంలో వుంటాయి. కాబట్టి రేటులో రాయితీ పొందగలు గుతారు. అంతెందుకు ప్రభుత్వం ఇచ్చే వ్యవ సాయ రుణాలు కూడా ఎంత పెద్ద మొత్తాల యితే అంత వడ్డీరేటు తగ్గింపుతో అందచేస్తుంది. వీళ్ళకు లభించే గిట్టుబాటుధర చిన్న, సన్నకారు రైతులకు లభించే దాని కన్నా ఎక్కువగానే వుంటుంది. ఇక భారీ కమతాలలో పనులకు పెట్టుకునే వాళ్ళ శ్రమను దోచుకోవడం వుండనే వుంది. వ్యవసాయ కమతాలు ఎంత భారీగా వుంటే అంత భారీ ఎత్తున యంత్రాలతో పని చేయిస్తూ కూలీల నుండి భారీ ఉత్పాదన రాబట్టు కుంటాయి. అందువల్ల చిన్న కమతాలలో వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయాయి. ఏ చిన్న రైతయినా గోధుమ, మొక్కజొన్న, సోయా, పత్తి వంటి పంటలు వెయ్యాలంటే అతనికి పట్నంలో ఉద్యోగం చేసి సంపాదించి పెట్టే వారసుడో, వారసురాలో వుండాల్సిన పరిస్థితి నెలకొన్నది. అలా అయితే తప్ప ఆ రైతు కుటుంబానికి జరుగుబాటు లేని పరిస్థితి ఏర్పడింది.

ఈ కారణాల రీత్యానే వేలాదిమంది చిన్న రైతులు తమ భూముల్ని భారీ కమతగాళ్ళకు అమ్మేశారు. అమెరికా 1929లో ఏర్పడిన 'మహామాంద్యం' అనంతర కాలంలో లక్షలాది మంది చిన్న రైతులు నిర్వాసితులు కావడానికి అదే కారణం. అయితే ఇక్కడ గుర్తించాల్సిన మరో అంశం ఏమిటంటే కొంతమంది చిన్న రైతులు మాత్రం తమ ఉత్పత్తులను స్థానికంగా వుండే రెస్టారెంట్లకు నేరుగా అమ్మడం, రైతు సహకార మార్కెట్‌ల ద్వారా జనానికి నేరుగా అమ్మడం, కమ్యూనిటీ వ్యవసాయం చేపట్టడం ద్వారా నిలదొక్కుకోగలిగారు. వీరి సంఖ్యా స్వల్ప మే అయినప్పటికీ పెట్టుబడిదారీ వ్యవసాయానికి ప్రత్యామ్నాయం ఏమిటో చూపించగలిగారు.

ఇక కోళ్ళ పెంపకం, సీమ పందుల పెంపకంలోకి కూడా 'ఫ్యాక్టరీ వ్యవసాయం' చొరబడిపోవడంతో లక్షల సంఖ్యలో రైతులు ఉపాధి కోల్పోయారు. కార్పొరేట్ కంపెనీలు ఈ రంగంలోకి కాలూనడంతో 'కాంట్రాక్టు పెంపకం' అమలులోకి వచ్చింది. దాంతో రైతులు కాంట్రాక్టు రైతులుగా మారిపోయారు. దీని గురించి రిచర్డ్ లివోన్‌టిన్ ఇలా అంటాడు – "17, 18 శతాబ్దాలలో పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావపు కాలంలో రైతుకు నికరమైన, స్థిర

**'మార్క్సిస్టు'కు**

**మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**"పేద దేశాలను కొల్లగొట్టడానికి వీలుగా వాణిజ్య ఒప్పందాల పేరిట రైతుల నాసురుతీసే అనేక ఒప్పందాలను అతి దుర్మార్గంగా, బలవంతంగా ఆయా దేశాలపై రుద్దారు. మెక్సికో ఒప్పందం,ఉత్తర అమెరికా స్వేచ్ఛా, వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) ఈ కోవకు చెందినవే. 'సంస్థాగత సర్దుబాట్లు' (స్ట్రక్చరల్ అడ్జస్ట్ మెంట్స్) పేరిట అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.యం.యఫ్), ప్రపంచ బ్యాంకులు జమైకా - హైతీ వంటి దేశాలపై ఇలాంటి ఒప్పందాలే రుద్దాయి."**

ఆదాయం ఉండి భూమికి హక్కుదారిగా ఉండే వాడు. తన ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకొనే వాడు. అలాంటి స్వతంత్ర రైతులు నేడు మార్కెట్‌లో గత్యంతరం లేక తమ శ్రమను అమ్ముకునే కూలీ అయ్యాడు"

### నయా-ఉదారవాద వాణిజ్య ఒప్పందాలు

పేద దేశాలను కొల్లగొట్టడానికి వీలుగా వాణిజ్య ఒప్పందాల పేరిట రైతుల నాసురుతీసే అనేక ఒప్పందాలను అతి దుర్మార్గంగా, బలవంతంగా ఆయా దేశాలపై రుద్దారు. మెక్సికో ఒప్పందం ఉత్తర అమెరికా స్వేచ్ఛా, వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) ఈ కోవకు చెందినవే. 'సంస్థాగత సర్దుబాట్లు' (స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్స్) పేరిట అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.యం.యఫ్), ప్రపంచ బ్యాంకులు జమైకా – హైతీ వంటి దేశాలపై ఇలాంటి ఒప్పందాలే రుద్దాయి.

21వ శతాబ్దపు భూదోపిడీలో రకరకాల పద్ధతులు కొనసాగుతున్నాయి. సంక్షిప్తంగా వాటి గురించి ఇలా చెప్పుకోవచ్చు

– ప్రపంచీకరించబడిన పెట్టుబడికి లబ్ధి చేకూర్చిపెట్టే నూతన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు (డబ్ల్యు.టి.ఓ, నాఫ్టా వగైరాలు)

– భూమి మీద పేద దేశాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తులుపులు బార్లా తెరవాల్సి రావడం.

– ధనిక దేశాలు కేంద్రంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బలపడడం, సట్టా వ్యాపారం పెరగడం.

– ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం, ఆహార ఉత్పత్తులు సాగించే పేద దేశాలలో వరదలు, కరువుల వల్ల స్థూల జాతీయోత్పత్తి దెబ్బతినిపోవడం. ప్రత్యేకించి ఆహార ఉత్పత్తుల దిగుమతుల మీద ఆధారపడిన దేశాల పరిస్థితులు ఆందోళనకర స్థాయికి దిగజారిపోవడం. 2008లో సంభవించిన ప్రపంచ ఆహార సంక్షోభం ఇప్పటికీ ఈ దేశాలను వెంటాడటం.

– అమెరికా, ఐరోపా దేశాలు సంప్రదాయక ద్రవ ఇంధనాల 'బయోఫ్యుయల్'ను ప్రత్యామ్నాయంగా వాడుకో చూస్తున్నందున ఇధనాల్ తయారీకి మొక్కజొన్న వంటివి, 'బయోడీజిల్' తయారీకి సోయాబీన్, పామాయిల్ తోటల్ని విరివిగా వాడేస్తున్నారు. ఈ పంట విస్తీర్ణమూ పెరిగింది. దాంతో కీలకమైన వ్యావసాయిక భౌగోళిక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అరుగంటిపోతున్నాయి. వర్షపాతం ఎంత మాత్రమూ ఈ నష్టాన్ని పూడ్చే పరిస్థితిలేదు.

పై ధోరణులకు తోడు అనేక దేశాల్లో కౌలు రైతులకు ఎలాంటి రక్షణ లేకపోవడం, రైతుల హక్కులలో లోటుపాట్లు, అలవిమాలిన అవినీతి – ఇవన్నీ కలిసి విదేశీపెట్టుబడులు భారీ భూదోపిడికి పాల్పడేందుకు అవకాశం కలిగిస్తున్నాయి. ప్రధానంగా ఆఫ్రికా దేశాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలో భూముల్ని దీర్ఘకాలిక 'లీజు'లకు తీసుకుని రైతులను ఆ భూముల నుండి బేదఖలు చేస్తున్నారు. కొలంబియా, బ్రెజిల్ వంటి దేశాల్లో దేశీయ పట్టుబడులు భారీ కమతాల వ్యవసాయం పేరిట రైతులను భూమికి దూరం చేస్తున్నాయి.

2008 నాటి ఆహార సంక్షోభం మొదలయిననాటి నుండి ఈ దశాబ్దకాలంగా చూస్తే రైతులు నిర్వాసితులు కావడం అనేది అంతకు ముందుకన్నా భిన్నమైన మార్గంలో నడుస్తోందని స్పష్టమవుతుంది. రైతులు వ్యవసాయ భూముల నుండి బేదఖలు కావడం అనేక దేశాల్లో చాలా వేగంగా సాగుతోంది. మరీ ముఖ్యంగా పేద దేశాల్లో ఈ సమస్య తీవ్రతరమవుతోంది. దీనికి తోడు అమెరికా, యూరప్ దేశాలు ఆహారోత్పత్తులను 'ఇథనాల్' 'బయోడీజిల్' వంటి సంప్రదాయేతర ఇంధనాల ఉత్పత్తికి విరివిగా వాడడం ద్వారా ప్రపంచ వ్యవసాయ మార్కెట్‌లో కొత్త వెంచర్లు మొదలుపెట్టాయి. మరో చిన్న సమస్య ఏమిటంటే – ప్రైవేటు సంపన్నులు కొంతమంది వ్యక్తులుగానూ, పరిరక్షణా సంస్థలు కొన్ని 'పరిరక్షణ' పేరిట వేలాది ఎకరాల భూకమతాలు కొని అట్టేపెట్టేసారు. ఆ కమతాల చుట్టుపక్కల నివసించే జనాభా ఏ అవసరాల రీత్యా అయినా ఈ భూముల్లోకి ప్రవేశించడం నిషిద్ధంగా మారింది.

వ్యవసాయ భూములు, వ్యవసాయ ఉత్పత్తులు నేడు ఇంత పెట్టుబడుల ఆకర్షకంగా ఎందుకు తయారయ్యాయి అనే విషయమై 'హర్ట్‌మాన్ అండ్ కంపెనీ' తరపున బ్రిటిష్ కేంద్రంగా పనిచేసే ఒక ప్రైవేటు పరిశోధక సంస్థ సర్వే చేసి నివేదిక రూపొందించింది.

దీన్ని నూతన తరహా భూ దురాక్రమణగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు సాగిన బంగారం వేట లా ఇవాళ పంట భూముల వేట కొనసాగుతోంది. ఇదేదో కేవల పెట్టుబడులకు సంబంధించిన కథకాదు. శరవేగంగా పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న దారిద్ర్యం – పట్టణీకరణ, అనూహ్యంగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల నేపథ్యంలో మానవాళి ఎదుర్కొంటున్న ఆహార భద్రత సమస్యకూ, వ్యవసాయ ఆస్తులకు కొత్తగా ఎనలేని ప్రాధాన్యత సంపాదించుకోవడానికీ మధ్యన అనులోమానుపాత సంబంధం ఉంది. వ్యవసాయ భూములు నేడు బలమైన పెట్టుబడి వర్గాన్ని ఆకర్షిస్తుందంటే అదేదో వ్యవసాయం చేసే జనాన్ని ఉద్ధరిద్దామని మాత్రంకాదు. సైన్సునీ, ఆధునిక పరిజ్ఞానాన్నీ, ఆధునిక యంత్రాలనూ, యాజమాన్య దక్షతలనూ కలిపి ఆహారేతర ఉత్పత్తులను పండించి కోట్లు గడించాలనే లక్ష్యంతో వారీపనిచేస్తున్నారు. మానవాళికి అంతంత మాత్రం ఉన్న ఆహార భద్రతను మరింత నీరు గార్చేందుకే ఇది దారితీస్తుంది.

"నీటిపారుదల సౌకర్యం కనుచూపుమేరలో ఉండి, సాగుకు లాయకీ అయిన వ్యవసాయ భూమి అయితేచాలు, రాబోయే కాలంలో అది మనం పట్టిన బంగారం అవుతుంది. అందుకే నేను చెప్పుకోదగ్గ పెట్టుబడులు పెట్టా భూముల మీద" అంటున్నాడు పేరున్న ఒక హెడ్జ్–ఫండ్ మేనేజరు 'మైకేల్ బరీ'. ఈ పెట్టుబడులన్నీ తక్షణ ఉత్పత్తి రాబడి ఆశించి పెట్టినవికావు, సట్టా వ్యాపారాన్ని ఉద్దేశించి పెట్టినవే. ఇవాళ అనేక కార్పొరేట్ కంపెనీలూ, పెట్టుబడుల ఫండ్ మేనేజర్లూ నీరు, భూమి, ఖనిజాలు, హైడ్రోకార్బన్ వనరుల మీద భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. పంట పండించడానికి నీరు అవసరం కాబట్టి పేద దేశాల్లోని వ్యవసాయ భూముల దురాక్రమణకు తోడు నీటి దోపిడికూడా చోటు చేసుకుంటోంది.

ఆఫ్రికా ఖండం ఇలాంటి దోపిడికి పెట్టు

బడిదారులకు 'అదృష్టదేవత'గా కానవస్తోంది. ఈ ఖండంలోని దేశాల్లోని విశాలమైన వ్యవసాయ భూములు నిరుపయోగంగానో, అతి స్వల్ప దిగుబడిని ఇచ్చేవిగానో ఉన్నాయి. అమెరికా చైనా, భారత్, జపాన్, ఐరోపా దేశాలు, ఇంగ్లాండ్ – ఈ అన్ని దేశాల భూభాగ వైశాల్యాన్ని కలిపిన దానికంటే ఎక్కువ వైశాల్యంగల భూమి కలిగిఉన్న ఖండం ఆఫ్రికా ఖండం – అందుకే సామ్రాజ్యవాద భూ దురాక్రమణకు ఆఫ్రికా ఖండం ఆలవాలంగా చిక్కింది. ఈ ఖండంలో కేవలం 10శాతం భూమికి మాత్రమే చట్టపరమైన హక్కులు ఉండడం పెట్టుబడులకు బాగా కలిసివచ్చిన అంశం. కెన్యా, దక్షిణాఫ్రికా, నమీబియా, జంబాబ్వే దేశాలలో మాత్రమే గణనీయమైన వ్యవసాయ భూములు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా గతంలో ఈ దేశానికి వచ్చి ఆక్రమించుకున్న ఐరోపా సెటిలర్లు, వారి వారసులవే. ఆఫ్రికా దేశాల్లో మెజార్టీ భూములు రాజ్యం ఆధీనంలోనే ఉన్నాయి. వ్యవసాయం, ఇతరేతర అవసరాల కోసం అక్కడి ప్రజలకు తమ చుట్టు ప్రక్కల ఉన్న భూములమీద సంప్రదాయక వినియోగ హక్కులు వినా మరే స్థిర హక్కులూ లేవు.

> "వాస్తవానికి ఈ భూగ్రహం మీద పేద దేశాలలో మొత్తంగా ఎంత భూమి ఈ మాదిరి విదేశీపెట్టుబడిదారులు, స్వదేశీ పెట్టుబడిదారులు, సార్వభౌమనిధుల ఆధీనంలో చిక్కుపడిఉంది అనేది లెక్కతియ్యడం కొంత కష్టమే. కానీ ఉన్న లెక్కల ప్రకారం 2012 మే నాటికి 8.0 నుండి 20.0 కోట్ల ఎకరాల భూమి విదేశీ పెట్టుబడుల ఆధీనంలోకి వచ్చింది. ఇది నానాటికీ పెరుగుతోంది."

**భూ దోపిడీ చేసే, భూ దోపిడీకి గురయ్యే పది ప్రధాన దేశాల జాబితా**

| భూ దోపిడీ చేసే దేశాలు | లక్షల హెక్టార్లు | భూ దోపిడీకి గురయ్యే దేశాలు | లక్షల హెక్టార్లు |
|---|---|---|---|
| అమెరికా | 8.0 | దక్షిణ సూడాన్ | 4.1 |
| మలేసియా | 3.5 | పపువా న్యూ గినియా | 3.9 |
| అరబ్ ఎమిరేట్స్ | 2.8 | ఇండొనీసియా | 3.5 |
| బ్రిటన్ | 2.1 | కాంగోప్రజాతంత్ర రిపబ్లిక్ | 2.7 |
| సింగపూర్ | 1.9 | మొజాంబిక్ | 1.9 |
| చైనా | 1.6 | సూడాన్ | 2.0 |
| సౌదీ అరేబియా | 1.5 | లైబీరియా | 1.4 |
| దక్షిణ సూడాన్ | 1.4 | అర్జెంటీనా | 1.3 |
| హాంగ్‌కాంగ్ | 1.3 | సిర్రాలియోన్ | 1.2 |
| ఇండియా | 1.3 | మెడగాస్కర్ | 1.1 |

వాస్తవానికి ఈ భూగ్రహం మీద పేద దేశాలలో మొత్తంగా ఎంత భూమి ఈ మాదిరి విదేశీపెట్టుబడిదారులు, స్వదేశీ పెట్టుబడి దారులు, సార్వభౌమనిధుల ఆధీనంలో చిక్కుపడి ఉంది అనేది లెక్క తియ్యడం కొంత కష్టమే. ఒక్కసారి ఆర్భాటంగా ప్రాజెక్టులు ప్రకటించినా వాస్తవంగా అంతభూమిని వినియోగంలోకి తెచ్చినదీ లేనిదీ తేలని పరిస్థితి ఉండటం వల్ల కొంత అస్పష్టత ఉంది. అందుకే గణాంకాలలో వ్యత్యాసం ఉంది. 2012 మే నాటికి 3.2 నుండి 8.2 కోట్ల హెక్టార్ల భూమి (అంటే 8.0 నుండి 20.0 కోట్ల ఎకరాల భూమి) విదేశీ పెట్టుబడుల ఆధీనంలోకి వచ్చింది. ఇది నానాటికీ పెరుగుతోంది. 'లాండ్ మాట్రిక్స్' సంస్థ ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారం వెబ్‌సైట్‌లో పెట్టింది. ఏ దేశంలో ఎంత భూమి విదేశీ పెట్టుబడుల ఆధీనంలో ఉంది, ఆయా భూముల్లో ఏం పంటలు పండుతాయి, ఎంత మంది స్థానిక జనాభా నష్టపోయారు, ఏ దేశం ఆధీనంలోకి ఈ భూములు వెళ్ళాయి అనే వివరాలు ఉన్నాయి. అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలలోని వ్యవసాయ భూములు ఎక్కువగా దురాక్రమించబడ్డాయి. మలేషియా, దక్షిణ సూడాన్ దేశాలు కూడా ఇలాంటి భూదోపిడికి గురవుతున్నా ప్రధానంగా ఈ రెండు దేశాల నుండి వచ్చిన పెట్టుబడులే 21వ శతాబ్దపు భూ దోపిడికి తెరలేపిన చిత్రమైన వైనం మనకు కనిపిస్తుంది. వాస్తవానికి ఈ రెండు దేశాలకు అంతశక్తి లేదు. ఈ రెండు దేశాల్లో ఉన్న పన్ను చట్టాల్లో ఉన్న లొసుగులను అడ్డంపెట్టుకుని సంపన్న దేశాల్లోని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలు ఈ నాటకానికి తెరలేపాయి. ఉదాహరణకు చూస్తే మలేషియా దేశానికి చెందిన 'సిమేడెర్బీ అనే కంపెనీ లైబీరియా (ఆఫ్రికా) దేశంలో పామాయిల్ తోటల పెంపకానికి వేలది ఎకరాల భూములు కొనుగోలు చేసింది. అయితే ఈ కంపెనీలో ప్రధానమైన వాటాలు ఇంగ్లాండ్, ఫిన్‌లాండ్, పోలాండ్ దేశాలకు చెందినవి.

ఇలాంటి ఉదాహరణలు చెప్పుకోవాలంటే ఎన్నో ఉన్నాయి. రైతుల భూములు కొల్లగొట్ట బడుతున్న దేశాలుగా అగ్రస్థానంలో సియార్రా లియోన్, ఇండోనేషియాలు ఉన్నాయి. సియార్రా లియోన్ ప్రభుత్వమయితే మా దేశంలో ఎలాంటి వ్యాపారాన్నయినా అనుమతిస్తాం అని ప్రకటించింది. వ్యవసాయ భూములు దోపిడి కూడా ఇక్కడ చట్టబద్ధమైన వ్యాపారమే. ప్రభుత్వ పెట్టుబడుల, ఎగుమతుల ప్రోత్సాహక మండలి వెబ్‌సైట్‌ని తెరిస్తే 'భారీ ప్రైవేటు పెట్టుబడులు – వైవిధ్యమైన పథకాలు', 'లెక్కలేనంత వ్యవసాయ యోగ్యమైన భూములు' అన్న సందేశాలు ఫ్లాష్ అవుతూ ఉంటాయి. 'లాండ్ మాట్రిక్స్' సంస్థ భారీగా పేర్కొనదగిన 17 ఒప్పందాల ద్వారా 11 లక్షల హెక్టార్ల భూమిని అలా కొనుగోలు చేసారనీ, ఇందులో రబ్బరు, పామాయిలు, వరి, చెరకు, యూకలిప్టస్ ఒకటే మిటి అన్ని వాణిజ్య, ఆహార పంటలు వేస్తున్నారనీ తెలిపింది. ఇంగ్లాండ్‌కు చెందిన ఒక ప్రైవేటు పెట్టుబడి సంస్థ ఒక్కటే ఆరు లక్షల హెక్టార్ల భూమిని కొనుగోలు చేసింది.

ఇండోనేషియాలో వేలాది ఎకరాల చిత్తడి అడవులను నాశనం చేసి జీవవైవిధ్యానికీ, పర్యావరణానికీ అక్కడి జనాభాకూ చేటు చేస్తున్న భూ విక్రయాల గురించి గార్డియన్ పత్రికా విలేకరి జాన్ వైడల్ అనేక కథనాలు వెలువరించాడు. ఆ దేశంలో నెలకొన్న సామాజిక సంఘర్షణను అర్థం చేసుకోవడానికి అతని కథనాల నుండి ఉపయుక్తమైన పేరాలు నేనిక్కడ ఉదహరిస్తాను.

'ప్లాంటేషన్ యజమానులు, మైనింగ్ అధిపతులు, డెవలపర్లకు – స్థానిక రైతులకు మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారాయి. దేశీయ బహుళజాతి కంపెనీలు దేశంలో ఈ కొసనుండి ఆ కొసకి భూములు ఆక్రమించేసుకుని తరువాత

**“ చైనాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత జనాభాను పట్టణాలకు పెద్దఎత్తున తరలించి, ప్రత్యామ్నాయ ఆవాస వసతులు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పుడు ఉన్న అభివృద్ధి ప్రణాళికల నుబట్టి చూస్తే 2025 నాటికి 25 కోట్ల జనాభా గ్రామీణ ప్రాంత భూములనుండి పట్టణాలకు తరలివస్తుంది. ప్రస్తుతానికి 50 శాతంగా ఉన్న పట్టణ జనాభా అప్పటికి 70 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ”**

సర్కారువారితో డీ–నోటిఫై చేయించి, సంప్రదాయకంగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న మూలవాసులను తిరిమేస్తున్నాయి. దీనితో ఘర్షణలు చెలరేగుతున్నాయి. ఒక్క 2011 సంవత్సరంలోనే ప్రభుత్వ లెక్కల ప్రకారమే అలాంటి ఘర్షణలు 600 పైగా నమోదయ్యాయి. 22 మంది మరణించారు. వందలాటిమంది గాయాల పాలయ్యారు. సర్కారు లెక్కల్లో నిజాయితీ పాలెంతో తెలియనిది ఎవరికి? అనధికార అంచనాల ప్రకారం ఈ సంఖ్య ఇంకా చాలా ఎక్కువే.

ఇండోనేషియా జాతీయ మానవహక్కుల సంఘం గత ఏడాది మానవ హక్కుల ఉల్లంఘన విషయమై 5000 కేసులు నమోదయినట్లు ప్రకటించింది. ఇందులో అత్యధికభాగం కార్పొరేట్ కంపెనీల విచ్చలవిడి అటవీనరికివేతకు సంబంధించినవే. దేశ వ్యాప్తంగా సాగు చేసే విషయమై చెలరేగుతున్న ఘర్షణలలో చనిపోతున్న రైతుల సంఖ్య నానాటికీ పెరిగిపోవటం పట్ల ఏడు లక్షల సభ్యత్వంగల ఇండేనిషియా రైతు సంఘం వ్యవస్థాపకుడు హెన్రీ సారఫీ ఆందోళన వ్యక్తం చేసాడు.

“పామాయిల్ తోటల పెంపకం వల్ల భూమిలేని నిరుపేదలు, క్షుదార్తులతో దారిద్ర్యం అనూహ్యంగా పెరిగిపోతోంది. దేశంలోని ప్రకృతి వనరులను కొల్లగొట్టేవారు హింసకూ, దౌర్జన్యానికీ దిగడం పరిపాటిగా మారింది. మానవహక్కులు యధేచ్ఛగా ఉల్లఘించబడుతున్నాయి. ఇందుకు సంబంధించి వేలాది కేసులు నమోదవుతున్నాయి. అంతకు అన్ని సంఖ్యలో కేసులను స్థానిక అధికారులు బయటికి రాకుండా తొక్కి పెడుతున్నారు” అని పరిస్థితిని వివరించాడు ఆ రైతు సంఘం నాయకుడు.

తమ భూములు కట్టబెట్టేటప్పుడు కనీసం చర్చించడంగానీ, నష్టపరిహారం చెల్లించడంగానీ లేకుండా ఉదారంగా రాయితీలు ఇచ్చి మరీ కార్పొరేట్ కంపెనీలకు సర్కారు ఊడిగం చేస్తుందని అనేక కాలనీల వాసులు వాపోతున్నారు. ఫలితంగా “మా కాళ్ళ మీద మేము నిలబడే పరిస్థితిపోయి కంపెనీలలో హీనాతిహీనమైన కూలికి పనులకు పోవాల్సి వస్తోందని ఆగ్రహం, ఆక్రోశం వెలిబుచ్చారు”.

**చైనా అనుభవం : ప్రత్యేక ఉదంతం**

చైనాలో సాగుతున్న భూసేకరణ మిగతా దేశాల అనుభవాలకన్నా భిన్నమైనది. ప్రత్యేకంగా, విడిగా చర్చించదగినది. చైనాలో జరుగుతున్న భూసేకరణ, దాని వల్ల చోటు చేసుకునే నిర్వాసితుల ప్రధాన ఉద్దేశం అదిమ పెట్టుబడి పోగుచేతయే. చైనాలో విప్లవం జయప్రదం అయ్యాక దేశ వ్యాప్తంగా సమగ్ర భూ సంస్కరణలు అమలుచేసారు. కమ్యూన్లను ఏర్పాటు చేసారు. దానికి కొనసాగింపుగా 1980వ దశకంలో డెంగ్ సియావో పింగ్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ ఇంతని భూమి కేటాయించింది. చైనాలో భూమి మొత్తం అటు రాజ్యం ఆధీనంలోగానీ, ఇటు ఊరుమ్మడి ఆస్థిగాగానీ ఉంది. రైతులకు నిర్దిష్టకాలానికి సాగుచేసే హక్కులు ప్రభుత్వమే కల్పిస్తుంది.

భూమిని అభివృద్ధి చేసేందుకు స్థానిక, ప్రాంతీయ అధికారులు సంకల్పించి డెవలపర్లకు కేటాయించేటప్పుడు రైతులు నిర్వాసితులు అవుతున్నారు. ఉన్న ఊళ్ళు విస్తరించడం, కొత్తగా ఊళ్ళు, పట్టణాలు నగరాలు ఏర్పడడంతో ప్రభుత్వ భవనాలు, ఆనకట్టలు కట్టడానికి, రోడ్లు వెయ్యడానికి విమానాశ్రయాలు నిర్మించడానికి భూసేకరణ / భూ బదలాయింపు అనివార్యంగా మారింది. అయితే ఈ క్రమంలో స్థానిక అధికారులు విచ్చలవిడి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చైనాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత జనాభాను పట్టణాలకు పెద్దఎత్తున తరలించి, ప్రత్యామ్నాయ ఆవాస వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు ఉన్న అభివృద్ధి ప్రణాళికలనుబట్టి చూస్తే 2025 నాటికి 25 కోట్ల జనాభా గ్రామీణ ప్రాంత భూములనుండి పట్టణాలకు తరలివస్తుంది. ప్రస్తుతానికి 50 శాతంగా ఉన్న పట్టణ జనాభా అప్పటికి 70 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

వ్యవసాయం విషయానికి వస్తే ఇటు రైతులతోపాటు, అటు భారీ కమతాల సాగు కంపెనీల చేతుల్లో నడుస్తోంది. గతంలో సూపర్ మార్కెట్లు నేరుగా రైతుల నుండి కొనుగోళ్ళు చేసేవి. గత ఐదేళ్ళుగా న్యూ జనరేషన్ (కొత్తరకం) కంపెనీలు సూపర్ మార్కెట్లకు ఆహారోత్పత్తులు సరఫరా చేయ్యడంలో పై చెయ్యి సాధించాయి. ‘ఛావోడా’ వంటి కంపెనీలు దేశంలో 29 ప్రాంతాలలో భారీ కమతాలు సాగుచేస్తూ పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. అగ్రి బిజినెస్‌లో చిన్న రైతులు విస్మరణకు గురవుతున్నారు. సప్లై కాంట్రాక్టుల కోసం కంపెనీలు నేరుగా గ్రామ అధికారులతో మాట్లాడేసుకుంటున్నాయి. భూమిని వాడుకోవడానికి అనుమతించే అధికారం వాళ్ళకే ఉంది. ‘స్టార్ బక్స్’ (కాఫీ), ‘పెప్సికో’ (బంగాళదుంప చిప్స్) వంటి కార్పొరేట్ కంపెనీలు ఇక్కడ పెద్ద ఎత్తున పంటలు పండించడంతోబాటు రైతులను కాంట్రాక్టు వ్యవసాయంలోకి దించాయి. చైనాలో అత్యధికంగా బంగాళాదుంపను పండించేది ఇవాళ పెప్సికో కంపెనీ.

చైనాలోని పెద్దపెద్ద పట్టణాలకు దాపున 10,000 ఆవుల సామర్థ్యం కలిగిన పాల ఉత్పత్తి కేంద్రాలను, పాలు పితికే రోబోట్ల సహాయంతో నిర్వహిస్తున్నారు. అలానే సీమ పంది పిల్లల పెంపకం కంపెనీ షాంఘై ఇంటర్నేషనల్‌ను ఆ మధ్యన అమెరికా కంపెనీ ‘స్మిత్ ఫీల్డ్’ కొనుగోలు చేసింది. దాంతో నేడు అది చైనాలో అతిపెద్ద బేకన్ ఉత్పత్తుల సంస్థగా నిలిచింది. స్వంతంగా 400 సీమ పంది పిల్లల పెంపకం కేంద్రాలతోపాటు 2100 మంది రైతులతో కాంట్రాక్టు పెంపకం ఒప్పందాలు కలిగిఉంది. అంటే మాంసాహార ఉత్పత్తులు కూడా భారీ ఫ్యాక్టరీలపరంగా కొనసాగుతుంది చైనాలో.

చైనా ప్రభుత్వం విడుదల చేసిన 1/2013 డాక్యుమెంటులో ఇలా పేర్కొంది – “గ్రామీణ ప్రాంత భూముల కాంట్రాక్టు హక్కులను భారీ కమతాలుగాను, కుటుంబ వ్యాపార సాగుకు, రైతు సహకార సంఘాలకు సజావుగా అందేలా ప్రభుత్వం చూస్తుంది. భారీ కమతాల సాగువల్ల ఉత్పత్తి, ఉత్పాదకతలు రెండూ అనూహ్యంగా అభివృద్ధి చెందుతాయని తద్వారా, దేశంలో చోటు చేసుకుంటున్న నూతన తరహా పట్టణీకరణకు చేదోడు వాదోడుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది”.

> **"పెట్టుబడిదారీ విధాన ఆరంభ కాలంలో భూముల నుండి బేదఖలయిన రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి అందుబాటులో వుండేది. పారిశ్రామిక ఉత్పత్తి పెద్దఎత్తున సాగుతున్న కాలంలో రైతులు నాటి సామ్రాజ్యవాద వలస భూభాగాలకు తరలిపోయే వారు. మరి కొంత మంది పట్టణాలకు వలస వచ్చి ఫ్యాక్టరీలలో కార్మికులుగా కుదురుకున్నారు. నేటి కాలంలో రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే పరిస్థితిలో నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ లేదు."**

మౌలిక వసతుల పెట్టుబడులు పెంచడం, నికర ఎగుమతులు పెంచుకోవడం కన్నా రైతుల్ని భూముల నుండి పెద్ద ఎత్తున బేదఖలు చేసి, వాళ్ళందరికీ పట్టణాలలో ఆవాసం కల్పించి వ్యక్తిగత వినియోగం పెంపుదల ఆధారంగా ఆర్థిక వ్యవస్థ పుంజుకునేట్లు చెయ్యడం చైనా ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. "పట్టణీకరణ వ్యాప్తి 'విలువ సృష్టికి' దోహదం చేస్తుంది" అంటున్నాడు చైనా వ్యవసాయ బ్యాంకు ప్రధాన ఆర్థిక సలహాదారు ఒకరు. 'భారీ రెవిన్యూ ఆదాయానికి ఇదొక మార్గం' అని నమ్మకంగా అతను చెప్తున్నాడు గానీ, ఇది జరిగేపనేనా అని సందేహించే వాళ్ళకూ కొదవలేదు. "30 కోట్ల జనాభాను పట్టణాలకు తరలించడం ద్వారా అధిక ఆర్థికాభివృద్ధి సాధించడం ప్రభుత్వ ప్రణాళికగా పెట్టుకుంది కానీ పట్టణీకరణ దానంతట అదే అభివృద్ధికి దారి తియ్యదు. అభివృద్ధి పెరుగుదల మాత్రమే పట్టణీకరణ వ్యాప్తికి ఉపకరిస్తుంది. ఏ దేశాల అనుభం చూసినా అవి అభివృద్ధి సాధించే క్రమంలో ఉపాధి, ఉద్యోగాల అవకాశాలకోసం పల్లెపట్టుల నుండి జనాలు పట్టణాలకు తరలిరావడం మనకు కానవస్తుంది"అంటాడు పెకింగ్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర ఆచార్యులు మైకేల్ పీటిస్.

ఈ సమస్యలను పక్కనబెడితే అసలు వేగవంతమైన పట్టణీకరణ ద్వారా ప్రజల వినియోగశక్తిని పెంచి ఆర్థికాభివృద్ధిని సాధించి, సుస్థిరపరచుకోవాలనే వ్యూహమే బండిముందు, ఎడ్లువెనుక పెట్టిన సామెతగా తయారయింది, ఇది అట్టేకాలం నిలవదు అన్న సందేహం ఉండనే ఉన్నాయి. పర్యావరణ, నిర్వాసితుల సమస్యలు ఉండనే ఉన్నాయి. అయితే మిగిలిన దేశాల అనుభవాల మాదిరి కాకుండా నిర్వాసితులకు అంత శీఘ్రంగా పునరావాసం, వసతులు కల్పించడం కొంత ఊరట కలిగిస్తుంది. అయితే చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తే ఫలితాలు దారుణంగా ఉంటాయి. పట్టణాలలో ఉపాధి ఉద్యోగాలు కోల్పోయేవారు తిరిగి పల్లెలకు వెళ్ళి, మట్టి పిసుక్కుని వ్యవసాయం చేసుకుందామన్నా అవకాశం లేకుండా పోతుందనే భయం వెంటాడుతోంది.

చైనా ఎదుర్కొంటున్న మరొక వ్యవసాయ సమస్య ఏంటంటే పారిశ్రామిక వర్గాలతో భూసారం కలుషితం కావడం. 12 కోట్ల హెకాటర్ల భూమిలో దాదాపు 1 నుండి 2.4 కోట్ల హెక్టార్ల భూమి ఈ రకంగా దెబ్బతిని పోయింది అనేది ఒక అంచనా. దేశ జనాభా ఆహార అవసరాల రీత్యా కనీసంగా అందుబాటులో వుండాల్సిన వ్యవసాయ భూమి 12 కోట్ల హెక్టార్లు అని చైనా నాయకత్వం నిర్ణయించింది.


బహుళజాతి సంస్థలకు భూమిని కోల్పోతున్న ఇథియోపియా రైతు

**భారీ కమతాలు – ఎదురుకానున్న సవాళ్లు**

కొన్ని వేల ఏళ్ల నుండి మానవుడు వ్యవసాయం చేస్తూ వున్నాడు. "వేలాది మందిగా భూమిని దుక్కిదున్ని, పంటపండించి తమ కుటుంబ అవసరాలు గడుపుకోవటంతో పాటు సాపేక్షంగా పనిపాటు లేని పరాన్నభుక్కు వర్గం అవసరాలు కూడా తీర్చసాగారు. మానవ చరిత్రలో మొదటిసారిగా ఇవాళ గ్రామసీమలలో కన్నా పట్టణాల్లో జీవించేవారు అధికాధికంగా వున్నారు. ఇంతటి నాటకీయ మార్పు జరిగినా ఇప్పటికీ మెజారిటీ ప్రజానీకానికి జరుగుబాటు కోసం వ్యవసాయం మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి వుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ.) అంచనాల ప్రకారం 2013 నాటికి ప్రపంచ కార్మికవర్గంలో మూడవ వంతు అంటే 100 కోట్ల మంది వ్యవసాయం మీదనే ఆధారపడి వున్నారు. మొత్తం కార్మికవర్గంలో వీరు 44 శాతం కాగా సేవల రంగంలో 23 శాతం మంది, పరిశ్రమలలో 33 శాతం మంది కార్మిక వర్గం పనిచేస్తూ వున్నారు.

పెట్టుబడిదారీ విధాన ఆరంభ కాలంలో భూముల నుండి బేదఖలయిన రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి అందుబాటులో వుండేది. పారిశ్రామిక ఉత్పత్తి పెద్దఎత్తున సాగుతున్న కాలంలో భూములు కోల్పోయిన రైతులు నాటి సామ్రాజ్యవాద వలస భూభాగాలకు తరలి పోయి ప్రత్నామ్నాయ ఉపాధి చూసుకున్నారు. మరి కొంత మంది పట్టణాలకు వలస వచ్చి ఫ్యాక్టరీలలో కార్మికులుగా కుదురుకున్నారు. అయితే ఇరవై ఒకటో శతాబ్దపు రెండవ దశాబ్దంలో అడుగు పెట్టిన నేటి కాలంలో భారీ సంఖ్యలో భూములు కోల్పోయిన, కోల్పోతున్న రైతులకు ప్రత్నామ్నాయ ఉపాధి కల్పించే పరిస్థితిలో నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ లేదు. వీళ్ళకున్న మార్గమల్లా నగరాల్లో, పట్టణాల్లో అసంఘటిత రంగంలో రోజువారీ ఉపాధి కోసం దేవులాడుకోవడం, మురికి కూపాల్లో బతుకులు గడపటం. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే పట్టణ జానాభాలో మూడొంతుల జనాభా మురికి వాడల్లో నివసిస్తున్నారు. 100 కోట్ల జనాభా నివాసిత ప్రాంతాలు ఇవాళ ఈ భూమండలం మీద అలరారుతున్న మురికి గ్రహాలుగా మారాయి. బహుశ ప్రపంచ వ్యాప్తంగా అతి వేగంగా విస్తరిస్తున్న సామాజిక వర్గం ఏదన్నా ఉందంటే అది అసంఘటిత కార్మిక వర్గమే అంటాడు 'ప్లానెట్ ఆఫ్ స్లమ్స్' పుస్తక రచయిత మైక్ డేవిడ్. ఆ తర్వాత మనకు బోధపడే అంశం ఏమిటంటే వ్యవసాయ కమతాలు ఎంత భారీవయి, ఎంత భారీ ఎత్తున యాంత్రీకరణ జరుగుతుందో అదే స్థాయిలో సామాజిక సంక్షోభం తీవ్రమవుతుంది.

> **"ఆది నుండీ పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాల వేటలో చిన్న-సన్నకారు రైతులను భూముల నుండి బేదఖలు చేస్తూనేఉంది. తద్వారా ఆదిమ పెట్టుబడి సంచయానికీ, కార్మిక వర్గాన్ని సృష్టించడానికీ అంతర్గత మార్కెట్ అభివృద్ధికీ - ఆదిమ పెట్టుబడిదారీ విధానం, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందేందుకూ బాటలు వేసుకుంది."**

అంత భారీ కమతాలను దేశీయ కార్పొరేట్ కంపెనీలు సాగు చేస్తాయా, బహుళజాతి కార్పొరేట్ చేస్తాయా అనే దానితో నిమిత్తం లేకుండా చిన్న -సన్నకారు రైతాంగం మొత్తంగా దెబ్బతిని పోతుంది. ఈ భారీ కమతాల ఏర్పాటు చట్టపరం గా చేశారా, బల ప్రయోగంతో చేశారా అనే దానితో నిమిత్తం లేకుండా వ్యవసాయ భూముల నుండి బేదఖలయిన రైతులు యావన్మందీ నిర్వాసితులుగా మారతారు. భారీ యాంత్రీకరణ వల్ల వ్యవసాయ కూలీల పని దినాలు కూడా భారీగా తగ్గిపోతాయి. 400 ఎకరాల్లో మొక్క జొన్న పంట పండించేందుకు ఎకరాకి కేవలం 7-8 గంటల పని దినాలు సరిపోతున్నాయి. యంత్రీకరణ వల్ల, అంటే 2000 ఎకరాల భారీ కమతంలో అదే మొక్కజొన్న సాగుకి 2.7 గంటల పని దినాలతో సరిపెడుతున్నారు. అమెరికాలో అయితే దాదాపు మూడొంతుల సాగు 2000 ఎకరాలకు పై బడిన భారీ కమతాల్లోనే జరుగుతోంది. కూలీల ఖర్చు బాగా తక్కువ పడినందున భారీ కమతాల్లో ఎకరా దిగుబడి ఎక్కువగా ఉంటుందని పొరబడేరు. వాస్తవానికి చిన్న రైతులే ఎక్కువ దిగుబడిని సాధిస్తున్నారు. అంతర పంటలు వెయ్యడం తదితర వ్యవసాయ మెళకువలతో పాటు ఎక్కువ మంది కూలీలను పనిలో పెట్టుకోవడం ద్వారా ఎక్కువ ఫలసాయం సాధిస్తున్నారు చిన్న రైతులు. పర్యావరణ రీత్యా చూసినా చిన్న రైతులు తక్కువ హానికరంగా ఉంటారు. అదే భారీ కమతాలలో ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం భారీగా ఉండి పర్యావరణానికి చేటు కలుగుతుంది.

ప్రపంచ మానవాళి అంతటికీ తగినంత ఆహారం పండించడానికి అత్యాధునిక యంత్రాలతో 2 కోట్ల మంది రైతులు సాగు చేస్తే చాలనేది పెట్టుబడిదారీ ఆదర్శం అంటారు సమీర్ అమిన్. అయితే ఇందులో రెండు సమస్యలు ఇమిడి ఉన్నాయని ఎత్తిచూపారు. భారీ కమతాలను పర్యావరణానికి చేటు లేకుండా సాగు చెయ్యడం సాధ్యం కాకపోవడం మొదటి సమస్య. పంట మార్పిళ్ళు, అంతర పంటలు వెయ్యడం వ్యవసాయం - పశుపోషణ రెండు కలిపి చెయ్యడం పశువులను స్వాభావికంగా పెంచడం, ప్రకృతి సిద్ధ భూములసారాన్ని కాపాడడం వంటి వైవిధ్యత ఏదీ భారీ కమతాల సాగులో సాధ్యం కాదు. కాబట్టి పర్యావరణానికి తీరని నష్టం కలుగుతుంది. రెండోది ముఖ్యమైన సమస్య ఏమిటంటే - ఇప్పటి దాకా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాల మనుగడ ఏం కావాలి? భూములు లేక వ్యవసాయ పనులు లేక ఇన్ని లక్షల కుటుంబాలకు పట్టణంలో ఉపాధి దొరకక- వీరికి జరుగుబాటు ఎలా? ఇదే నేడు యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య.

### గమనీయాంశాలు

ఆది నుండీ పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాల వేటలో చిన్న-సన్నకారు రైతులను భూముల నుండి బేదఖలు చేస్తూనే ఉంది. తద్వారా ఆదిమ పెట్టుబడి సంచయానికీ, కార్మిక వర్గాన్ని సృష్టించడానికీ అంతర్గత మార్కెట్ అభివృద్ధికీ - ఆదిమ పెట్టుబడిదారీ విధానం, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందేందుకూ బాటలు వేసుకుంది. బడా భూస్వాములతో పోటీపడి చిన్న రైతులు వ్యవసాయం చెయ్యలేక వదిలి పెట్టేసిన సందర్భాలు చాలనే ఉన్నాయి గానీ ఆర్థికేతర కారణాల రీత్యా రైతులు నిర్వాసితులు కావడం ఎక్కువగా సాగింది. చిన్న రైతులకు సంప్రదాయకంగా వస్తున్న సాగు హక్కులను నూతన చట్టాలు హరించి వెయ్యడం, బలప్రయోగం ద్వారా భూముల నుండి వెళ్ళగొట్టడం, పెట్టుబడులు ఆకర్షించడం కోసం రైతులను నిర్వాసితులను చెయ్యడం, కింది స్థాయి నుండి పైదాకా నెలకొన్న అవినీతి... ఇవన్నీ రైతుల ప్రయోజనాలను హరించి వేశాయి. భూదురాక్రమణల చరిత్ర నిన్నా మొన్నటిదికాదు గానీ ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా తెరమీదకి వచ్చిన నయా-ఉదారవాద విధానాలు, నూతన వాణిజ్య విధానాలు- వీటికి అనుగుణంగా ఏ దేశానికి ఆదేశంలో చట్టాలు మారిపోయిన నేపథ్యంలో అమెరికా పెట్టుబడులు సాగిస్తున్న ప్రపంచ వ్యాప్త భూదోపిడీ మాత్రం నిజంగా కలవరపరిచే అంశమే. అయితే చైనాలో పరిస్థితి వేరు. అక్కడ ఉన్న ప్రభుత్వమూ, దాని విధానాల వల్ల అక్కడి పరిస్థితులను మనం ప్రత్యేకంగా పరిగణించాలి.

చివరిగా ఒక్క మాట చెప్పాలి. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ పెట్టుబడులు సాగిస్తున్న ఈ భూ దోపిడికి రైతుల నుండి ఎల్లెడలా ప్రతిఘటన వస్తోంది. అనేక దేశాల్లో సంఘటిత రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రతిఘటనా పోరాటాలు జరుగుతున్నాయి. ఈ పోరాటాలన్నీ బలీయమైన (పెట్టుబడిదారీ) సిద్ధాంతాలతో, దాన్ని కాపాడుకొచ్చే పోలీసు, సైనిక బలగాల శక్తితో తలపడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి ఆహార భద్రత కావాలంటే నేడు అంతర్జాతీయ పెట్టుబడులు సాగిస్తున్న 21వ శతాబ్దపు భూ దోపిడి, అత్యాధునిక యాంత్రీకరణతో కొనసాగుతున్న భారీ కమతాల సాగుకు స్వస్తి చెప్పాల్సిందే. అంతర్జాతీయ మార్కెట్ శక్తుల నుండి రక్షణ కల్పించడానికి ఏ దేశానికి ఆదేశం ఆహార, వ్యవసాయ రంగాలలో సార్వభౌమ హక్కులను పటిష్టం చేసుకోవాలి. సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడం - సమిష్టి సహకార క్షేత్రాలు, రైతు సహకార సంస్థల ద్వారా సాగుబడి నిర్వహించుకోవడం వంటి నిర్దిష్ట సంస్కరణల ద్వారా జనాభాకు ఆహార భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి.

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న 21వ శతాబ్దపు భూ దోపిడీ నుండి మనం నేర్వాల్సిన నీతి ఏమిటీ? దీన్ని కారల్‌మార్క్స్ పెట్టుబడి మూడవ సంపుటంలో పొందు పరిచాడు. -"పెట్టుబడిదారీ వ్యవస్థ శాస్త్రీయమైన వ్యవసాయానికి బద్ధ శత్రువు. శాస్త్రీయమైన వ్యవసాయానికీ పెట్టుబడిదారీ వ్యవస్థకూ అస్సలు పొసగదు. పెట్టుబడిదారీ విధానం వ్యవసాయంలో అత్యాధునిక మెళకువలు ప్రవేశపెట్టినా అది చిన్న రైతులనూ, సాగు రైతులనూ సాగు నుండి బేదఖలు చేస్తుంది."

కాబట్టి రైతాంగం నేడు వ్యవసాయాన్ని కాపాడుకోవాలా, పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడను సమర్థించాలా అనేది తేల్చుకోవాలి.

**(అనువాదం : కె. సత్యరంజన్)**

ప్రపంచ గమనం

# పురోగామి శక్తులకు సవాలు విసురుతున్న ప్రపంచ పరిణామాలు

**నేటి అంతర్జాతీయ పరిస్థితి అనేక అవకాశాలను కల్పిస్తోంది. చరిత్ర నేడు మన భుజాలపై విపరీతమైన బాధ్యతలు పెట్టింది. వస్తుగతమైన పరిస్థితులను ఉపయోగించుకుని సమాజాన్ని పరివర్తన గావించే అవకాశాన్ని అది మనకు ఇచ్చింది. నేడు ప్రపంచంలో అనేక రకాలైన నిరసనలు జరుగుతున్నాయి. పొదుపు చర్యల-వ్యతిరేక, వాతావరణ మార్పుల - వ్యతిరేక, పెట్టుబడిదారీ వ్యవస్థ - వ్యతిరేక వగైరా, వగైరా నిరసనోద్యమాలు జరుగుతున్నాయి. వాటన్నిటినీ ఒకే చోటుకి తెచ్చి, ఐక్యంగా ఎదురుదాడికి దింపడమే నేడు మన ముందున్న పెద్ద సవాలు.**

**ఆర్. అరుణ్**

నేడు మనం చాలా ఆసక్తి కరమైన కాలంలో జీవిస్తున్నాం. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా తన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుకోడానికి నానా తంటాలు పడుతోంది. అనేక వైపులనుండి దాని ఆర్థికాధిపత్యానికి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇప్పటి వరకు బయటకు రారనుకున్న ప్రజలు - స్త్రీలు, పురుషులు - రోడ్లమీదకొచ్చి వీరోచితంగా పోరాడుతున్నారు. నియంతలను కూలగొడుతున్నారు. ప్రభుత్వాలను మారుస్తున్నారు. ఎన్నికల పోరాటాల్లో అధికార పార్టీలను మట్టి కరిపిస్తున్నారు... ఈ పరిణామాలకు కారణాలేమిటి? ఈ పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయి? ఇందులో ప్రధాన పాత్రధారులెవరు? (లేక ప్రధాన పాత్రధారులంటూ ఉన్నారా?) ఇవన్నీ మనల్ని నేడు తొలిచేస్తున్న ప్రశ్నలు.

ఈ పరిణామాల్లో చాలా వాటికి కారణమైన అంశం ఒకటుంది. అది ఆర్థిక పరిస్థితి. ప్రపంచం నేటికీ అతి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికి ఈ సంక్షోభం వచ్చి అయిదేళ్లయింది. సంక్షోభం నుండి ఇప్పుడిప్పుడే బయటపడతామన్న ఆశలు లేకపోగా సంక్షోభం నుండి బయటపడేందుకు చేసే ప్రతి ప్రయత్నమూ మరో కొత్త సంక్షోభానికి దారితీస్తోంది. ప్రపంచ ఆర్థికాభివృద్ధి వెనుకపట్టు పట్టిందనీ, నిరుద్యోగం పెరుగుతోందనీ అంతర్జాతీయ కార్మిక సంస్థ - ఐఎల్ఓ- '2013 ప్రపంచ ఉపాధి ధోరణులు' అన్న అంశంపై వెలువరించిన నివేదికలో తెలిపింది. వార్షికంగా చూస్తే ప్రపంచ ఆర్థికాభివృద్ధి 2012లో 3.3 శాతం, 2011లో 3.8 శాతం, 2010లో 5.1 శాతం తగ్గింది. తూర్పు ఆసియాలో అభివృద్ధి 1.4 శాతం చొప్పున తగ్గిపోయింది. భారత దేశంలో అభివృద్ధి ఈ దశాబ్దంలోనే తక్కువ స్థాయి అయిన 4.9కి తగ్గిపోవడంతో దక్షిణాసియాలో ఆర్థికాభివృద్ధి 1.6 శాతం తగ్గింది. లాటిన్ అమెరికా, కరెబియన్, మధ్య ప్రాచ్యంలో కూడా ఆర్థికాభివృద్ధి గణనీయంగా తగ్గింది. రానున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితి పై ఐఎంఎఫ్ విడుదల చేసిన ప్రపంచ నివేదిక (జూన్ 3013) యూరప్ ఇంకా మాంద్యంలోనే ఉంటుందనీ, అమెరికా అభివృద్ధి తక్కువలోనే ఉంటుందనీ చెప్పింది.

ఈ సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థలో నిగూఢమై ఉన్న అణచివేత, దోపిడీ లక్షణాన్ని మరోసారి చూపించింది. ప్రపంచంలోని విస్తారమైన ప్రజానీకాన్ని తీవ్రమైన ఈతిబాధలకు గురిచేసింది. సామ్రాజ్యవాదం సైద్ధాంతికంగా తన ఉనికిని కప్పిపుచ్చుకోడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడం లేదు. అది నేడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను మానవాళిపై దాడిగా మార్చేసింది. ప్రస్తుత సంక్షోభం తాకని రంగమంటూ లేదు. లక్షలాది పరిశ్రమలు మూతపడ్డాయి. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలు కునారిల్లుతున్నాయి. దాంతో ప్రపంచ వ్యాపితంగా కోట్లాదిమంది వ్యవసాయ కార్మికులు, రైతులు పేదరికం అనుభవిస్తున్నారు. లక్షలాది మంది ప్రజలు ఉపాధి, తలదాచుకోను ఇల్లు లేకుండా ఉన్నారు. నిరుద్యోగం అసాధారణ స్థితికి చేరుకుంది. చాలా దేశాల్లో ఇది రెండంకెల స్థాయికి చేరింది. ప్రపంచ మంతటా ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ధనవంతులు మరింత ధనవంతులూ, పేదలు మరింత పేదలూ అవుతున్నారు. 100 కోట్లకు పైగా ప్రజలు అంటే ప్రపంచ జనాభాలో ఏడోవంతు మంది నిత్యం ఆకలితో అలమటిస్తున్నారు.

ఎలాగైనా లాభాలు గడించడం అనేది లక్ష్యంగా మారింది. విచక్షణారహితమైన దోపిడీకి తలుపులు మరింత బార్లా తెరవబడ్డాయి. దాని వల్ల ఇప్పుడు, రేపటి కాలానికి వచ్చే పరిణామాల గురించి ఆలోచించే పరిస్థితి లేదు. సంక్షోభం, దాని వల్ల ఖర్చులు తగ్గించుకోవడం...వీటి పర్యవసానంగా భూగోళం మీద తీవ్రమైన దాడి జరుగుతోంది. దేశాల మధ్య వాతావరణ చర్చలు జరుగుతున్నాయి. అయితే అవి వాతావరణాన్ని కాపాడడానికి కాకుండా ఇప్పటికే పేదరికంలో మగ్గుతున్న దేశాల మీదకు భారాన్ని నెట్టివేయడానికి జరుగుతున్నాయి. అయితే ఈ ప్రయత్నాలకు అభివృద్ధి చెందుతున్న దేశాలనుండే కాక, ఈ అంశాలపై ప్రజలను సమీకరిస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలనుండి కూడా ప్రతిఘటన ఎదురవుతోంది.

రాజకీయ వ్యవస్థలు మరింత మితవాదం పైపు వెళుతున్నాయి. ప్రజల ప్రజాతంత్ర, పౌర, ట్రేడ్ యూనియన్ హక్కులను కాలరాస్తున్నాయి. ఈ సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థలో సంస్థాపరంగా ఉండే అవినీతిని మరింత తీవ్రతరం చేసింది. ఇప్పుడు అవినీతి సంస్థాపరమై



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యాలయం విదేశీ వ్యవహారాల విభాగంలో పనిచేస్తున్నారు.**

> **" యూరప్‌లో అంతగా అభివృద్ధి సాధించని దేశాలైన పోర్చుగల్, స్పెయిన్, గ్రీస్, ఐర్లాండ్ ఇతర అనేక తూర్పు యూరప్ దేశాల ప్రజలు సంక్షోభం బారిన పడి తమ జీవన ప్రమాణాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దృఢ చిత్తంతో పోరాడుతున్నారు. "**

పోయింది. సంక్షోభ భారాన్ని కార్మికవర్గం మీదికి నెట్టడానికి పనిగట్టుకుని ప్రయత్నిస్తున్నారు. వర్ధమాన దేశాల అంతర్గత మార్కెట్లలోకి మరింతగా చొచ్చుకు పోడానికి ప్రధాన సామ్రాజ్యవాద శక్తులు ప్రయత్నిస్తున్నాయి. వీటి దుష్ప్రభావాలు చవిచూస్తున్న ప్రజలు పాలక వర్గాలపై ఆగ్రహంతో తిరుగుబాటు చేస్తున్నారు. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు పెరుగుతుండడం అనేది వీటిలో ఆహ్వానించదగ్గ పరిణామం.

**సంక్షోభానికి వ్యతిరేకంగా నిరసన**

1990లో సోవియట్ యూనియన్ కూలిపోవడంతో పెట్టుబడిదారీ పండితులు ఇక్కడితో 'చరిత్ర అంతమైందని' ప్రగల్భాలు పలికారు. ఆదాయానికి మించి వినియోగించే 'అమెరికన్ కల' జీవిత పరమార్థమని చెప్పారు. ఈ వాగాడంబరాలన్నిటినీ ప్రస్తుత సంక్షోభం పటాపంచలు చేసింది. అమెరికాలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున నిరసనలు రాజుకున్నాయి. చికాగోలో ఒక ఫ్యాక్టరీని కార్మికులు ఆక్రమించుకోవడం, కన్సెషన్‌తో కూడిన కాంట్రాక్టును ఫోర్డు కార్మికులు తిరస్కరించడం, జి-20 సమావేశానికి నిరసనగా ప్రదర్శనలు, సంఘంగా ఏర్పడే తమ హక్కులను కాలరాయడానికి విస్కాన్సిన్ మితవాద ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు వ్యతిరేకంగా జరిగిన మిలిటెంట్ పోరాటం... ఇవన్నీ కూడా అమెరికాలో కార్మికోద్యమానికి నూతన జవసత్వాలు సమకూర్చాయి. కాలిఫోర్నియా యూనివర్శిటీ విద్యార్థులు అనేక నిరసన ప్రదర్శలను నిర్వహించి కొన్ని రోజుల పాటు యూనివర్శిటీ మూత వేయించారు. ట్యూషన్ ఫీజు పెంపుకు నిరసనగా వారు ఆందోళన చేశారు. సంక్షోభం వల్ల కేంద్ర ప్రభుత్వం యూనివర్శిటీకి ఇచ్చే నిధుల్లో కోత పడడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

సంక్షోభం నుండి బయటపడేందుకు ప్రజలపై వేసిన భారాలకు నిరసనగా ఇటువంటి ప్రదర్శనలు యూరప్‌లో కూడా జరిగాయి. యూరోపియన్ యూనియన్ ఒక బ్లాక్‌గా ఉంటుందా చీలిపోతుందా అనే పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి యూనియన్ ఏర్పాటుకు ఎందుకంత పెద్ద వ్యతిరేకత వచ్చిందో నేడు చాలా మంది ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఐరోపా యూనియన్‌లో ప్రధాన దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్‌లు తమ ఆర్థిక ప్రయోజనాలు పరిరక్షించుకోవాలన్న ఆతృతతో ఉన్నాయి. తమ దేశ ఆర్థిక వ్యవస్థలను రక్షించుకోడానికే కాకుండా యూరోపియన్ జోన్‌లో తమ మార్కెట్లను రక్షించుకోడానికి కూడా అవి ఆతృత పడుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతర దశాబ్దాల్లో యూరోపియన్ కార్మికవర్గం సాధించుకున్న సామాజిక ప్రయోజనాలు నేడు తీవ్రమైన దాడికి గురవుతున్నాయి. సంక్షేమ బడ్జెట్లలో కోతలు కోస్తున్నారు. రిటైర్‌మెంటు వయస్సు పెంచుతున్నారు. పెన్షన్‌కు కోతపెడుతున్నారు. జీతాలు స్థంభింప జేస్తున్నారు. పన్నులు పెంచుతున్నారు. ఈ దేశాల్లో నేడు నిరుద్యోగం ఆకాశానికి ఎగబాకుతోంది.

యూరప్‌లో అంతగా అభివృద్ధి సాధించని దేశాలైన పోర్చుగల్, స్పెయిన్, గ్రీస్, ఐర్లాండ్ ఇతర అనేక తూర్పు యూరప్ దేశాల ప్రజలు సంక్షోభం బారిన పడి తమ జీవన ప్రమాణాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దృఢ చిత్తంతో పోరాడుతున్నారు.

గ్రీసులో గత అనేక మాసాలుగా నిరంతర ప్రజా పోరాటాలు సాగుతున్నాయి. దేశంలో అనేక సార్వత్రిక సమ్మెలు జరిగాయి. ఒకదానికి మించి మరొకటి జరిగాయి. సార్వత్రిక సమ్మెలతోబాటుగా వివిధ రంగాలకు చెందిన కార్మిక వర్గం తమ స్వంత నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. నావికులు, రవాణా కార్మికులు, మధ్య తరగతి ఉద్యోగులు, పౌర సేవకులు, టీచర్లు...వగైరాలంతా ప్రదర్శనల్లో చురుకుగా పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు కూడా రాస్తారోకోలు చేశారు. దాంతో ప్రధాన రోడ్లమీద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దేశంలోని 67కు పైగా నగరాల్లో నిత్యం భారీ ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి.

ఈ ప్రదర్శనల్లో యువకులు, ఇదే మొదటి సారి పాల్గొన్న వారూ అనేక మంది ఉన్నారు. దానర్థం నిరసనల్లోకి కొత్త వారు విస్తారంగా వస్తున్నారన్నమాట. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఇది తెలియజేస్తోంది. అనేక యూనియన్ల విస్తృత సంఘటన అయిన పిఎఎంఇ (పామి) ఈ నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహించడంలో ముందుంది. దీని వల్ల ఇక్కడ అరాచకవాదుల పాత్ర తగ్గిపోయింది. ఉద్యమాన్ని దారిమళ్లించే వారి ఎత్తుగడలు చెల్లలేదు. దాంతో ఉద్యమాల మీద కేంద్రీకరణ జరిగింది.

అదే విధంగా పోర్చుగల్‌లో కూడా ట్రేడ్ యూనియన్ ఐక్యవేదిక ఇటీవల రాజధాని లిస్బన్‌లో 3 లక్షల మందితో ఒక మహా ప్రదర్శన నిర్వహించింది. ఏటేటా ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్న ప్రజల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇటీవలి కాలంలో స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, ఇంగ్లాండుల్లో కూడా ఇటువంటి మహా ప్రజా ప్రదర్శనలు జరిగాయి.

**వ్యవస్థను ప్రశ్నించే నిరసనలు**

'వాల్ స్ట్రీట్ ముట్టడి' ఉద్యమం హక్కుల కోసం ప్రారంభమైనది కాస్తా కొత్త రూపు సంతరించుకున్నది. ఈ ఉద్యమం పశ్చిమ పెట్టుబడి దేశాల్లో చాలా చాలా సంవత్సరాల తరువాత ఈ సమస్యలన్నిటికీ 'వ్యవస్థ' కారణమని ప్రశ్నించింది. ఈ ఉద్యమంలో జరిగిన చర్చ ఒక్క శాతం ధనికులను 99 శాతం సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా నిలిపింది. ధనికులు, లేనివారిని వేరు చేసింది. వాల్ స్ట్రీట్ ముట్టడి ఉద్యమం ఉధృతంగా సాగిన కాలంలో 81 దేశాలకు పాకింది. 'వ్యవస్థలో లోపాలు కాదు' సంక్షోభానికి లోపభూయిష్టమైన వ్యవస్థే కారణం' అని నినదించింది.

వేలాది మంది యువకులు, ముఖ్యంగా నిరుద్యోగులు వీధుల్లోకి వచ్చి అమెరికా ద్రవ్య పెట్టుబడి కేంద్రమైన వాల్ స్ట్రీట్‌లో బైఠాయించారు. వాస్తవంగా ప్రజల ఆస్తి అయిన బడా కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థలను తాము ఆక్రమించుకుంటున్నామని ప్రకటించారు. వారు అన్ని రకాల అధికార వ్యవస్థలనూ వ్యతిరేకించారు, ఆ విధంగా వారు అరాచకవాద ధోరణులను కూడా ప్రదర్శించారు. ప్రారంభంలో వారు వ్యవస్థాపరమైన కార్మిక సంఘాలతో కూడా సహకరించకోడానికి వ్యతిరేకించారు. తరువాత తమ ధోరణి మార్చుకుని వాటితో కలిసి పనిచేశారు. ఈ క్రమంలో వారు కార్మికవర్గానికి చెందిన కొన్ని డిమాండ్లను కూడా ముందుకు తెచ్చారు.

వాల్ స్ట్రీట్ ముట్టడి ఉద్యమం గణనీయమైన

విజయాలు సాధించకపోయినప్పటికీ, అది ప్రారంభంలో చూపిన ఒత్తిడి కలిగించలేక పోయినప్పటికీ ఒకటి మాత్రం సాధించింది. అదేమంటే సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక వ్యవస్థగా అజేయమైనదన్న భ్రమలను పటాపంచలు చేసింది. తాము ముట్టడించిన ప్రాంతాల్లో అనేకమంది ఉద్యమకారులు అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. లైబ్రరీలు కూడా నడిపారు. వినాశనకరమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలన్న వారి తపన ఈ మొత్తం కార్యక్రమాల్లో అంతర్లీనంగా కనిపించింది.

### పశ్చిమాసియాలో నిరసనలు

ఈజిప్టులోని తెహ్రిర్ చౌక్‌ను ముట్టడించిన ఉద్యమకారులు మాకు స్ఫూర్తి నిచ్చారని వాల్ స్ట్రీట్ ముట్టడి నిరసన కారులు రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. వ్యవస్థ మారే వరకూ తాము ఉద్యమం కొనసాగిస్తామని లేఖలో పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రపంచాన్ని కుదిపేసిన పరిణామాల ప్రభావం అలా ఉంది. ఈ పరిణామాలు ట్యునీషియాలో ప్రారంభమైనప్పటికీ ఈజిప్టులోని తెహ్రిర్ చౌక్‌లో బాగా ప్రాచుర్యం పొందాయి.

పశ్చిమాసియా/ఉత్తరాఫ్రికా ప్రాంతంలో జరిగిన ప్రజా వెల్లువలు కూడా ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్లనే తలెత్తాయి. ఈ ఉద్యమాలు ఇంతింతై వటుడింతై అన్నట్లు మహోద్యమాలుగా మారి ఈజిప్టు, ట్యునీషియాల్లో అమెరికా అనుకూల ప్రభుత్వాల పతనానికి కారణమయ్యాయి. ఈ ప్రాంతంలోని ఇతర అమెరికా అనుకూల ప్రభుత్వాలకు ప్రమాదంగా మారాయి. ఉద్యమ ఉధృతికి అనేక ప్రభుత్వాలు హడావుడిగా కొన్ని రాయితీలు ప్రకటించాయి. సౌదీ అరేబియా లాంటి కొన్ని దేశాలు ప్రజల హక్కులను మరింతగా కోతపెట్టడం ద్వారా ఉద్యమాలను కట్టడి చేశాయి.

ఈ ప్రాంతంలో జోక్యం చేసుకుంటున్న అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తిగా అనేక దేశాల్లో ఇస్లామిక్ ఛాందసవాదం ముందుకొచ్చింది. ఉద్యమాలను అది తనకు అనుకూలంగా వాడుకున్నది. అసలు ఈ ఇస్లామిక్ ఛాందస వాదానికి కొమ్ములు తెచ్చింది అమెరికా సామ్రాజ్యవాదమే. ఈ ప్రాంతంలోని పురోగామి, సోవియట్ అనుకూల ప్రభుత్వాల ఏర్పాటును అడ్డుకునేందుకు వ్యూహాత్మకంగా ఈ ఛాందస వాదులకు అమెరికా మద్దతిచ్చి, పెంచిపోషించింది. అలా మద్దతు పొందిన ఛాందసవాద శక్తులు అమెరికా మద్దతును ఉపయోగించుకుని పురోగామి, వామపక్ష ఉద్యమాలను బలహీనపరిచాయి. అనేక చోట్ల

> **"ఈజిప్టులోని తెహ్రిర్ చౌక్‌ను ముట్టడించిన ఉద్యమకారులు మాకు స్ఫూర్తి నిచ్చారని వాల్ స్ట్రీట్ ముట్టడి నిరసన కారులు రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. వ్యవస్థ మారే వరకూ తాము ఉద్యమం కొనసాగిస్తామని లేఖలో పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రపంచాన్ని కుదిపేసిన పరిణామాల ప్రభావం అలా ఉంది. ఈ పరిణామాలు ట్యునీషియాలో ప్రారంభమైనప్పటికీ ఈజిప్టులోని తెహ్రిర్ చౌక్‌లో బాగా ప్రాచుర్యం పొందాయి."**



గ్రీసు రాజధాని ఏథెన్స్‌లో పోలీసులతో తలపడుతున్న ప్రదర్శనకారులు

అటువంటి ఉద్యమాలే లేకుండా తుడిచి పెట్టాయి. అరబ్బు ప్రపంచంలోనూ, ఇతర చోట్ల అమెరికా మద్దతుగల ప్రభుత్వాలు ఈ పని చేశాయి.

### ప్రత్యామ్నాయాన్ని సమకూర్చడం

నయా-ఉదారవాదానికీ, సామ్రాజ్య వాదానికీ ప్రత్యామ్నాయాల కోసం, ప్రజా సార్వభౌమ రాజ్యాల కోసం వెదుకుతున్న ప్రపంచానికి లాటిన్ అమెరికా ప్రభుత్వాలు మార్గం చూపిస్తున్నాయి. లాటిన్ అమెరికాలో ప్రపంచీకరణకూ, సామ్రాజ్యవాద జోక్యానికీ వ్యతిరేకంగా జరిగిన నిరసన వెల్లువలు ఆయా దేశాల్లో పురోగామి ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీశాయి. ఇటీవల చిలీలో వామపక్ష, పురోగామి ప్రభుత్వం ఎన్నికల్లో గెలవడం ఈ క్రమం ఇంకా కొనసాగుతున్నదని తెలుపుతోంది.

ఈ రోజున ఈ ప్రజా, పురోగామి శక్తులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి బలాన్నిస్తున్నాయి. లాటిన్ అమెరికా దేశాల్లోజరిగిన కృషి సామ్రాజ్యవాదుల నయా-ఉదారవాద కార్యక్రమానికి ప్రత్యామ్నాయమైన ఆర్థిక విధానాలను ఎజెండా మీదికి తెచ్చింది. అంతేకాదు, ప్రపంచ స్థాయిలో ఈ శక్తులు యుద్ధ-వ్యతిరేక, సామ్రాజ్యవాద-వ్యతిరేక, సైనిక దురాక్రమణ-వ్యతిరేక, వాతావరణ వినాశన-వ్యతిరేక ఉద్యమాలను ప్రపంచీకరణ వ్యతి రేక పోరాటాలతో అనుసంధానం చేసే ఒక ముఖ్యమైన శక్తిగా ఉన్నాయి.

లాటిన్ అమెరికాలోని పురోగామి ప్రభుత్వాలు సోషలిస్టు క్యూబాతో స్ఫూర్తిని పొందాయి. అవి అమెరికా మీద ఆర్థికంగా ఆధారపడ్డం చాలావరకు తగ్గించాయి. వాటిలో అవి వాణి జ్య ఇతర సహకార సంబంధాలు పెంచు కున్నాయి. వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్ వంటి దేశాలు తమ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి అనేక రాడికల్ చర్యలు తీసుకున్నాయి. ప్రాంతీయ స్థాయిలో కొత్తగా ఆర్థిక సంబంధాలు ఏర్పాటు చేసుకోడానికి అనేక వేదికలు నిర్మించబడ్డాయి. వీటిలో 'లాటిన్ అమె రికా, కరెబియన్ దేశాల కూటమి (సెలాక్) సరికొత్తది.

వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్ వంటి దేశాలు తమ దేశాల్లో సోషలిస్టు సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని ప్రకటించాయి. వెనిజులాలో బొలివేరియన్ సోషలిజం, బొలీవియా, ఈక్వెడార్‌లలో ప్రజా సోషలిజం.. ఇలా అవి తమ తమ తరహా సోషలిజాలను ప్రకటించు కున్నాయి. వీటన్నిటినీ కలిపి 21వ శతాబ్దపు సోషలిజం అని అంటున్నారు. ఈ దేశాల నాయకులు – గతేడాది చనిపోయిన లెజెండరీ నాయకుడు హ్యూగో చావెజ్‌గానీ, ఇవో మోరెల్స్, రాఫెల్ కొర్రియా గానీ తమ 21వ శతాబ్దపు సోషలిజం 20వ శతాబ్దపు సోషలిజానికి భిన్నమైనదని అంటున్నారు. కానీ వీరంతా కలిసి కట్టుగా పెట్టుబడిదారీ వ్యవస్థను ఖండి స్తారు. ఒక వ్యవస్థగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థికదోపిడీని తీవ్రం చేయడమే కాకుండా భూమాతను ప్రమాదంలో పడేసిందనీ పర్యావరణ పతనానికీ, వాతావరణ మార్పులకూ ఇదే కారణమనీ వార చెబుతారు.

### కమ్యూనిజానికి ఆమోదం, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం

అమెరికాలాంటి దేశాల్లో కూడా 'సోష

> **❝ అమెరికాలాంటి దేశాల్లో కూడా 'సోషలిజం' అనే పదం నెమ్మదిగా ఆమోదం పొందుతోంది. విచిత్రమేమిటంటే అమెరికన్లలో 53 శాతం మంది ప్రజలు మాత్రమే సోషలిజానికన్నా, కాపిటలిజం మంచిదని నమ్ముతున్నారు. ఈ విషయం మితవాద 'రాస్ముస్సెన్' జరిపిన అభిప్రాయ సేకరణలో బయటపడింది. 20% మంది సోషలిజం మంచిదన్నారు. మిగిలిన వారు ఎటూ తేల్చుకోలేకపోయారు. యువకుల్లోనైతే 33 % సోషలిజాన్నీ, 37 % పెట్టుబడిదారీ వ్యవస్థనూ ఇష్టపడుతున్నారు. ❞**



న్యూయార్క్‌లో వాల్‌స్ట్రీట్ ముట్టడి ఉద్యమ కారుల ప్రదర్శన

లిజం' అనే పదం నెమ్మదిగా ఆమోదం పొందుతోంది. విచిత్రమేమిటంటే అమెరికన్లలో 53 శాతం మంది ప్రజలు మాత్రమే సోషలిజానికన్నా, కాపిటలిజం మంచిదని నమ్ముతున్నారు. ఈ విషయం మితవాద 'రాస్ముస్సెన్' జరిపిన అభిప్రాయ సేకరణలో బయటపడింది. 20 శాతం మంది సోషలిజం మంచిదన్నారు. మిగిలిన వారు ఎటూ తేల్చుకోలేకపోయారు. యువకుల్లోనైతే 33 శాతం మంది సోషలిజాన్నీ, 37 శాతం మంది పెట్టుబడిదారీ వ్యవస్థనూ ఇష్టపడుతున్నారు. అప్పటికప్పుడు నిర్వహించిన ప్రజాభిప్రాయంలో కూడా 36 శాతం మంది అమెరికన్లు సోషలిజం పట్ల సానుకూలంగా స్పందించగా, 33 శాతం మంది మాత్రమే ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. వీరిలో 49 శాతం మంది బడా వ్యాపారానికి వ్యతిరేకంగా ఉన్నారు. అనేక యూరోపియన్ దేశాల్లో కూడా సోషలిస్టు భావజాలానికి సానుకూలత పెరుగుతోందని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఇటీవల జెక్ రిపబ్లిక్‌లోనూ, జపాన్‌లోనూ జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు గణనీయమైన శక్తిగా గెలుపొందారు.

సోషలిజం, కమ్యూనిస్టు పార్టీలూ ఒక రాజకీయ శక్తిగా అదృశ్యమైనాయని సోవియట్ యూనియన్ తరువాతి కాలంలో పాలక వర్గాలు నమ్మకంగా ఉన్నాయి. కానీ మళ్లీ సోషలిస్టు సిద్ధాంతం తలెత్తడం, ముఖ్యంగా తీవ్ర మైన సంక్షోభ కాలంలో జరగడం నయా- ఉదారవాద సిద్ధాంతానికి పెద్ద సవాలుగా మారింది. అందువల్ల చరిత్రను వక్రీకరించేందుకు ఒక క్రమపద్ధతిలో ప్రయత్నం జరుగుతోంది. కమ్యూనిజాన్ని నాజీయిజంతోనూ, స్టాలిన్‌ను హిట్లర్‌తోనూ సమానం చేస్తూ యూరోపియన్ యూనియన్ ఒక తీర్మానం చేసింది. ఫాసిజాన్ని ఓడించడంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను విస్మరించడం జరిగింది. కమ్యూనిజం, సోషలి జాలకు వ్యతిరే కంగా ఈ సైద్ధాంతిక ప్రచారంతో బాటు యూరప్‌లోని అనేక దేశాలు కమ్యూనిస్టు చిహ్నా లైన ఎర్రజెండా, సుత్తీ కొడవలి వంటి వాటిని ఉపయోగించడంపై నిషేధం విధించేం దుకు చర్యలు ప్రారంభించాయి.

ఈ చర్యల వెనుక ఉద్దేశాలు స్పష్టం: ఈ సంక్షోభ కాలంలో రాడికల్, ప్రజానుకూల ప్రత్యామ్నాయ శక్తులు ముందుకు రావడం అధికారంలో ఉన్న వర్గాలకు ఇష్టంలేదు. ఈ శక్తులు బలంగా లేకపోవడంతో ప్రజలు తమకు అందుబాటులో ఉన్న ఇతర మార్గాల్లో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తారు. మితవాదులు, ఛాందసవాదులు, అరాచకవాదులు, ఇతర అన్ని రకాల అవకాశవాద శక్తులూ, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని వినియోగించు కోడా నికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా అవి ప్రజల్లోని విప్లవ చేవను నీరుగార్చి దాన్ని పిడివాదంవైపుకు మళ్లిస్తాయి. ఇది అంతిమంగా పాలక వర్గాల ప్రయోజనాలనే కాపాడుతుంది.

**మితవాదం, ఇతర ధోరణుల పెరుగుదల**

మాంద్యం పరిస్థితులు పచ్చి మితవాద చైతన్యం పెరగడానికి మంచి భూమికగా మారుతుంది. అమెరికాలో టీపార్టీ ఉద్యమం అభివృద్ధి చెందడం, జపాన్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కొలంబియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో మితవాద ప్రభుత్వాలు ఏర్పడ్డం దీనికి నిదర్శనం.

ప్రపంచ వ్యాపితంగా అరాచకవాదం కూడా పెరిగిపోతోంది. వీరు పెట్టుబడిదారీ వ్యవస్థను తీవ్రంగా విమర్శిస్తారు. సంక్షోభాన్ని చెండాడుతారు. కానీ వ్యవస్థను కూలదోయడానికి మాత్రం సహకరించరు. పైగా అది మరిన్ని కాలాలు మనుగడ సాగించడానికి సహాయ పడతారు.

కార్మికవర్గంమంటే వారికి ఏవగింపు, సంస్థాగత నిర్మాణమన్నా, క్రమశిక్షణన్నా, రాజకీయపార్టీలన్నా అసహ్యం. ఈ ధోరణులే వారిని వాస్తవాలు చూడని గుడ్డివాళ్లుగా మార్చేస్తుంది. వీళ్లంతా ప్రాథమికంగా పెటీ-బూర్జువా వర్గానికి చెందిన వాళ్లు. తీవ్రమైన నినాదాలతో వాళ్లు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారు. అప్పుడప్పుడు స్పాంటేనియస్‌గా వచ్చే కార్యాచరణలకు పూనుకుంటారు. కొన్ని సార్లు మిలిటెంట్ కార్యాచరణ చేస్తారు. కానీ వారికి 'సంస్థాగతనిర్మాణం' మీదా, ప్రణాళికా బద్ధమైన, చైతన్యపూర్వకమైన కార్యాచరణకార్యక్రమాల మీదా నమ్మకం లేకపోవడం వల్ల వారి కార్యాచరణ పద్ధతులు విఫలమవుతాయి.

1930లలో మహామాంద్యం తెచ్చిన వినాశనాన్ని వివిధ పెట్టుబడిదారీ దేశాలు వివిధ రూపాల్లో ఎదుర్కొన్నాయి. ఈ మార్గాల్లో ఒకటి పాసిజం పెరుగుదలకు భూమిక నేర్పరిచింది. ప్రస్తుత మాంద్యాన్ని ప్రభుత్వాలు ఎలా పరిష్కరిస్తాయి అన్న అంశం సామాజిక సంఘర్షణల లక్షణాలనూ, మానవాళి మనుగడనూ నిర్ణయిస్తాయి. శక్తివంతమైన పురోగామి సోషలిస్టు ఉద్యమం లేకపోవడం వల్ల మితవాద శక్తులు తలెత్తే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల నేడు మిత వాద రాజకీయాలు, నయా-ఫాసిస్టు శక్తుల పెరుగుదలకు అవకాశమిచ్చే ధోరణులకు వ్యతిరేకంగా పోరాడ్డమే కాకుండా ప్రజాగ్రహాన్ని సక్రమ మార్గంలో పెట్టాల్సిన బాధ్యత నేడు సమాజంలోని పురోగామి సెక్షన్లపై ఉంది.

నేటి అంతర్జాతీయ పరిస్థితి అనేక అవకాశాలను కల్పిస్తోంది. చరిత్ర నేడు మన భుజాలపై విపరీతమైన బాధ్యతలు పెట్టింది. వస్తుగతమైన పరిస్థితులను ఉపయోగించుకుని సమాజాన్ని పరివర్తన గావించే అవకాశాన్ని అది మనకు ఇచ్చింది. నేడు ప్రపంచంలో అనేక రకాలైన నిరసనలు జరుగుతున్నాయి. పొదుపు చర్యల- వ్యతిరేక, వాతావరణ మార్పుల - వ్యతిరేక, పెట్టుబడిదారీ వ్యవస్థ - వ్యతిరేక వగైరా, వగైరా నిరసనోద్యమాలు జరుగుతున్నాయి. వాటన్నిటినీ ఒకే చోటుకి తెచ్చి, ఐక్యంగా ఎదురుదాడికి దింపడమే నేడు మన ముందున్న పెద్ద సవాలు. ⊙

ఇంటర్వ్యూ

# మంచి పరిపాలనా వ్యవస్థ



## ఇర్ఫాన్ హబీబ్‌తో ఇంటర్వ్యూ

ఏ పుస్తకమైనా ప్రచురించబడిన వెంటనే ప్రామాణిక గ్రంథం అన్న గుర్తింపు పొందటం సాధ్యం కాని పని. కానీ మొఘల్ భారతదేశంలో వ్యవసాయక వ్యవస్థ 1556–1707 అన్న గ్రంథం దీనికి మినహాయింపు. ఈ పుస్తకం 1963లో ప్రచురితం అయ్యింది. దాని రచయిత 34 ఏళ్ల వయసులో ఉన్న మార్క్సిస్టు మేధావి **ఇర్ఫాన్ హబీబ్**. అనతికాలంలోనే ఆయన చరిత్రకారుల్లో అద్వితీయమైన వారుగా గుర్తింపు పొందారు.

'మొఘల్ సామ్రాజ్యపు అట్లాస్ : రాజకీయ ఆర్థిక చిత్రపటాలు, సవివరమైన నోట్స్' అన్నది గత ఐదు దశాబ్దాల్లో ఇర్ఫాన్ హబీబ్ మేధోశక్తి నుండి ఉద్భవించిన మరో ప్రామాణిక గ్రంథం. 83 ఏళ్ల వయసులో ఆయన నేటికీ అలిఘర్‌లోని తన ఇంటి నుండి అలిఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం చరిత్ర బోధనా శాఖ వరకు సైకిల్‌పై వస్తూనే ఉంటారు. చరిత్రకారుడిగా ఓనమాలు దిద్దింది మొదలు ఘనాపాఠీగా రాణించటం వరకు ఆయన జీవితం ఈ డిపార్ట్‌మెంట్ చుట్టూనే తిరిగింది. పిహెచ్‌డి పట్టా కోసం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో గడిపిన కొద్ది కాలం దీనికి మినహాయింపు. ఆయన తండ్రి మొహమ్మద్ హబీబ్ సైతం మధ్యయుగాల భారతదేశానికి సంబంధించినంత వరకు జాతీయవాద చరిత్రకారుడిగా గుర్తింపు పొందిన పరిశోధకులు.

ఇర్ఫాన్ హబీబ్ పడకకుర్చీ మేధావి కాదు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొనటం, నిస్సంకోచంగా తన అభిప్రాయాలు వ్యక్తం చేయటం వంటి కారణాల రీత్యా ఆయన అన్ని రకాల మతోన్మాదుల సైద్ధాంతిక దాడులకు లక్ష్యంగా నిలిచాడు. ఈ మధ్యకాలంలో అలిఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థ హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌కు వ్యతిరేకంగా మాట్లాడినందుకుగాను ఆయన విమర్శలెదుర్కొన్నారు. పద్మభూషణ్ లాంటి ఎన్నో ఉన్నత పురస్కారాలు అందుకున్న హబీబ్ భారత చరిత్ర పరిశోధనా మండలి (ఐసిహెచ్‌ఆర్) సంస్థకు అనేక సంవత్సరాలు పాటు నాయకత్వం అందించారు. ప్రస్తుతం ఆయన అలిఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఎమిరిటస్‌గా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో ప్రభుత్వం, పరిపాలన ఎలా ప్రారంభమైంది, ఏ విధంగా రూపాంతరం చెందింది, ఈ కోణంలో స్వతంత్ర భారతదేశం అనుభవం ఏమిటి అన్న విషయాలపై **కుల్‌దీప్ కుమార్** నిర్వహించిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఈ దిగువన ఇస్తున్నాము:

**ప్రాచీన భారతదేశంలో ప్రభుత్వం నిర్వహణ సమస్య గురించి ఆలోచించిన సందర్భాలు ఉన్నాయా? వేల సంవత్సరాల భారత చరిత్రలో ప్రభుత్వం, పరిపాలన అన్న భావనలు ఎలా ప్రారంభ మయ్యాయి? ఎలా పరిణతి చెందాయి?**

ఈ ప్రశ్నలో పరిపాలన అంటే ఏమిటో ముందు స్పష్టం చేద్దాం. పరిపాలన అని మనం ప్రస్తావించినప్పుడల్లా సామాజిక సంస్థలు, ఉదాహరణకు చరిత్ర పూర్వ యుగాల నుండీ ఉనికిలో ఉన్న ఆదివాసీ సాంప్రదాయాలు మనం మర్చిపోతున్నాము. ప్రభుత్వం, తన ప్రజలతో ఎటువంటి సంబంధాలు నెరిపింది అన్నది మాత్రమే మనం పరిశీలిస్తున్నాము. అందువల్ల అసలు ప్రభుత్వం అంటే ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రభుత్వం అనే సంస్థ ఎప్పుడు ప్రారంభమైంది? ఎలా పరిణామం చెందింది? ప్రభుత్వం అనే సంస్థ ఏర్పడి కొనసాగటానికి కావల్సిన అంశాలు, పరిస్థితులు, కారణాలు ఏమిటి? మార్క్స్, ఏంగెల్స్ రచనల ఆధారంగా ప్రభుత్వం గురించి నిర్దిష్ట ప్రామాణిక నిర్వచనం చెప్పిన చరిత్రకారుడు గార్డన్ చైల్డ్. వ్యవస్థలో అదనపు విలువ పోగుపడ్డప్పుడే ప్రభుత్వం గురించిన భావన మొదలైంది. దీర్ఘకాలం పాటు ఇదే అవగాహన చలామణి అయ్యింది. కానీ అమెరికా ప్రభుత్వ అవగాహనకు దగ్గరగా ఉన్న నూతన పురావస్తుశాస్త్రం ప్రారంభమయ్యాక గార్డన్ చైల్డ్ ఇచ్చిన అవగాహనను ఈ నూతన పురావస్తు శాస్త్ర అవగాహన సవాలు చేసింది. పట్టణాలు, పల్లెల మధ్య వాణిజ్య సంబంధాలు ఉన్నందువల్ల అదనపు విలువ ఉత్పన్నమయినపుడు ప్రభుత్వం అవసరం తలెత్తలేదని వాదిస్తారు. చేతివృత్తుల ఉత్పత్తులు పల్లెలు పట్టణాల మధ్య వాణిజ్య లావాదేవీలకు తెరతీశాయి. ఈ వాణిజ్య లావాదేవీల పరిరక్షణ వ్యవస్థ కింద ప్రభుత్వం ఆవిర్భవించిందన్న కొత్త వాదన ముందుకొచ్చింది. ఇది ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వం ఆవిర్భావానికి సంబంధించిన భావవాద దృక్పథంగా పరిగణిస్తాను.

**మిగులు అంటే మీ దృష్టిలో వ్యవసాయరంగంలో ఏర్పడిన మిగులు అనేనా అర్థం? దీనికి భిన్నంగా వాళ్లు మాట్లాడుతున్న మారకం వ్యవస్థ ఎటువంటిది? వస్తుమార్పిడి వ్యవస్థేనా?**

అవును. ప్రాథమికంగా వ్యవసాయక మిగులు గురించే చెప్తున్నాను. వ్యవసాయం అభివృద్ధి కావటంతో మిగులు ఏర్పడుతుందని శక్తివంతమైన తెగలు మిగిలిన తెగలపై ఆధిపత్యం సంపాదించి వారి మిగులును కూడా స్వాధీనం చేసుకుంటాయని గార్డన్ చైల్డ్ వ్యాఖ్యానించారు. సాధారణమైన వస్తుమార్పిడి పద్ధతి ద్వారా వాణిజ్యం ప్రారంభం అయ్యిందన్న వాదనలో అనేక ఇబ్బందులున్నాయి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తయారైన మిగులుపై ఆధారపడకుండా కేవలం వస్తుమార్పిడిపైనే ఆధారపడి ఉంటే ఈ విధంగా మార్పిడి అయిన వస్తువులు ఆయా ప్రాంతాల్లో వెలుగులోకి రావాలి. కానీ అలా జరగలేదు. సింధు నాగరికత గ్రామాల్లో కేవలం మట్టితో తయారైన పాత్రలు మాత్రమే తవ్వకాల్లో వెలుగు చూశాయి. ఆ సమయంలో పట్టణ ప్రాంతాలుగా అభివృద్ధి చెందిన కేంద్రాల్లో చేతివృత్తుల్లోనో మరో రకంగానో తయారైన అనేక రకాల వస్తువులు వినియోగంలో ఉన్నాయి. మారకం పద్ధతిలో ఈ వస్తువులు గ్రామాలకు వెళ్లినట్లైతే ఆ తవ్వకాల్లో ఎక్కడో ఒక చోట ఇవి బయట పడాలి. అలా బయట పడలేదు. అందువల్ల మొదటి వాదన సమకాలీన సమాజంలో ఏర్పడ్డ మిగులు, అదనపు విలువపై యాజమాన్యం చేపట్టే క్రమంలో రాజ్యం ఏర్పడిందని ప్రతిపాదిస్తే రెండో వాదన ప్రభుత్వం పెద్దఎత్తున ఈ మిగులును స్వాధీనం చేసుకున్నా అది కేవలం వాణిజ్య పరిరక్షణ క్రమంలో జరిగిందని మాత్రమే వాదిస్తోంది.

సింధు నాగరికత కాలంలో ఉపయోగించిన లిపిని మనం చదవలేకపోతున్నాము. అందువల్ల ప్రభుత్వం గురించిన వారి భావన, అవగాహన ఏమిటన్నది మనకు తెలియటం లేదు. కానీ ఆ కాలంలో సింధు నాగరికత విలసిల్లిన ప్రాంతాల్లో శక్తివంతమైన రాజ్య వ్యవస్థ ఉందన్నది నిస్సందేహం. మెసపటోమియా నాగరికతకు సంబంధించిన శాసనాలు వెలుగు చూశాయి. ఈ శాసనాలు క్రీస్తు పూర్వం మూడు వేల సంవత్సరాలకు చెందినవని నిర్ధారణ అయ్యింది. ఈ శాసనాల్లో పౌర, నేర చట్టాలు నియంత్రించటం రాజ్యం బాధ్యత అన్నది అర్థం అవుతుంది. అందువల్ల మనకు తలెత్తే మొదటి ప్రశ్న ఏమిటంటే భారతదేశంలో ప్రభుత్వం ద్వారా పౌర నేర చట్టాల నియంత్రణ ఎప్పుడు ప్రారంభమైంది అన్న ప్రశ్న. రుగ్వేదం, తదనంతర కాలానికి చెందిన వేద వాంగ్మయంలో మెసపటోమియా నాగరికతలో కనిపించిన రాజ్య వ్యవస్థ పూర్తిగా మాయమైంది. సాంప్రదాయం చట్టానికి మొదటి మెట్టు. ఎక్కడ సాంప్రదాయం ముగిసింది, మతం ప్రారంభమైంది అన్నది విస్పష్టంగా గుర్తించటం కష్టంగానే ఉంది. రుగ్వేదంలో కనిపించే పాలకుడు చట్టాన్ని అజమాయిషీ చేసే శక్తిగా కంటే దోపిడీదారుడిగానే కనిపిస్తాడు.

**అంటే చట్టాలు రూపొందించే పని బాహ్మణులకు వదిలిపెట్ట బడిందా?**

ఈ ప్రక్రియ పరిణామం చాలా కాలం తర్వాత మొదలైంది. ధర్మసూత్రాలు, ధర్మశాస్త్రాలు ఉనికిలోకి రావటంతో మొదలైంది. వైదీక వాంగ్మయంలో మను ధర్మశాస్త్రాన్ని అందించినట్లు చెప్పే దాఖలాలు కూడా లేవు. బలవంతంగా ఎత్తుకుపోవటాన్ని సమర్థించుకుంటూ గొప్పగా ప్రశంసించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆ విధంగా చూసినపుడు అది (వైదీక వాంగ్మయం ప్రస్తావించే సమాజం) ఆదివాసీ తెగల స్థాయికి అభివృద్ధి చెందిన సమాజమే. ఈ పరిణామం ఒక దశకు చేరుకున్న తర్వాత అంటే మహా జనపదాలు ఏర్పడిన తర్వాత మరింత నిలకడైన రాజ్యాలు ఉనికిలోకి వచ్చినట్లు మనకు అర్థమవుతోంది. ఈ కాలానికి చెందిన ప్రభుత్వం, రాజ్య వ్యవస్థ గురించి అర్థం చేసుకోవటం చాలా క్లిష్టమైన పనిగా ఉంది. బౌద్ధ వాంగ్మయంలో కొంత సమాచారం ఉన్నప్పటికీ అది తర్వాతి కాలానికి సంబంధించినదే తప్ప వేదవాంగ్మయ అనంతర కాలానికి సంబంధించినది కాదు. అశోకుని శిలా శాసనాలు ఇప్పటి వరకు మనకు లభ్యమవుతున్న అత్యంత పురాతన ఆధారాలు. ఈ శాసనాల్లో మహా జనపదాల నాటి శక్తివంతమైన రాజ్యవ్యవస్థ ఉనికిని ధృవీకరించే వివరాలు ఉన్నాయి. కానీ మగధ, కోసల, అవంతి రాజ్యాలు శక్తివంతమైన రాచరిక వ్యవస్థలనీ, లిచ్ఛవి, శాఖ్య రాజ్యాలు పాతకాలపు ఆదివాసీ గణ రాజ్యాలు అన్న విషయం మనకు బౌద్ధ వాంగ్మయం ద్వారా అర్థమవుతుంది. మగధ సామ్రాజ్యం లిచ్ఛవీ జనపదాన్ని పాదాక్రాంతం చేసుకుంటే, కోసల రాజ్యం శాఖ్య జనపదాన్ని నాశనం చేసింది. శాఖ్య జనపదం అంటే గౌతమ బుద్ధుడి వంశానికి చెందిన తెగ. ఈ విధంగా రాజ్యాల ఆవిర్భావం గురించి కొంత సమాచారం ఉంది కానీ ఈ రాజ్యాల్లో శాసన వ్యవస్థ గురించిన సమాచారం మాత్రం లభ్యం కావటం లేదు. అయితే మౌర్యుల కాలానికి పరిస్థితులు మారాయన్నది మాత్రం నిస్సందేహం.

**అంటే కౌటిల్యుని అర్థశాస్త్రం మనకు శాసన వ్యవస్థ గురించి సమాచారం అందించే మౌలిక గ్రంథమా?**

కౌటిల్యుడి గురించి చర్చించే ముందు బ్రాహ్మణత్వం, న్యాయశాస్త్రాలు అందించే వనరుగా రూపాంతరం చెందటం, మతం రూపొందటంలో ధర్మశాస్త్రాల పాత్ర గురించి కొద్దిగా చర్చించుకుందాం. ధర్మశాస్త్రాలు రాజ్య వ్యవస్థ ఏర్పడటానికి ముందు జరిగిన పరిణామాలు కావు. రాజ్య వ్యవస్థ, శాసన వ్యవస్థ ఏర్పడటానికి సమాంతరంగా జరిగిన పరిణామం అని భావిస్తున్నాను. ధర్మసూత్రాలు మన వాంగ్మయంలో చాలా ఆలస్యంగా వచ్చాయి. ఇవి బుద్ధుడి కాలానికి చెందినవి. ఉపనిషత్తుల క్రమంలో మధ్యలో ఉన్న ఉపనిషత్తులు సైతం ఈ కాలానికి చెందినవే. అంటే ఇక్కడ శాసనవ్యవస్థ సర్వామోద వ్యవస్థగా రూపొందే క్రమం రెండు పద్ధతుల్లో జరిగిందని చెప్పవచ్చు. రాజు, బ్రాహ్మణుల ద్వారా ఈ ప్రక్రియ నిర్దిష్ట రూపం తీసుకుంది. ఈ క్రమంలో కుల వ్యవస్థ ఎక్కడ ప్రారంభమవుతుంది అన్నది కూడా మరో ఆసక్తికరమైన పరిణామం. బుద్ధుడి కాలంలో మగధ, కోసల రాజ్యాల్లో వర్ణ వ్యవస్థ చాలా బలంగా ఉండేది. కానీ ఈ వర్ణవ్యవస్థ సింధు నాగరికత కాలంలో ఉనికిలో లేదు. అలెగ్జాండర్ దండయాత్రకు వచ్చినపుడు ఆయన మందిమార్బలంలో చరిత్రకారులు కూడా ఉన్నారు. వారి రచనల్లో సమాకాలీన భారత సమాజానికి సంబంధించిన వివరాలు పొందుపర్చబడ్డాయి. ఈ వివరాల ఆధారంగా తర్వాతి తరం చరిత్రకారులు భారతదేశ సామాజిక పరిస్థితుల గురించి వ్యాఖ్యానాలు మనముందుంచారు. అలెగ్జాండర్ వెంట వచ్చిన చరిత్రకారులు సింధు నాగరికత కాలంలో బ్రాహ్మణులు ఉన్నట్లు రికార్డు చేశారు తప్ప వర్ణ వ్యవస్థ ఉన్నట్లు రికార్డు చేయలేదు. కానీ మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్య పరిపాలనలో ఉన్న మగధ పర్యటించినపుడు కులవ్యవస్థ గురించి సవివరంగా రికార్డు చేశారు. మెగస్తనీస్ ఏడు కులాల గురించి ప్రస్తావిస్తాడు. నిజానికి ఎన్ని కులాలు ఉన్నాయన్నది ఎవ్వరికీ తెలియని అంశం. ఎందుకంటే ధర్మశాస్త్రాల్లో సైతం మధ్యంతర వర్ణాలు, కులాల గురించిన ప్రస్తావన ఉంది. అంటే చాతుర్వర్ణ వ్యవస్థ ఊహాజనితమే అన్నది ఇక్కడ తేటతెల్లమవుతోంది. ఈ ఒక్క అంశంలో మినహా మిగిలిన విషయాల్లో మెగస్తనీస్ రచన వర్ణ వ్యవస్థ గురించి వివరంగా ఉంది.

ఆ విధంగా రాజ్యం స్థాపించబడింది. కులవ్యవస్థను అమలుచేయటం రాజ్యం కర్తవ్యం అని బ్రాహ్మణ్యాలు చెప్తున్నాయి. కానీ నిజానికి క్రీస్తు శకం రెండో శతాబ్దంలో మాత్రమే శాతవాహన రాజులకు చెందిన శిలాశాసనాల్లో వర్ణసంక్రమణం జరగకుండా నిరోధించటం రాజు కర్తవ్యం అని తొలిసారిగా ప్రస్తావించబడింది. అప్పటివరకు వర్ణ వ్యవస్థ / కులవ్యవస్థ అజమాయిషీలో రాజ్యానికి

పాత్ర ఉన్నట్లు దాఖలాలు లేవు. ఈ విషయాలను బట్టి నాకు అర్థమైనదేమంటే సమాజం వర్ణవ్యవస్థను ఉనికిలోకి తెస్తే మతం దాన్ని గుర్తించింది. అంతే తప్ప బ్రాహ్మణ్యం వర్ణవ్యవస్థను సృష్టించింది అనటానికి ఆధారాలులేవు. శాతవాహనులు బౌద్ధ మతావలంబీకులు, బౌద్ధమత పోషకులు అన్న విషయాన్ని కూడా మనం ఇక్కడ గుర్తు పెట్టుకోవాలి.

ఇప్పుడు శాసనవ్యవస్థ మూలాల గురించి పరిశీలిద్దాం. భారతదేశంలో శాసన వ్యవస్థ గురించిన ప్రాథమిక ప్రస్తావన అశోకుని శిలాశాసనాల్లో కనిపిస్తుంది. అశోకుని శిలాశాసనాలు భారత వాంగ్మయానికి సంబంధించి తేదీలతో కూడిన రాత ప్రతులు అని కూడా మనం గుర్తు పెట్టుకోవాలి. ఈ శిలా శాసనాల్లో అశోకుడి అనేక ప్రకటనలు ఉన్నాయి. ఈ ప్రకటనల్లో రాజ్యం, శాసన వ్యవస్థల గురించిన ప్రస్తావనలు వున్నాయి. మరో ఆసక్తికరమైన ప్రస్తావన రుణ గ్రస్తత గురించిన ప్రస్తావనలు. ఒక శాసనంలో అశోకుడు "పాలకుడిని అయిన నేను నా ప్రజలకు రుణగ్రస్తుడనై ఉన్నాను. ఎందుకంటే వారు నాకు సుంకాలు చెల్లిస్తున్నారు. నా అధికారులు నాకు రుణగ్రస్తులై ఉన్నారు. ఎందుకంటే నేను వారికి వేతనాలు ఇస్తున్నాను" అని ప్రస్తావిస్తాడు. ప్రొఫెసర్ ఆర్.ఎస్. శర్మ అశోకుని శిలాశాసనాల గురించి ప్రస్తావించకపోయినా అంతకు పూర్వపు కాలానికి సంబంధించిన ఆధారాలు ప్రస్తావిస్తూ భారతీయ చింతనలో సామాజిక ఒడంబడిక లేదా సామాజిక బాధ్యత అన్న కోణం ఉందని నిర్ధారిస్తారు. అయితే నా అభిప్రాయంలో అశోకుని శిలాశాసనాలు సమకాలీన సామాజిక స్థితి గురించి వివరించే ప్రాథమిక సమాచార సాధనాలు. అంతేకాదు. ఇవి ప్రజల నుండి వచ్చిన సమాచారం కాదు. నేరుగా పాలకుడి నుండి వచ్చిన సమాచారం కావటంతో అవి మరింత ప్రాధాన్యత కలిగినవని అభిప్రాయపడుతున్నాను. ఆ విధంగా ఈ శిలాశాసనాలు, ఆర్.ఎస్. శర్మ చెప్పిన సామాజిక ఒడంబడిక రెండువైపుల నుండి ఉన్నట్లు – అటు రాజుకు ప్రజలకు మధ్య, ఇటు ప్రజలకు రాజుకు మధ్య – రూఢీ చేస్తున్నాయి. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే అశోకుడు తన నైతిక విలువలను ఏ మతానికి ఆపాదించకపోవటం. ధర్మం అనేది నైతికత అని ఆయన అభిప్రాయం. ఒక శిలాశాసనంలో బౌద్ధ బోధనల్లో కొన్ని ధర్మం గురించి చెప్తున్నాయని అంటూనే ఆయన తన ఆదేశాల్లో మాత్రం బుద్ధుడు చెప్పాడు కాబట్టి అందరూ పాటించాలని ఎక్కడా చెప్పలేదు. ఆ విధంగా చూసినపుడు ఇది లౌకిక ధోరణిని కలిగి ఉన్న ఆదేశంగా మనం పరిగణించాలి.


ఆర్.ఎస్. శర్మ

**జీవహింసను, మతపరమైన ఉత్సవాలను నిషేధిస్తూ జారీ చేసిన ఆదేశాలను మనం ఏ విధంగా చూడాలి?**

అవును. ఒక విధంగా చూసినపుడు అటువంటి ఆదేశాలు బ్రాహ్మణ్య ప్రవచనాలు, ఆదేశాల అమలు విషయంలో రాజ్యం జోక్యం చేసుకోవటమే. ఆయన మహాబోధికి వెళ్లే ముందు బ్రాహ్మణులు, శ్రమణకుల ఆదేశాలు తీసుకున్నట్లు చెప్పారు. ఏది ఏమైనా ఈ పద్ధతులు, ప్రమాణాలు వేటినీ ఆయన ఏదో ఒక మతానికో ఒక ఆచారానికో మరో సాంప్రదాయానికో ఆపాదించలేదు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఉన్న ఆదేశం. ఆ ఆదేశంలో సాంప్రదాయం ముఖ్యం కాదు. ధర్మం ఒక్కటే ముఖ్యం అని అశోకుడు స్పష్టం చేస్తాడు. అంతేకాదు. ఆయన తన ఆదేశాల్లో ఎక్కడా వర్ణం, కులం ధర్మంలో భాగం అని ఎక్కడా చెప్పకపోవటం అంతకంటే ముఖ్యమైన అంశం. దీని అర్థం ఏమిటంటే మౌర్య సామ్రాజ్యం దేశమంతటా విస్తరించటంతో పాటు అన్ని ప్రాంతాల్లో కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఒకే తీరుగా లేకపోవటం కూడా. దాని గురించిన ప్రస్తావనలు అశోకుడు జారీ చేసిన ఆదేశాల్లో లేకపోవటానికి ఒక ముఖ్య కారణం అయి ఉంటుంది. ఇక్కడ పరిపాలనకు సంబంధించిన మరో ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే, ఇతర సంస్కృతులకు సంబంధించిన ప్రజల గురించిన అభిప్రాయాలు. గ్రీకు భాషలో ఉన్న శాసనాల్లో ఆయన మరణానంతర జీవితం గురించి ప్రస్తావించలేదు కానీ ప్రాకృత భాషలో రాసిన శాసనాల్లో స్వర్గం గురించి ప్రస్తావిస్తాడు. ఆయన నిర్వాణం గురించి ప్రస్తావించటం లేదు. ఎందుకంటే ఆయన పరిపాలనలో ప్రజలు స్వర్గం కావాలనుకుంటారు తప్ప ఆత్మత్యాగం కోరుకోరు అని ఆయనకు తెలుసు. జొరాస్ట్రియన్ మతం సెమెటిక్ మత విలువలకు దగ్గరగా ఉంటుంది. నిజానికి సెమెటిక్ మత సాంప్రదాయాన్ని ప్రారంభించిందే జొరాస్ట్రియన్ మతం. ఆయన జొరాస్ట్రియన్ అనుయాయులను ఉద్దేశించేటపుడు ధర్మాన్ని పాటించటం మీ తుది తీర్పు సమయంలో అక్కరకొస్తుంది అని చెప్తాడు. ఆ శాసనాల్లో అశోకుడు తుది తీర్పును కూడా గుర్తించినట్లు కనిపిస్తుంది. అయితే భారతీయ సాంప్రదాయంలో దానికి స్థానం లేదు. ఈ విషయాలు ఆయన వివిధ మతాలు, మత విశ్వాసాల గురించి నిర్దిష్ట అభిప్రాయాలు ఏర్పరుచుకున్నట్లు అర్థం అవుతుంది. 13వ శిలాశాసనంలో గ్రీకుల సాంప్రదాయంలో బ్రాహ్మణులు వేరు, శ్రమణకులు లేరు అని స్పష్టం చేస్తాడు. అశోకుడు ఒక ప్రత్యేక తరగతికి చెందిన పరిపాలకుడు. పరిపాలన గురించి ఆయన అభిప్రాయాలను అందరూ అంగీకరించలేదు. అయినప్పటికీ ఆయన అభిప్రాయాలు మన వారసత్వంలో ఒక ముఖ్యస్థానం కలిగి ఉన్నాయి.

ఇప్పుడు మీరు ప్రశ్నించిన కౌటిల్యుడి గురించి చూద్దాం. కౌటిల్యుని అర్థశాస్త్రం ఒక ముఖ్యమైన ఆసక్తికరమైన గ్రంథం. అయితే అది సుపరిపాలన గురించిన గ్రంథం కాదు. సఫల పరిపాలన గురించిన గ్రంథం. పరిపాలకుని వ్యక్తిగత విజయాలకు అవసరమైన సోపానాల గురించి చెప్పే గ్రంథం. పరిపాలకుని విజయం ముందు మిగిలిన లక్ష్యాలు అన్నీ దిగదుడుపే. ఈ కోణం నుండి కౌటిల్యుడు పరిపాలన, న్యాయ వ్యవస్థ నిర్వహణ గురించి వివరిస్తాడు.

**అంటే మీ ఉద్దేశ్యంలో ఈ గ్రంథం పరిపాలకుల కోణం మాత్రమే చెప్తుందా? పరిపాలకులకు ఏది అవసరమో అదే చెయ్యాలని చెప్తుందా?**

కాదు. పరిపాలకుడి ప్రయోజనాల గురించి చెప్పే గ్రంథం. పరిపాలకుడు ఆర్యావర్తం మొత్తాన్ని అదుపుచేయగలిగిన చక్రవర్తిగా ఎదగాలి అంటే మిగిలిన ప్రాంతాలనూ, రాజ్యాలనూ, రాజులనూ తమ ఆధీనంలోకి తెచ్చుకోవటమే. ఆయన ఆ గ్రంథం రాసే సమయానికి భారతదేశంలో దేశవ్యాపిత స్వభావం కలిగిన సామ్రాజ్యం లేదు. కానీ అటువంటి సామ్రాజ్య నిర్మాణ కాంక్ష ఉంది. ఈ సామ్రాజ్య నిర్మాణ కాంక్ష ప్రజల ప్రయోజనాల కోసం కాదు. పరిపాలకుల సంపద పెంచటానికి మాత్రమే. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పరిపాలకుల సంపత్తి

పెరగటానికి ఉపయోగపడినంత వరకు ప్రజల సంపద పెంచుకోవటానికి అభ్యంతరం లేదు అన్నది ఒక ముఖ్యమైన సూత్రం. అది వాస్తవికమైన ఆలోచన. ఈ ఆలోచన ముందుకు తెచ్చినందుకు కౌటిల్యుడిని ప్రశంసించాలే తప్ప విమర్శించనవసరం లేదు. లేదంటే పరిపాలకుడు ఏదైనా చెయ్యొచ్చు. హత్యలు చేయ్యొచ్చు. దోపిడీలు, విధ్వంసాలు చెయ్యొచ్చు. మోసం చెయ్యొచ్చు. దేవాలయాలు ధ్వంసం చేయ్యొచ్చు. దీంతో పాటు కౌటిల్యుడు మను కంటే భిన్నమైన న్యాయసూత్రాలు కూడా చెప్పాడు. ఉదాహరణకు విడాకులు తీసుకోవటాన్ని ఆయన అంగీకరించాడు. ప్రాచీన భారత సమాజంలో లేఖా పద్ధతిలో విడాకులు తీసుకునే సాంప్రదాయం ఉంది. ఈ సాంప్రదాయం క్రీస్తు శకం 12వ శతాబ్దం వరకూ కొనసాగింది. ఈ పద్ధతిలో విడాకుల పత్రాలు ఉనికిలో ఉన్నాయి. భారతీయ సంస్కృతిలో విడాకులు తీసుకునే సాంప్రదాయం లేదని శాస్త్రాలు చెప్పినప్పటికీ మధ్యతరగతి, దిగువతరగతి ప్రజల్లో విడాకులు తీసుకునే సాంప్రదాయం ఉంది. శాస్త్రాలు నిషేధించినందున అనేక పరిణామాలు ప్రాచీన భారత సమాజంలో చోటుచేసుకోలేదు అని మనం భావించినప్పటికీ అవన్నీ సర్వసాధారణ పరిణామాలుగా ఉండేవని రుజువవుతోంది. సర్వసాధారణం కాకపోయినా అమల్లో ఉన్న పద్ధతులే. ఉదాహరణకు వితంతు వివాహాలు గురించి చూద్దాం. ప్రాచీన భారత సమాజంలో వితంతు వివాహాలు ఒక సాధారణ అంశం. ఆధునిక కాలం వరకూ ఈ పద్ధతిని అత్యధిక కులాలు పాటించాయి. ఈ విషయాలు ఇక్కడ ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే మనుస్మృతిలో చెప్పిన అన్ని విషయాలూ ప్రాచీన భారతదేశంలో శాసనాలు కాదు అని గుర్తు చేయటానికే.

**కౌటిల్యుని అర్థశాస్త్రంలో మరో ముఖ్యమైన అంశం పరిపాలన విధానం, ఉద్యోగస్వామ్యం, పన్నుల విధానం. ఇదంతా పరిపాలనలో భాగమే కదా?**

అవును. వివిధ స్థాయిల్లో ఉన్న అధికారుల విధులు, కర్తవ్యాలు, పన్నుల విధానం, శిక్షాస్మృతి వంటివి అందులో ఉన్నాయి. అర్థశాస్త్రం సుదీర్ఘకాలంలో క్రోడీకరించబడిన గ్రంథం. అందువల్ల ఆ గ్రంథంలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి. అవికూడా భిన్నమైన అంశాలు ఉన్నాయి. ఉద్యోగస్వామ్యం గురించి చెప్పే భాగం ప్రధానంగా పాతకాలపు పద్ధతుల గురించి వివరిస్తోంది. దీనికి భిన్నమైనది శిక్షాస్మృతి. అయితే శిక్షా స్మృతిలో ప్రభుత్వం విధించే పన్నులు, అపరాధ సుంకాల గురించిన వివరణ ఉంది. కౌటిల్యుడికి అపరాధ సుంకాల మీద ఉన్న ఆసక్తి మిగిలిన ఏ అంశంపైనా ఉన్నట్లు కనిపించటం లేదు. ఇవన్నీ ధర్మశాస్త్రాల్లో కనిపించని అంశాలు.

**నేటి సమకాలీన అర్థంలో పౌరసమాజం ప్రాచీన, మధ్య యుగాల భారతదేశంలో ఉన్నదా? ఉంటే ఏ విధంగా రూపొందింది?**

పౌర సమాజం అన్న భావన స్థూలంగా ఆధునిక భావన. గతంలో దీన్నే ప్రజాభిప్రాయం అనేవాళ్లు. నేడు పౌరసమాజం అని పిలుస్తున్నారు. స్వేచ్ఛ అన్న భావన నుండి ఇది మొదలవుతుంది. ఫ్రెంచి విప్లవంతో ఆధునీకరించబడిన స్వేచ్ఛ అన్న భావన లేకపోతే నేటికీ పౌర సమాజం అన్న భావన మరింత సంక్షిప్తమైనదిగానే ఉండిపోయేది. మధ్యతరగతి ఆవిర్భావం, పురోగతి కూడా ఇందుకు మరో ముఖ్య కారణం. అందువల్ల ఆధునిక అర్థంలో స్వేచ్ఛ అన్నదే లేనపుడు పౌరసమాజం ఎలాసాధ్యపడుతుంది? ఈ మాట అంటున్నంత మాత్రాన ప్రాచీన సమాజంలో భిన్నాభిప్రాయాలు, అభిప్రాయ భేదాలు లేవని అపార్థం చేసుకోకూడదు. నిజానికి భారతదేశంలోనే కాదు. మిగిలిన అనేక దేశాల్లో ప్రాచీన, మధ్య యుగాల కాలంలో శాసన వ్యవస్థ, ప్రభుత్వం గురించి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి.

బాణుడి హర్షచరితం చదివినపుడు, అనువాద ప్రతి చదివేవాళ్లకు కూడా బాణుడు రాజును పొగుడుతూ ప్రస్తావించిన ప్రతి చోటా నిజానికి విమర్శిస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. ఉదాహరణకు ప్రభాకరవర్ధనుడి మరణం గురించిన సన్నివేశాన్ని పరిశీలిద్దాం. ప్రభాకరవర్ధనుడు మరణశయ్యపై ఉన్నపుడు తన దాసదాసీ జనాన్ని పిలిపించుకుంటాడు. వాళ్లు ఆయన శయన మందిరంలో ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. ఇక్కడ ఇద్దరు బాణులు కనిపిస్తారు. ఒక బాణుడు రాజుని ప్రశంసిస్తే మరో బాణుడు రాజు బానిసలతో పనిచేయించుకోవటాన్ని విమర్శిస్తూ కనిపిస్తాడు. మరో ఉదాహరణగా అల్‌బెరూని గ్రంథం కితాబ్ అల్ హింద్ తీసుకుందాం. మహమ్మద్ గజని భారతదేశంలో ఎంతగా విధ్వంసానికి పాల్పడ్డాడంటే హిందువులెవ్వరూ ముస్లింలను సహించలేని మానసిక స్థితికి చేరుకుంటారు అని అల్ బెరూని వ్యాఖ్యానిస్తాడు. ఆ విధంగా వ్యాఖ్యానించిన రచయిత బెరూని ఒక్కరే. సమకాలీన రచనల్లో ఏ రచనలోనూ మనకు ఈ విషయం కనిపించదు. మరోవైపున కల్హణుడు రాసిన రాజతరంగిణిలో కాశ్మీర్ ప్రజలు ఘజనితో పోరాడటమే తప్పు అన్న అభిప్రాయం కనిపిస్తుంది. పాలకులు శాస్త్రవిజ్ఞానం, గణితాన్ని సమర్థించరు కనుక ప్రజలు జోతిష్యాన్ని ప్రశ్నించకూడదు అని అల్ బెరూని అభిప్రాయపడినపుడు జోతిష్యం లేకపోతే ఖగోళం గురించి చూడా చర్చ గాందదన్న కోణాన్ని కూడా అల్ బెరూని మనముందుకు తెస్తున్నట్లు మనం అర్థం చేసుకోవచ్చు.

అందువల్ల ప్రతి సమాజంలోనూ విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయి. అయితే ఇదే పౌరసమాజం అని అనుకోవటం సరికాదు.

పౌరసమాజంలో ఎన్నో గొంతులు ఏకకాలంలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఉంటాయి. ఏ అభిప్రాయం ఏ రూపంలో శాసనవ్యవస్థను ప్రభావితం చేస్తుంది అన్నది ఇదమిద్దంగా నిర్ధారించటం కష్టసాధ్యమైన పని. ఉదాహరణకు థాయ్‌లాండ్ పరిణామాలు తీసుకోండి. మొత్తం మధ్యతరగతి వర్గం ప్రజాతంత్రయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రయత్నిస్తోంది. మౌలికంగా ప్రజాస్వామ్య వ్యవస్థనే తిరస్కరిస్తూ తన అభిప్రాయాలు బహిర్గతం చేస్తోంది. ఒక నిరక్షరాస్యుడైన రైతు వేసే ఓటు అక్షరాస్యుడైన వయోజనులు వేసే ఓటుతో సమానంగా ఎలా పరిగణిస్తామన్న ప్రశ్న ముందుకు తెస్తోంది.

**అక్బర్, షేర్ సా సూరి వంటి పాలకులు శాసన వ్యవస్థ అన్న భావనలో ఏమైనా మార్పులు తీసుక రాగలిగారా?**

సమకాలీన సమాజంలో వేళ్లూనుకుపోయిన సామాజిక విశ్వాసాలు, సాంప్రదాయాలను ప్రశ్నించిన తొలి చక్రవర్తి అక్బర్ అని చెప్పవచ్చు. అలా ప్రశ్నించటానికి ఆయన కారణాలు ఆయనకు ఉండవచ్చు. ఉదాహరణకు 300 మంది భార్యలను పెళ్లిచేసుకున్న వ్యక్తి ఏకపత్నీవ్రత్యం గురించి చెప్పటం నవ్వుల పాలయ్యే విషయమే. ఒకే దేవుడు, ఒకే భార్య అన్నది అక్బర్ ప్రతిపాదన. బాల్య వివాహాలు నిషేధించాలన్నది ఆయన ముందుకు తెచ్చిన మరో అంశం. దాన్ని బట్టి హిందువులు, ముస్లింలు, రెండు సాంప్రదాయాల్లోనూ బాల్యవివాహ వ్యవస్థ ఉన్నదన్నది మనం అర్థం చేసుకోవటానికి ఈ వ్యాఖ్యలు ఉపయోగపడతాయి. మహమ్మద్ ప్రవక్త ఆయేషా విషయంలో ఇలా చేసినందున ముస్లింలు ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ వచ్చారు. అక్బర్ ఈ సాంప్రదాయాన్ని నిషేధించాడు. నేడు బదౌని వంటి కొందరు చరిత్రకారులు అక్బర్ విధించిన ఈ నిషేధం వల్ల

కొందరు అధికారులు అక్రమంగా అనుమతించి తమ జేబులు నింపుకోవటానికి ఉపయోగపడిందని విశ్లేషిస్తున్నారు. అక్బర్ బానిసత్వాన్ని కూడా వ్యతిరేకించాడు. తర్వాతి కాలంలో ఎంతో మంది బానిసలను విముక్తి చేశాడు.

మతం, మతసహనం గురించిన ఆయన అభిప్రాయాలు కూడా ఇంతే విలువైనవి. అయితే అక్బర్ లౌకికతత్వం ప్రబోధించాడని మనం చెప్పలేము. ఒకవేళ అదే లౌకికతత్వం అని చెప్పాలంటే రాధాకృష్ణన్ ప్రతిపాదించిన కోవకు చెందే లౌకికతత్వం అది-ప్రభుత్వమే అన్ని మతాలను ప్రోత్సహించటం ద్వారా ఆయా మతావలంబీకులపై ఎంతో కొంత ప్రభావం చూపించే విధానం. నిజానికి లౌకికతత్వం అంటే రాజ్యం అన్ని మతాలను సమాన దూరంగా ఉంచటం. నేడు మనం చెప్పుకునే అర్థంలో లౌకికతత్వాన్ని అక్బర్ ప్రబోధించకపోయినా ఆనాటికి ఆయన ప్రతిపాదనలు విశిష్టమైనవి, శ్లాఘనీయమైనవి. ఎందుకంటే ఈ కాలంలో అటు ఇస్లాం ఆధిపత్యం ఇటు క్రైస్తవ ఆధిపత్యం ఉన్న ఏ ఇతర దేశాల్లో పాలకులు ఇటువంటి ఆధునిక భావాలు, అభిప్రాయాలు వ్యక్తం చేయలేదు. పాలకులు ఏ మతానికి చెందినవారైనా శాసన వ్యవస్థలో ఏ మేరకు సామాజిక సమానత్వానికి అవకాశం ఉన్నా అది రాజ్యవ్యవస్థ పరిణామంలో ఒక కీలకమైన ఘట్టమనే చెప్పాలి.

ఈ అవగాహనతో మరో ముఖ్యమైన అంశం ముందుకొస్తోంది. దేవుడు అందరికీ వరాలు ఇచ్చినట్లుగానే పాలకుడు తన ప్రజలు ఏ మత విశ్వాసాలు పాటించేవారైనా అందరికీ సమానంగా ప్రయోజనాలు కల్పించాలన్న అంశం. అక్బర్ మొదలు ఔరంగజేబు తొలి నాళ్ల వరకు ఈ సూత్రాన్ని మొఘల్ చక్రవర్తులందరూ అమలు చేశారు.

నిజానికి ఔరంగజేబు తన జైత్రయాత్రలో రాజపుత్‌ల సహకారాన్ని సంపాదించే ప్రయత్నం చేస్తున్నపుడు ఈ సూత్రాన్ని పునరుద్ధరించాడు. శాసనవ్యవస్థకు సంబంధించిన అక్బర్ చెప్పుకోదగ్గ కృషి చేశాడు. సతీసహగమనాన్ని నిషేధించటం అక్బర్ తీసుకున్న మరో పురోగామి చర్య. తొలినాళ్లలో యూరోపియన్ అధికారులు, పరిశీలకులు ఈ విషయాన్ని గ్రంథస్తం చేస్తూ మొఘల్ అధికారులు సతీసహగమనం చేయకుండా మహిళలను అడ్డుకోవటానికి శతవిధాలా ప్రయత్నం చేశారని చెప్పారు. ఏ మహిళనూ బలవంతంగా చనిపోయేలా పురికొల్పరాదు అని చట్టం చెప్తోంది. అందువల్ల కుటుంబ సభ్యులు భర్తచనిపోయిన మహిళలను మొఘల్ అధికారుల వద్దకు తీసుకెళ్లి సతీసహగమనానికి అనుమతి కోరేవారు. ఈ విధానాన్ని పీష్వాలు కూడా తమ రాజ్యంలో అమలు చేశారు. ఇవన్నీ ఎలా ఉన్నా ఒక ముఖ్యవిషయాన్ని మనం మర్చిపోకూడదు. ఇక్కడ మళ్లీ మనం వ్యవస్థలో ఏర్పడే మిగులు భావనకు తిరిగి వద్దాం. భారతదేశంలో శాసన వ్యవస్థ విస్తృతం అయ్యే కొద్దీ భూమి పన్ను దాదాపుగా కౌలుతో సమానమైన స్థాయికి పెరిగింది. ఆడం స్మిత్ మొదలు మార్క్స్ వరకు ఆర్థికవేత్తలందరి రచనల్లో వ్యక్తమైన విషయమేమంటే, భారతదేశంలో భూమి పన్ను, కౌలు ఒకే స్థాయిలో ఉండటం ఆసక్తికరమైన అంశంగా ప్రస్తావించారు. జేమ్స్ మిల్, జాన్ స్టువర్ట్ మిల్ తమ రచనల్లో భారతదేశంలో రైతులు పన్ను చెల్లించటం లేదు, కౌలు మాత్రమే చెల్లిస్తున్నారు అందువల్ల వారిపై భూమి పన్ను లేదు అన్న అభిప్రాయానికి వచ్చారు.

ఇది ఒక ముఖ్యమైన చారిత్రక పరిణామం. ఈ పరిణామానికి పునాదులు క్రీస్తు శకం 13వ శతాబ్దంలోనే పడ్డాయి. అంతకు పూర్వమే ఈ పద్ధతి అమల్లో ఉందా లేదా అన్నది మనకు స్పష్టంగా తెలీదు. ఎందుకంటే దానికి సంబంధించి సరైన సమాచారం లేదు. ఆర్.ఎస్. శర్మ, డి.డి. కోశాంబిలు భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ గురించి సాగించిన పరిశోధనల్లో రైతాంగంపై పన్నులు పెరిగాయి అని ప్రస్తావించినప్పటికీ ఈ విషయంలో దృష్టి సారించలేదు.

ఏదైనా రాజ్యంలో భూమి పన్ను, కౌలు ఒకటే అయినపుడు పరిపాలనా పరంగా అనేక పర్యవసానాలు ఉంటాయి. రైతాంగంపై అదనపు సుంకాల కోసం నేరుగా ప్రభుత్వం నుండే ఒత్తిడి ఉంటుంది. భూస్వాముల నుండి వచ్చే ఒత్తిడి కాదు. నేరుగా ప్రభుత్వమే ఒత్తిడి తెస్తోంది. గతంలో ఉన్నదానికంటే భిన్నంగా గ్రామీణ ప్రాంతాలు నేరుగా రాజ్యం ఆధీనంలోకి, అజమాయిషీలోకి వస్తాయి. మీరు షేర్ సా సూరి గురించి ప్రస్తావించారు. ప్రభుత్వం తరపున భూమి శిస్తు వసూలు చేసే బాధ్యత గ్రామ పెద్దదే అని నిర్ధారించిన తొలి పాలకుడు షేర్ సా సూరి. ఒక గ్రామం నుండి అంత పెద్ద మొత్తంలో శిస్తు వసూలు చేసేటప్పుడు అనివార్యంగా ప్రభుత్వమే కొంతమేరకన్నా గ్రామీణ జీవితాన్ని అజమాయిషీ చేయాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఉన్నత తరగతులవారికీ, భూస్వాములు జమీందార్లకూ రాయితీలు ఇస్తే ఇవ్వవచ్చు. అందువల్ల భూమి శిస్తు కౌలు ఒక్కటే కావటంతో పరిపాలన వ్యవస్థను గ్రామ స్థాయికి విస్తరించాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ పరిణామాన్ని కొన్ని సందర్భాల్లో బర్టన్ స్టీన్ వంటి చరిత్రకారులు గుర్తించారు. విజయనగర సామ్రాజ్యం గురించి రాస్తూ ఆయన విభజించబడిన సార్వభౌమాధికారం అన్న ఒక ప్రతిపాదన ముందుకు తెచ్చాడు. అందువల్ల దక్షిణ భారతదేశంలో కూడా ఈ పరిమిత, విభజిత సార్వభౌమత్వం లేదని అనుకోవటం పొరపాటు అవుతుంది.

**బ్రిటిష్ పరిపాలన పరిస్థితి ఏమిటి? బ్రిటిష్ వలస పాలనలో శాసన వ్యవస్థకు సంబంధించి కొత్త ధోరణులు, పద్ధతులు ప్రతిపాదించబడ్డాయా లేదా?**

మనం వలస పరిపాలనను గమనించినపుడు రెండు అంశాల గురించి ప్రస్తావిస్తున్నాము. అంతకు పూర్వపు కాలం నుండీ అందిన వారసత్వం, వలస పాలన కాలంలోనే ముందుకొచ్చిన కొత్త కోణాలు, కొత్త ధోరణులు ఈ రెండు అంశాలు. భూమి శిస్తు యాజమాన్యం గురించి చూసినపుడు చారిత్రకవారసత్వం స్పష్టంగానే ఉంది. పర్మినెంట్ సెటిల్‌మెంట్ పద్ధతి వచ్చి జమీందార్లను భూమికి యజమానులుగా గుర్తించిన తర్వాత ఈ జమీందార్లు బ్రిటిష్ సామ్రాజ్యం కోరుకున్నంత శిస్తు చెల్లించలేకపోవటంతో వలసపాలన కూడా పాత పద్ధతులు – భూమి శిస్తు కౌలు ఒక్కటే అన్న పద్ధతికి – తిరిగి రావాల్సి వచ్చింది. ఈ అర్థంలో చూసినపుడు వలస ప్రభుత్వం ఇంగ్లాండ్‌లో ప్రభుత్వం కంటే భిన్నమైనది. ఇంగ్లాండ్‌లో భూస్వామి లేదు.

**ఈ పరిణామాలు (ప్రాచ్య భూయాజమాన్యం) ఓరియంటల్ డెస్పోటిజం అన్న సూత్రీకరణకు పునాదులుగా ఉన్నాయా? ఎందుకంటే సూత్రరీత్యా అయినా మొత్తం భూమిపై ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయి కదా!**

అవును. నిజమే. మనం డెస్పోటిజం అన్న భావనను అంగీకరించలేకపోయినా ఈ భావన సమకాలీన వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. అంటే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో వసూలు చేసిన శిస్తు వసూళ్లు పాత పద్ధతిలో వసూలు చేసినవే. వలసపాలకులకు భారత మధ్య యుగాల చరిత్ర నుండి సంక్రమించిన మరో సుగుణం పరమతసహనం. ఐర్లాండ్‌లో ఇంగ్లాండ్ పాలన గురించి అధ్యయనం చేసినపుడు 1800 శతాబ్దం వరకు కాథలిక్ మతస్తుల పట్ల ఇంగ్లాండ్ పాలకులు ప్రదర్శించిన వ్యతిరేకత చాలా తీవ్రంగా ఉందని అర్థం అవుతుంది. కాథలిక్కులకు భూమి కొనే హక్కు లేదు. అందువల్ల 75

శాతం కాథలిక్కుల చేతుల్లో 5 శాతం భూమి మాత్రమే ఉంది. కాథలిక్కులు ప్రభుత్వ అధికారులుగా ఉండకూడదు. ఇంకా వారు విద్య నేర్చుకోవటంతో సహా అనేక అంశాలపై పరిమితులు ఉన్నాయి. భారతదేశంలోని ఈస్టిండియా కంపెనీ ప్రవేశించినపుడు పరమతసహనాన్ని పాటించింది. చివరకు క్రైస్తవ మిషినరీ సంస్థలు కూడా పనిచేయటానికి అంగీకరించలేదు. 1813 వరకు క్రైస్తవ మిషనరీలు ఓడల్లో భారతదేశంలో ప్రవేశించటానికి ఈస్టిండియా కంపెనీ అనుమతించలేదు. ఈ రెండు వారసత్వాలు భారతదేశ మధ్యయుగాల చరిత్ర అందించిన వారసత్వాలే. ఇక్కడ మొఘల్‌లు, మరాఠాలు, ఇతర పాలకుల గురించి మనం చూడాలి. ఈ రాజ్యాల్లో అన్ని మతాల ప్రజలు సైన్యంలో ఉన్నారు. అందువల్ల బ్రిటిష్ పాలకులు భారతదేశంలో తమకంటే ముందు పాలించిన వాళు ఎలా వ్యవహరించారో తెలుసుకుని అలానే వ్యవహరించారు. ఆధునిక న్యాయవ్యవస్థ ప్రవేశపెట్టినప్పటికీ ఖాజీల వంటి పాత న్యాయ వ్యవస్థను కొన్ని చోట్ల అమలు చేశారు. వారన్ హేస్టింగ్స్ మనుస్మృతిని, హిదయాను ఇంగ్లీషులోకి అనువదింప చేసి భారతదేశంలో కంపెనీ ప్రతినిధులు హిందూ, ముస్లిం చట్టాలు రెండూ అమలు చేయాలని ఆదేశించారు. ఇంకా మధ్యయుగాల భారతదేశానికీ, వలసకాలంలోని భారతదేశానికి ఇటువంటి అనేక సామ్యాలు ఉన్నాయి.

ఈ మార్పులు ఆధునిక రాజ్య భావనకు భిన్నంగా జరిగిన మార్పులే. ఎంతమేరకు మతవిశ్వాసాలు, సాంప్రదాయాలు అమలు చేయాలో వలస నిర్ణయించింది. ముస్లిం మత సూత్రాలు చెప్పినట్లు దొంగల చేతులు ఖండించటం, వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నందుకు గాను చంపటం అటు నిజాం పాలనలో గానీ ఇటు మొఘల్ పాలనలో గానీ ఎక్కడా కనిపించలేదు. అంటే కొన్ని మత సూత్రాలు, విశ్వాసాలు పౌర సమాజంలో అమలు సాధ్యం కాదన్న పరిమితులను గుర్తించినట్లు అర్థం అవుతుంది. కానీ బ్రిటిష్ పాలనతో ప్రభుత్వం చట్టాలు చేయటం, మతపరమైన సాంప్రదాయాలు, విశ్వాసాలను ప్రభుత్వం గుర్తించినంత మేర అమలు చేయగలగటం అన్న భావన వేళ్లనుకోనారంభించింది. ఈ ప్రయత్నం మొదట సతి నియంత్రణ చట్టంతో మొదలవుతోంది. సతి విషయంలో పూర్వపు ప్రభుత్వ ఆదేశాలనే పాటిస్తూ వచ్చినప్పటికీ అదనంగా సతి అమలు చేసినవారికి మరణ దండన విధిస్తూ చట్టంలో ప్రస్తావించింది వలస ప్రభుత్వం. ఎటువంటి నష్టపరిహారం లేకుండా బానిసత్వాన్ని రద్దు చేశారు. ఆడపిల్లల శిశుహత్యలను నేరంగా పరిగణించటం ప్రారంభం అయ్యింది. మతం మార్చుకున్నా వారసత్వపుహక్కుల్లో మార్పులు లేకుండా ఉండాలంటే మత మార్పిడికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి.

1885లో దక్షిన్ భారతదేశంలో పేదరికం గురించి సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చినపుడు ఆ సర్వేలో పేద కుటుంబాల్లో అమ్మాయి పుడితే సంతోషిస్తారని అబ్బాయి పుడితే బాధపడతారని గుర్తించారు. కారణమేమిటంటే అమ్మాయి పుడితే పెళ్లి సమయంలో కన్యాశుల్కం కింద పది రూపాయలో, ఇరవై రూపాయలో ఆదాయం వస్తుంది. అబ్బాయి అయితే శుల్కం ఇచ్చుకోవాలి కాబట్టి ఆర్థికంగా కష్టం అన్న అభిప్రాయం పేద ప్రజల్లో వాండేదని ఈ సర్వేలో వ్యక్తం అయ్యింది. ఈ సర్వే వివరాలు కేవలం అప్పటి ఉత్తర పశ్చిమ ప్రావిన్స్, నేటి ఉత్తర ప్రదేశ్ వరకు మాత్రమే ప్రచురించటం జరిగింది. సాధారణంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న మరో అభిప్రాయం అమ్మాయిలైతే మూడు నాలుగేళ్ల వయసులోనే పని చేయటం ప్రారంభిస్తారు, అబ్బాయిలు అయితే పని చేయరు ఆ రకంగాకూడా వారికి ఇబ్బంది అన్న భావన పేద ప్రజల్లో ఉన్నట్లు దక్షిన్ సర్వేలో వ్యక్తం అయ్యింది. అందువల్ల ఆడపిల్ల భ్రూణ హత్యలు పేదల కుటుంబాల్లో జరగలేదు. అవి జమీందార్ల కుటుంబాల్లో మాత్రమే జరిగాయి అని అర్థం అవుతుంది.

దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అమల్లో ఉన్నా దేశవ్యాప్తంగా ఒకే పౌర శిక్షాస్మృతి, నేర శిక్షా స్మృతి అమల్లోకి రావటం కేవలం రాజ్యం, శాసన వ్యవస్థ ఉనికిలోకి వచ్చాక మాత్రమే సాధ్యం అయ్యింది తప్ప మతం ఆ పాత్ర పోషించలేదు. బ్రిటిష్ వాళ్ల అవసరాల రీత్యా దేశమంతటినీ ఏకీకృత పరిపాలన యూనిట్‌గా మార్చారు. రైల్వే ఇందుకు ప్రధాన సాధనంగా ఉపయోగపడింది. ఈ ఏకీకృత ప్రక్రియ కోసం భారతదేశం ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. ఇక్కడ ఒక విషయాన్ని మనం గుర్తుపెట్టుకోవాల్సి ఉంది. బ్రిటిష్ వలస పాలకులు అమలు చేసిన శాసన వ్యవస్థలో, ప్రభుత్వ వ్యవస్థలో భారత ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేయటం ఒక లక్ష్యంగా లేదు. ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చు అన్న భావన ఆచరణాత్మక అనుభవాల ద్వారా సాధ్యం అయ్యింది తప్ప ఫ్రెంచి విప్లవం నుండి పుట్టుకొచ్చిన ఆదర్శాల ద్వారా సాధ్యం కాలేదు. ప్రభుత్వం శాస్త్ర విజ్ఞాన రంగాలను అభివృద్ధి చేయటం అందుకు తోడ్పాటు అందించటం ప్రారంభమైంది. దాంతో ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోవటం సాధ్యమైంది.

ప్రభుత్వం పన్నుల విధానం ద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థలను నిర్మించుకోవచ్చు అన్న భావన తర్వాతి కాలంలో ముందుకొచ్చిందే. అయితే భారత ఆర్థికాభివృద్ధి బ్రిటిష్ ప్రభుత్వ ఎజెండాలో లేదు. ఈ కోణాన్ని ముందుకు తెచ్చిన ఘనత మాత్రం స్వాతంత్ర పోరాటం ప్రారంభించిన తొలితరం మేధావులు దాదాబాయి నౌరోజి, రమేష్ చంద్ర దత్ వంటి వాళ్లకు దక్కుతుంది.

**శాసన వ్యవస్థ నిర్మాణంలో స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాల పాత్ర ఏమిటి?**

జాతీయ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయటంలో ఆసక్తి లేని బ్రిటిష్ వారి పాత్ర కంటే మెరుగైన పాత్రనే స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాలు ఈ విషయంలో పోషించాయి. రాజ్యాంగం భారతదేశ శాసన వ్యవస్థకు సంబంధించిన స్పష్టమైన పునాదిని అందించింది. వివిధ రంగాల్లో ప్రభుత్వం తీసుకున్న సానుకూల చర్యలు (ఎఫర్మేటివ్ ఆక్షన్స్) ఇందుకు నిదర్శనం. అయితే మనం ఇంకా బాగా చేయగలిగే అవకాశాలు ఉన్నాయి. అయితే ఒక విషయం స్పష్టం. ప్రభుత్వం అన్ని రంగాల్లో జోక్యం చేసుకోగలదు అన్నది ఈ కాలంలో రుజువు అయ్యింది.


**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

విశ్లేషణ

# ఆహారభద్రతను దెబ్బతీసే బాలి ఒప్పందం

**బాలి సమావేశాల్లో భారతదేశాన్ని, భారతదేశం ప్రతిపాదించిన ఎజెండాను ఒంటరిపాటు చేయటంలో అమెరికా నేతృత్వంలోని సంపన్న దేశాలు విజయం సాధించాయి. ఈ కుతంత్రాలను అధిగమించి అంతర్జాతీయ వాణిజ్యంలో అటు వర్ధమాన దేశాల ప్రయోజనాలనూ, ఇటు దేశ ప్రజల ప్రయోజనాలనూ కాపాడటంలో యుపిఎ 2 ప్రభుత్వం విఫలం కావటమే కాదు, తన నిష్క్రియాపరత్వంతో వర్ధమాన దేశాల స్వారభౌమత్వాన్ని, ఆహారభద్రతను అంతర్జాతీయ మార్కెట్‌లో తాకట్టుపెట్టింది.**

**కొండూరి వీరయ్య**

ఇండొనేషియాలోని వేసవి విడిది కేంద్రం బాలిలో 2013 డిసెంబరు మొదటి వారంలో ముగిసిన ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వైవార్షిక సమావేశాలు నాలుగు అంశాలను ముందుకు తెచ్చాయి. ఇందులో రెండు అంశాలు బాలి ఒప్పందంలో అంతర్భాగాలు కాగా మిగిలిన రెండు సదరు ఒప్పందం ఆచరణ సాధ్యం కావటానికి ఏర్పాట్లు. భారత దేశంలో ఆహారభద్రత చట్టం అమలు సాధ్యాసాధ్యాల గురించిన చర్చ మొదటి అంశం. వాణిజ్యాన్ని సుసాధ్యం చేసే ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందం రెండవది. ఒప్పందంలోని అసమానతలు, ఈ అసమాన ఒప్పందాన్ని సాధించుకోవటానికి సంపన్న దేశాలు అనుసరించిన విభజించి పాలించు వ్యూహం ఇతర రెండు విషయాలు.

నిజానికి ట్రేడ్ ఫెసిలిటేషన్ ముసాయిదా దోహా సమావేశాల నాటి నుండీ అపరిష్కృతంగా మిగిలిన అంశాల్లో ఒకటి. 1995-2004 మధ్య కాలం వరకు సంపన్న దేశాలు అనుభవిస్తూ వచ్చిన వ్యవసాయ సబ్సిడీలను సమీక్షించాలని దోహా సమావేశంలో వర్ధమాన దేశాలు పట్టుబట్టడంతో ఆ సమావేశాలు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిశాయి. నాటి నుండి వరుసగా జరిగిన సమావేశాలు కీలకమైన అంశాలపై అవగాహనకు రావటంలో విఫలం అయ్యాయి. ఈ వైఫల్యాన్ని అధిగమించటానికి వివిధ దేశాలు ఇరుగు పొరుగు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవటం, కొన్ని దేశాలు ఏకమై ప్రాంతీయ వాణిజ్య కూటములుగా ఏర్పడటం గత దశాబ్దంన్నర కాలంలో అంతర్జాతీయ వాణిజ్యంలో ముఖ్యమైన పరిణామంగా ఉంది. దాంతో ఒకప్పుడు అంతర్జాతీయ వాణిజ్యంలో సంపన్న దేశాల ప్రయోజనాలకు పెద్దపీట వేసిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) దోహా సమావేశాల నుండి సంపన్న దేశాల ప్రయోజనాలను ప్రత్యక్షంగా భుజాన వేసుకోలేని పరిస్థితి తలెత్తింది. దాంతో సంపన్న దేశాలు కూడా డబ్ల్యుటిఒపై ఆధారపడటం తగ్గించి భారత్-అమెరికా పెట్టుబడుల వేదిక వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంది.

బాలీ సమావేశం ఒక ఒప్పందాన్ని ఖరారు చేయటంతో పాటు రానున్న 12 నెలల్లో దోహా దఫా ఎజెండాను తిరిగి తెరమీదకు తేవాలని కూడా నిర్దేశిస్తోంది. ఈ పదేళ్లుగా సంపన్న దేశాలు తమ విధి విధానాలను డబ్ల్యుటిఒ ప్రమాణాలకు అనుగుణంగా సవరించటం, సబ్సిడీలు తగ్గించటం, వర్ధమాన దేశాలకు శాస్త్రసాంకేతిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించటం వంటి మౌలిక బాధ్యతలు అమలు చేయకపోవటం వల్లనే డబ్ల్యుటిఒ సమావేశాలు నిష్ప్రయోజనంగా మారాయి. కానీ బాలి ఒప్పందం మాత్రం సంపన్న దేశాలు తమ బాధ్యతలను నెరవేర్చకపోయినా వాణిజ్య చర్చలు ముందుకు తీసుకెళ్లటానికి అవకాశమిచ్చింది. దోహా అభివృద్ధి ఎజెండా గురించి బాలి ప్రకటన "వాణిజ్య చర్చల కమిటీ రానున్న 12 నెల్లల్లో మిగిలిన దోహా రౌండ్ ఎజెండాను పూర్తి చేయటానికి విస్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. చట్టబద్ధంగా అనివార్యమైన విషయాల్లో బాలి ఒప్పందం అపరిష్కృతంగా వదిలేసిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని స్పష్టం చేసింది. మరోవైపున "ఈ ఒప్పందంలో ఏకాభిప్రాయం కుదరని అంశాలకు సంబందించి సంబంధిత ఉపసంఘాల్లో చర్చలు పునఃప్రారంభించాలి" అని ఆదేశిస్తోంది. తద్వారా దశాబ్దకాలంగా స్తబ్దతకు లోనైన అంతర్జాతీయ వాణిజ్య చర్చలు మళ్లీ పుంజుకోనున్నాయి. నిస్సందేహంగా ఇది సంపన్న దేశాలు సాధించిన విజయం అని చెప్పవచ్చు. వ్యవసాయ సబ్సిడీల విషయంలో సంపన్న దేశాలు అనుసరిస్తున్న వ్యూహాలు మార్చుకోకుండా, బాగా వెనకబడిన దేశాల అభివృద్ధికి సంపన్న దేశాలు అందించాల్సిన సహాయం అందించకుం డానే తమకు కావల్సిన వాణిజ్య ఎజెండాను ప్రపంచం మీద రుద్దటంలో సఫలం అయ్యాయి.

31 పేజీలున్న ఈ ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందం, పైన చెప్పుకున్నట్లు తప్పని సరిగా అమలు చేయాల్సిన ఒప్పందం. ఈ ఒప్పందం ప్రకారం వర్ధమాన దేశాలు, వెనకబడిన దేశాలు, "దిగుమతులకు సంబంధించిన విధి విధానాలనూ, రేట్లనూ, వర్గీకరణ ప్రమాణాలనూ ముందుగానే ప్రచురించాలి. కోరినపుడు కస్టమ్స్ సంబంధిత కేసుల్లో రూలింగ్స్ ముందుగానే జారీ చేయాలి. కస్టమ్స్ రూలింగ్స్ విషయంలో పరిపాలన పరమైన, న్యాయమైన సమీక్షలు చేపట్టాలి" వంటి అనేక షరతులు ఉన్నాయి. ఈ ట్రేడ్ ఫెసిలిటేషన్ కోసం సంపన్న దేశాలు అదనపు వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమీ లేదు. ఇప్పటికే ఆయా దేశాల్లో తగిన వ్యవస్థలు, యంత్రాంగం సిద్ధమై ఉంది. కానీ వర్ధమాన దేశాలు, వెనకబడిన దేశాల ముందుకు మాత్రం



**రచయిత ఢిల్లీలో ప్రజాశక్తి మాజీ విలేకరి, ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్నారు.**

> **“ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందం పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండనున్నాయి. సారాంశంగా చెప్పాలంటే పారిశ్రామిక, పారిశ్రామికేతర ఉత్పత్తుల ఎగుమతుల్లో సంపన్న దేశాలు, వర్ధమాన దేశాలకు ఒకే ప్రమాణాలు వర్తిస్తాయి. ఆచరణలో ఇది సంపన్న దేశాల ఉత్పత్తుల ఎగుమతులకు ఎటువంటి ఆటంకం కలిగించదు.”**

తాజా ఒప్పందం అమలుకు అవసరమైన విధి విధానాలు, వ్యవస్థలు ఏర్పాటు చేయటం తక్షణ ప్రాధాన్యతగా వచ్చింది. ఉదాహరణకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశాలు, ఒప్పందాల మేరకే వివిధ ఆర్థిక రంగాల్లో రెగ్యులేటరీ వ్యవస్థలు, కాంపిటిషన్ కమిషన్ వంటి వ్యవస్థలు ఏర్పాటు చేయటం మన కళ్ల ముందున్న అనుభవం. ఇదే తరహాలో ట్రేడ్ ఫెసిలిటేషన్ కోసం అదనపు వ్యవస్థలు, సంస్థలు వర్ధమాన దేశాల్లో తెరమీదకు రానున్నాయి. ఈ వ్యవస్థలు, సంస్థల ప్రాథమిక లక్ష్యం, లక్షణం వర్ధమాన దేశాల్లోని వినియోగదారులు, సాధారణ ప్రజల ప్రయోజనాలు రక్షించటం, వస్తువులు, సేవలు చౌకగా ప్రజలకు అందుబాటులోకి తేవటం కాదు అన్నది ఈ సందర్భంగా మరోసారి స్పష్టమవుతోంది. ఈ ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందాన్ని రెండు రకాలుగా విభజించారు. మొదటి భాగంలో వర్ధమాన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు తప్పనిసరిగా అమలు చేయాల్సిన ఎజెండా ఉంటే రెండో భాగంలో ఈ ఎజండాను ఆచరణ సాధ్యం చేసే విధి విధానాలు నిర్దేశించబడ్డాయి. ఈ రెండో భాగం అమలుకు వర్ధమాన దేశాలు, వెనకబడిన దేశాలకు సంపన్న దేశాలు అవసరమైన ఆర్థిక శాస్త్ర సాంకేతిక సహాయ సహకారాలు అందించాలని నిర్దేశిస్తోంది. కానీ ఈ ఒప్పందంలోని భాషను జాగ్రత్తగా పరిశీలిస్తే సంపన్న దేశాల కుతంత్రం తేటతెల్లమవుతుంది. మొదటి భాగంలో వర్ధమాన దేశాల ముందున్న కర్తవ్యాలు అనివార్యంగా అమలు జరపాలని రాసి ఉంటే రెండో భాగంలో సంపన్న దేశాలు సహాయం చేయాలన్న విషయాన్ని అంతే నిక్కచ్చిగా తప్పనిసరిగా చేయాల్సిన పని అని చెప్పకుండా సహాయం చేస్తే బాగుంటుంది అన్న ధోరణిలో చెప్పింది. 1995 నాటి ఒప్పందంలో సైతం వర్ధమాన దేశాలకు అందించాల్సిన సహాయ సహకారాల గురించి దాటవేత వైఖరి అనుసరించటమే అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో దశాబ్దకాలం పాటు స్తబ్దత ఏర్పడటానికీ, పురోగతి లేకపోవటానికీ దారితీసిందన్న అనుభవం కళ్లముందు ఉన్నా అటు సంపన్న దేశాలు కానీ, ఇటు డబ్ల్యుటిఒ యాజమాన్య బృందంగానీ గుణపాఠాలు నేర్చుకోవటానికి సిద్ధంగా లేవని ఈ ఒప్పందంలో ఉపయోగించిన భాషను చూస్తే స్పష్టమవుతోంది.

ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందం పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండనున్నాయి. సారాంశంగా చెప్పాలంటే పారిశ్రామిక, పారిశ్రామికేతర ఉత్పత్తుల ఎగుమతుల్లో సంపన్న దేశాలు, వర్ధమాన దేశాలకు ఒకే ప్రమాణాలు వర్తిస్తాయి. ఆచరణలో ఇది సంపన్న దేశాల ఉత్పత్తుల ఎగుమతులకు ఎటువంటి ఆటంకం కలిగించదు. ప్రస్తుతానికి పరిణామాత్మక నియంత్రణలు, గుణాత్మక నియంత్రణలు కొన్ని ఉత్పత్తులపై అమలు అవుతున్నాయి. ఇకపై విదేశీ వస్తువుల దిగుమతులపై అటువంటి నియంత్రణలు విధించటం వాణిజ్య సంస్థ దృష్టిలో నేరం అవుతుంది. సమాన అవకాశాలు గాన్నాయి కదా అని సంపన్న దేశాలకు ఎగుమతులు చేయటానికి వర్ధమాన దేశాలు ఉన్న ఫళంగా సిద్ధం కాలేవు. ఒకవేళ ఆయా దేశాల ప్రత్యేక సామర్థ్యాలకు అనుగుణంగా కొన్ని ఉత్పత్తుల్లో ఎగుమతి సామర్థ్యం సాధించినా సంపన్న దేశాలు వాటిని నియంత్రించటానికి ఎన్నో పటిష్టమైన వ్యవస్థలను నెలకొల్పుకుని ఉంటాయి. ఉదాహరణకు నాలుగైదేళ్ల క్రితం మనదేశం నుండి వెళ్లే రొయ్యల ఎగుమతులను పర్యావరణ కారణాలు చెప్పి అమెరికా వెనక్కు పంపింది. మూడేళ్ల క్రితం భారతదేశం నుండి ఎగుమతి అయ్యే మిరపకాల్లో రసాయనిక ఎరువుల మోతాదు అమెరికా ఫెడరల్ డ్రగ్ అథారిటీ నిర్దేశిత ప్రమాణాలకు మించి ఉన్నాయని ఎగుమతులపై నిషేధం విధించారు. తాజాగా రాన్‌బాక్సీ కంపెనీల్లో తయారైన కొన్ని రకాల మందులను సైతం నిషేధిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న ఉదంతం మనకు కనిపిస్తోంది. కానీ భారతదేశం వంటి వర్ధమాన దేశాలు అటువంటి సాహసోపేత నిర్ణయం తీసుకుని అమెరికా నుండి వచ్చే ఎగుమతులను నిషేధించే పరిస్థితి లేదు. అమెరికా స్థాయిలో ప్రమాణాలు పరిరక్షించేలా వివిధ వ్యవస్థలు నెలకొల్పటానికి కొన్ని దశాబ్దాల సమయం పడుతుంది. అంతే కాదు, ఇటువంటి నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటు చేయటానికి అయ్యే వ్యయం కూడా తలకు మించి ఉంటుంది. అందువల్ల ఏరకంగా చూసుకున్నా బాలి ఒప్పందంలో అంతర్భాగం అయిన వాణిజ్య సరళీకరణ ఒప్పందం వర్ధమాన దేశాల ప్రయోజనాలను ఫణంగా పెట్టింది.

నిజానికి ఈ ఒప్పందంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడటానికి పునాదులు వేసిన 1994 నాటి ఒప్పందం కంటే అభ్యంతరకర అంశాలు ఉన్నాయి. డబ్ల్యుటిఒ ఒప్పందంలో కొన్ని అంశాలు నిర్దిష్ట కాలపరిమితికి వరకు మాత్రమే వర్తించేవి కాగా కొన్ని అంశాల్లో సంపన్న దేశాలు కూడా కొన్ని బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. కానీ బాలి ఒప్పందం పర్యవసానంగా ఇటువంటి ఉమ్మడి బాధ్యతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆయా దేశాల స్థానాలను బట్టి బాధ్యతలు వంటి వాటికి చెల్లు చీటి ఇచ్చారు. దాంతో ఒప్పందాన్ని అన్ని దేశాలూ సమాన బాధ్యతతో అమలు చేయాల్సి ఉంటుంది. అంతే కాదు, ఈ ఒప్పందం అమలు చేయకపోతే సంపన్న దేశాలు సదరు దేశాన్ని డబ్ల్యుటిఒ వివాద పరిష్కార వేదికలకు ఈడ్చవచ్చు. అంతేకాదు, మరింత ఆందోళనకరమైన అంశం దేశాల సార్వభౌమత్వం కూడా మార్కెట్ ఆధిపత్యానికి లోబడేలా చేయటం. బాలి ఒప్పందం ప్రకారం దేశాలు తమ తమ చట్టసభల్లో ప్రతిపాదించే ముసాయిదా బిల్లులను కూడా ‘సంబంధిత ఆసక్తి కలిగిన పార్టీలకు’ సంప్రదింపులు చర్చల నిమిత్తం బహిర్గతం చేయాలి. ఈ షరతు 1994 నాటి గాట్ ఒప్పందంలో సైతం లేదు. ఈ విధంగా దేశాల సార్వభౌమత్యంపై మార్కెట్ ఆధిపత్యాన్నీ, అదుపునూ ఖరారు చేసిన ఒప్పందాన్ని చేతులు కట్టుకుని ఆమోదించిన ఘనత యుపిఎ2 ప్రభుత్వానిది. ఈ ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి ఆనందశర్మ ఆహారభద్రత చట్టం అమలుకు అయ్యే వ్యయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ అదుపు నుండి తప్పించగలిగామని ఇది కేవలం భారత దేశానికి మాత్రమే కాక వర్ధమాన దేశాలకు కూడా భారీ విజయమని ఢంకా బజాయించారు. నిజానికి ఈ విజయానికి ఉన్న పరిమితులు గురించి అవసరమైన చర్చ జరక్కపోవటం దురదృష్టకరం.

ఒప్పందంలో మరో ముఖ్యమైన అంశం వర్ధమాన దేశాల్లో ఆహార భద్రత, వ్యవసాయ సబ్సిడీలకు సంబంధించిన అంశం. ఈ అంశం

లోకి వెళ్లే ముందు భారతదశంలో ఆహారభద్రత చట్టానికి గల రాజకీయ నేపథ్యాన్ని క్లుప్తంగా జ్ఞాపకం చేసుకుందాం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాల ముగింపులో యుపిఎ 2 ప్రభుత్వం ఆహారభద్రత చట్టం ఆమోదించింది. పార్లమెంట్ సమావేశాలకు ముందే ఆహారభద్రత బిల్లు గురించి హడావుడి చేసిన యుపిఎ ప్రభుత్వం హఠాత్తుగా ఆర్డినెన్స్ తెచ్చింది. పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ఆమోదింపచేసుకునే ఉద్దేశ్యం లేదని అప్పుడే రుజువైంది. కానీ ఆర్డినెన్స్ విషయంలో ఇంటా బయటా వచ్చిన విమర్శలు, ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ఒకడుగు ముందుకు వేసి ఆహారభద్రత చట్టం తరహాలో 90 శాతం రాష్ట్ర ప్రజలకు ఆహార ధాన్యాల పంపిణీ గ్యారంటీ చేస్తూ చట్టం ఆమోదించటంతో పార్లమెంట్‌లో ఈ బిల్లును ఆమోదించుకోవాల్సిన రాజకీయ అనివార్య పరిస్థితులకు యుపిఎ నెట్టబడింది. మరోవైపున నవంబరులో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఈ చట్టం ద్వారా లబ్ది పొందవచ్చున్న ఆలోచన కూడా ఆగస్టులో చట్టం ఆమోదించటం వెనక ఉన్నదన్నది నిస్సందేహం. ఆహారభద్రత ముసాయిదా బిల్లు దశ నుండే ఈ చట్టం ద్వారా ఖజానాపై పడనున్న ఆర్థిక భారం గురించీ, ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యయ నియంత్రణల గురించీ నయా–ఉదారవాద ఆర్థిక విధానాలను గుడ్డిగా నమ్మిన మేధావులు చర్చ చేస్తూనే ఉన్నారు. అటువంటి వారిలో ప్రధానమంత్రి ఆర్థికసలహాదారు సి రంగరాజన్ మొదలు ఆర్థిక మంత్రి చిదంబరం, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మాంటెక్ సింగ్ అహ్లువాలియా వంటి వారితో పాటు ఆర్థిక శాఖ సలహాదారుగా పని చేసిన కౌషిక్ బసు లాంటి వారు కూడా ఉండటం గమనార్హం. అయినప్పటికీ ఆహారభద్రత చట్టం ఆమోదించాల్సిన రాజకీయ అగత్యంతో పాటు సామాజిక అవసరం కూడా ముందుకు రావటంతో ప్రభుత్వం చట్టాన్ని ఆమోదించింది. అదేసమయంలో ఆశ చావని నయా–ఉదారవాద మేధావులు ఈ చట్టాన్ని అమలు చేయాలంటే లక్షా ముప్పై వేల కోట్ల వరకు నిధులు కావాలనీ, ఇంత మొత్తం వెచ్చించాలంటే ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులు అంగీకరించాల్సి ఉంటుందనీ చర్చ ముందుకు తెచ్చారు.

1994లో గాట్ స్థానంలో డబ్ల్యుటీఓ రంగంమీదకు వచ్చినప్పుడు అనేక అనుబంధ ఒప్పందాలు కూడా జరిగాయి. అందులో ముఖ్యమైనది వ్యవసాయ సంబంధ విషయాలపై ఒప్పందం. (అగ్రిమెంట్ ఆన్ అగ్రికల్చర్). ఈ ఒప్పందంలో భాగంగా ఏయే దేశం ఎంత

**❝వాణిజ్య సరళీకరణ ఒప్పందంతో పాటు మరో ముఖ్యమైన ఒప్పందం శాంతి ఒప్పందం. వ్యవసాయక సబ్సిడీలకు సంబంధించి సంపన్న దేశాలు వర్ధమాన దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు తెర వెనక జరిగిన ప్రయత్నమే ఈ శాంతి ఒప్పందం.❞**




బాలి సమావేశంలో మాట్లాడుతున్న భారత వాణిజ్య మంత్రి ఆనంద శర్మ

మేర ఆహార సబ్సిడీలు, వ్యవసాయ సబ్సిడీలు ఇచ్చేందుకు అవకాశం ఉందో ఆయా దేశాలు ముందుగానే ముసాయిదాలను గాట్ బృందానికి అందచేశాయి. ఈ ముసాయిదాల ఆధారంగా 1988 నాటి ధరల ఆధారంగా వివిధ దేశాల్లో వ్యవసాయ సబ్సిడీలు లెక్కించబడ్డాయి. గత పాతికేళ్లలో వ్యవసాయోత్పదకాల ధరలు కొన్ని వందల రెట్లు పెరిగాయి. తదనుగుణంగా వర్ధమాన దేశాల సబ్సిడీ పద్దు కూడా పెరిగింది. 1994లో జరిగిన ఒప్పందం 10 ఏళ్ల పాటు అమలు జరిగిన తర్వాత 2004లో సమీక్షించాలన్న నిర్ణయం కూడా అప్పట్లో జరిగింది. ఈ సమీక్షకు రంగం సిద్ధం చేస్తూ 1997లో సింగపూర్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాల్లో సంపన్న దేశాలు నాలుగు అంశాలను ముందుకు తెచ్చాయి. పెట్టుబడులు, పారదర్శకత, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో పారదర్శకత, పోటీ అన్నవి ఈ నాలుగు అంశాలు. తదుపరి జరిగిన అన్ని ద్వైవార్షిక సమావేశాల ఎజెండాలూ ఈ నాలుగు అంశాల చుట్టూ తిరిగేలా చేయటంలో సంపన్న దేశాలు విజయవంతం అయ్యాయి. దాంతో 1994 ఒప్పందం మేరకు సంపన్న దేశాలు వర్ధమాన దేశాలకు అందించాల్సిన ఆర్థిక సహాయం, శాస్త్ర సాంకేతిక వనరులు గురించిన చర్చ, రాయితీలు తగ్గించటంలో సంపన్న దేశాలకున్న బాధ్యతలపై చర్చ వెనకపట్టు పట్టాయి.

ఉరేగ్వే దఫా చర్చల నాటికి తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో అంతర్జాతీయ వాణిజ్యం ప్రాధాన్యత గురించి అంతగా అవగాహన లేని వర్ధమాన దేశాలు వివిధ రాజకీయ ఆర్థిక కారణాల వల్ల సంపన్న దేశాల వాదనలకు లోబడి అంగీకరించిన అనేక విషయాలు ఆయా దేశాలకు నష్టదాయకంగా పరిణమించాయన్న విషయం అనుభవంలో రుజువు అయ్యింది. ఈ పరిస్థితుల్లో 1994 నాటి ప్రపంచ వాణిజ్య సంస్థ ఎజెండానే మరింత ముందుకు తీసుకెళ్లటానికి సంపన్న దేశాలు 2002లో జరిగిన దోహా సమావేశాలు, 2004 జరిగిన కాంకున్ సమావేశాల్లో తెచ్చిన ఒత్తిళ్లను అధిగమించే క్రమంలో వర్ధమాన దేశాలు వివిధ వాణిజ్య కూటములుగా ఏర్పడ్డాయి. ఈ కూటముల మధ్య జరిగిన రాయబారాలు, లావాదేవీలు ఒప్పందాల కారణంగా సింగపూర్ ఎజెండాను వెనక్కు కొట్టడంలో వర్ధమాన దేశాలు పాక్షికంగా విజయం సాధించాయి. నాటి నుండీ తమ ఎజెండాను ప్రపంచం

**❝ చివరిగా ఒప్పందం పరిధి బయట ఉన్న రెండు అంశాలను పరిశీలిస్తే ఇవి గత దశాబ్దకాలంగా మరుగున పడిన సంపన్న దేశాల ప్రయోజనాలకు సంబంధించిన ఎజెండాను ఒక్కపెట్టున ముందుకు తెచ్చాయి. అంతర్జాతీయ వాణిజ్య చర్చలను దీర్ఘ కాలంగా పరిశీలిస్తున్న రవికాంత్ లాంటి విశ్లేషకులు అభిప్రాయ పడినట్లు బాలి సమావేశాలకు ముందు, సమావేశాల సమయం లోనూ చోటు చేసుకున్న పద్ధతులు ఏ ఒక్క హేతుబద్ధ ప్రమాణాలకు లోబడి లేవని చెప్పాలి.❞**

మీద రుద్దటానికి సంపన్న దేశాలు ప్రారంభించిన తెరవెనక ప్రయత్నాలు బాలి ద్వైవార్షిక సమావేశాల్లో అంగీకరించిన వాణిజ్య సరళీకరణ ఒప్పందం (ట్రేడ్ ఫెసిలిటేషన్) ద్వారా ఒక కొలిక్కి వచ్చాయి.

వాణిజ్య సరళీకరణ ఒప్పందంతో పాటు మరో ముఖ్యమైన ఒప్పందం శాంతి ఒప్పందం. వ్యవసాయక సబ్సిడీలకు సంబంధించి సంపన్న దేశాలు వర్ధమాన దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు తెర వెనక జరిగిన ప్రయత్నమే ఈ శాంతి ఒప్పందం. పైన చెప్పుకున్నట్లు ఉరేగ్వే దఫా చర్చల్లో అన్ని దేశాలు తమ తమ దేశాల్లో అమలు చేస్తున్న రాయితీలు, సబ్సిడీలు తగ్గించేందుకు అంగీకరించాయి. వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలు సంపన్న దేశాల్లో 1980 దశకం నాటికి పతాక స్థాయికి చేరాయి. దాంతో అన్ని సంపన్న దేశాలూ 1980 నాటి గణాంకాల ప్రకారం సబ్సిడీలు లెక్కించి తదనంతర కాలంలో వీటిని తగ్గించాలని షరతు పెట్టాయి. తదగునుణంగా అప్పటికి భారతదేశం అనుసరిస్తున్న కనీస మద్దతు ధర, ప్రజాపంపిణీ వ్యవస్థలు ప్రపంచ వాణిజ్య సంస్థ అజమాయిషీ కిందకు వచ్చాయి. అప్పటికి ఈ సబ్సిడీలు డబ్ల్యుటిఒ నిర్దేశించిన 10 శాతం కన్నా తక్కువగా ఉండం వల్ల ప్రభుత్వం సబ్సిడీలను తగ్గించుకోవాల్సిన అవసరం లేకపోయింది. ఆహార సబ్సిడీ, కనీస మద్దతు ధరలను మనం పరిశీలిస్తే.... భారత దేశంలో 1990 దశకం నాటికి 30 శాతంగా ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ లబ్దిదారులు 2010 నాటికి 44 శాతానికి పెరిగారు. సగటున ఒక్కో లబ్దిదారుడిని నెలకు 7 – 8 కిలోల సబ్సిడీ ధాన్యం అందుతూ వచ్చింది. ఈ సబ్సిడీల మొత్తం లెక్కించినా జాతీయ స్థూల ఉత్పత్తిలో 1శాతం నుండి 1.5 శాతం లోపు ఉంటుందని అంచనా వేస్తున్నారు. 1994 నాటి డబ్లుటివో ఒప్పందం ప్రకారం ఈ సబ్సిడీ మొత్తం 2 శాతానికి మించి ఌండ రాదు. కానీ ఈ గణాంకాలను జనాభా లెక్కలతో పోల్చి చూసినపుడు మాత్రమే ఈ వాదన వెనక దాగి ఉన్న వాస్తవిక ఆంతర్యం వెలుగులోకి వస్తుంది. ఆహారభద్రత చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసినా వామపక్షాలు కోరినట్లు సార్వత్రిక ఆహారభద్రత కోసం ప్రయత్నించినా వాస్తవిక వ్యయం ఇప్పుడున్న దానికంటే అనివార్యంగా పెరుగుతుంది. అయినా నేడు ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతిలో ఆహారసబ్సిడీ కానీ, రైతులకు అందిస్తున్న కనీస మద్దతు ధర కానీ వాణిజ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలు దాటి ముందుకు పోదు అన్న విశ్లేషణలు వస్తున్నాయి. దీనికి ఏకైక కారణం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లబ్దిదారుల సంఖ్య కూడా పెరిగాలి. గతంలో లాగా తలసరి 7–8 కిలోల ధాన్యం స్థానంలో 5 కిలోల ధాన్యాన్ని మాత్రమే అందించటం, గతంలో సగటున రెండు రూపాయల చొప్పున ఇస్తున్న సబ్సిడీ బియ్యం ధరను ఆహారభద్రత చట్టం కింద కిలో మూడు రూపాయల ధరల నిర్ణయించటం ద్వారా ప్రభుత్వం ఆహారభద్రత చట్టం అమలు తర్వాత కూడా సబ్సిడీ వ్యయం ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన పరిమితులు దాటకుండా జాగ్రత్త పడింది.

చివరిగా ఒప్పందం పరిధి బయట ఉన్న రెండు అంశాలను పరిశీలిస్తే ఇవి గత దశాబ్ద కాలంగా మరుగున పడిన సంపన్న దేశాల ప్రయోజనాలకు సంబంధించిన ఎజెండాను ఒక్కపెట్టున ముందుకు తెచ్చాయి. అంతర్జాతీయ వాణిజ్య చర్చలను దీర్ఘకాలంగా పరిశీలిస్తున్న రవికాంత్ లాంటి విశ్లేషకులు అభిప్రాయపడినట్లు బాలి సమావేశాలకు ముందు, సమావేశాల సమయంలోనూ చోటు చేసుకున్న పద్ధతులు ఏ ఒక్క హేతుబద్ధ ప్రమాణాలకు లోబడి లేవని చెప్పాలి. ఈ అహేతుకమైన పద్ధతుల ద్వారా సంపన్న దేశాలు గత దశాబ్దకాలానికి పైగా కాపాడుకుంటూ వచ్చిన వర్ధమాన దేశాల ఐక్యతను బద్దలు కొట్టగలిగాయి. దాంతో ప్రభుత్వ నిల్వలు, ఆహారభద్రత, ట్రేడ్ ఫెసిలిటేషన్ వంటి అంశాల్లో వర్ధమాన దేశాలు, వెనకబడ్డ దేశాలు ఉమ్మడి వైఖరిని అనుసరించలేకపోయాయి. బాలిలో కీలక అంశాలపై ఏకాభిప్రాయం సాధించటంలో విఫలం అయితే ఇక డబ్ల్యుటిఒ యంత్రాంగాన్ని అటకెక్కించటం తప్ప మరో మార్గం లేదన్న ఈ సంస్థ సెక్రటరి జనరల్ అవీడో ప్రకటన కూడా తనవంతు పాత్ర పోషించింది. అందువల్లనే అంత సమగ్రం కాక పోయినా సాధ్యమైనంత మేర సంపన్న దేశాల ఎజెండాను ముందుకు తీసుకెళ్లటానికి వీలైన రీతిలో అటు సంపన్న దేశాలు ఇటు డబ్ల్యుటిఒ తమ శక్తిసామర్ధ్యాలను వినియోగించాయి. పర్యవసానమే బాలి సమావేశాలకు ముందే కీలకమైన వివాదాస్పద విషయాలకు సంబంధించి రహస్య చర్చలు జరపటం.

ఉదాహరణకు వెనకబడ్డ దేశాలకు సంబంధించిన ఎజెండాను చర్చించి ఖరారు చేసిన సమావేశంలో వెనకబడిన దేశాల కూటమి ప్రతినిధి నేపాల్, డబ్ల్యుటిఒ సెక్రటరీ జనరల్, అమెరికా మాత్రమే పాల్గొన్నాయి. ఈ ముగ్గురు కుదుర్చుకున్న అంగీకారం ఫలితంగా ట్రేడ్ ఫెసిలిటేషన్ ఒప్పందం సాధ్యం అయ్యింది. దీనికితోడు భారతదేశ ప్రతినిధి బృందంగానీ, ప్రభుత్వం గానీ తగిన హెూంవర్క్ చేయకుండా వెళ్లటంతో చరమాంకంలో కాస్త హడావుడి చేసినా చివరకు అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. గత సంవత్సరం జూలై, ఆగస్టుల్లో వాషింగ్టన్‌లో మొదలైన అనధికార చర్చల్లోనే బాలి ఎజెండాలో ఆహారభద్రత, ప్రభుత్వ నిల్వలు, ట్రేడ్ ఫెసిలిటేషన్ కీలకం కానున్నాయని తెలిసినా ఇటు కేంద్ర వాణిజ్య శాఖ గానీ, కేంద్ర ప్రభుత్వంగానీ తదనుగుణంగా శక్తివంతమైన సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేసుకోవటంలోగానీ, తన డిమాండ్లకు అనుగుణంగా వర్ధమాన దేశాలను సమీకరించటంలోగానీ తగిన శ్రద్ధ వహించలేదు. గత దశాబ్దకాలంలో మన దేశం వ్యవసాయక ఒప్పందంలో మార్పులు కావాలని పట్టుబట్టి ప్రపంచ దేశాల అభిప్రాయాన్ని కూడగట్టడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. అటువంటి పరిస్థితుల్లో బాలి సమావేశాల్లో భారతదేశాన్ని, భారతదేశం ప్రతిపాదించిన ఎజెండాను ఒంటరిపాటు చేయటంలో అమెరికా నేతృత్వంలోని సంపన్న దేశాలు విజయం సాధించాయి. ఈ కుతంత్రాలను అధిగమించి అంతర్జాతీయ వాణిజ్యంలో అటు వర్ధమాన దేశాల ప్రయోజనాలనూ, ఇటు దేశ ప్రజల ప్రయోజనాలనూ కాపాడటంలో యుపిఎ 2 ప్రభుత్వం విఫలం కావటమే కాదు, తన నిష్క్రియాపరత్వంతో వర్ధమాన దేశాల స్వార భౌమత్వాన్ని, ఆహారభద్రతను అంతర్జాతీయ మార్కెట్‌లో తాకట్టుపెట్టింది. ⦿

# ప్రజాఉద్యమ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే బూర్జువాపార్టీలతో సర్దుబాట్లు చేసుకోవాలి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**కామ్రేడ్ రాఘవులుగారికి, రాష్ట్రంలోనూ, ఢిల్లీలోనూ ఇటీవల జరుగుతున్న పరిణామాలను పాలకవర్గాల్లోని బడా పెట్టుబడిదారులకూ, ప్రాంతీయ పెట్టుబడిదారులకూ మధ్య జరుగుతున్న తగాదాగా చూడవచ్చా? దేశానికి స్వాతంత్ర్యం ప్రజలతోబాటు, దేశీయ పెట్టుబడిదారులకు కూడా వచ్చింది. తరువాతి కాలంలో రాష్ట్రాల్లో పెట్టుబడిదారులు పెరిగారు. వీరు ప్రాంతీయ పార్టీలు పెట్టుకుని దేశీయ పెట్టుబడిదారులతో బేరసారాలు సాగిస్తూ ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ 1991లో ప్రపంచీకరణ పేరుతో విదేశీ బహుళజాతి సంస్థలకు దేశ ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచింది. దాంతో వారూ, దేశీయ పెట్టుబడిదారులూ కలిసి లాభాల కోసం ప్రజలను పిండుతున్నారు. ఇది రాష్ట్రాల్లోని స్థానిక పెట్టుబడిదారులను కూడా కృంగదీస్తోంది. వారికి లాభాలు తగ్గి తమ వర్గ స్థానమే మారిపోయే స్థితి ఏర్పడింది. అందువల్ల బడా పెట్టుబడిదారులకు అండగా నిలుస్తున్న పాలకులపై తిరుగుబాటు చేయడమన్నదే ఆంధ్ర ప్రదేశ్ శాసన సభలోనూ, పార్లమెంటులోనూ జరిగిన పరిణామాల వెనుక కారణమని అనుకో వచ్చా? అలాగే ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం పడిపోవడం కూడా ఈ తగాదాల్లో భాగంగా చూడవచ్చా?**

**ఇలిపిల్ల సూర్యనారాయణ,**
4-33-37, భీమనవారి పేట,
విజయవాడ-9

**కామ్రేడ్ రాఘవులుగారికి, ప్రతి ఎన్నికల్లోనూ సిపిఎం, సిపిఐలు ఏదో ఒక బూర్జువా పార్టీ తోకపట్టుకుని వెళ్లడం కంటే స్వతంత్రంగా పోటీ చేయవచ్చు కదా? స్వతంత్రంగా పోటీ చేయడం వల్ల కొన్నాళ్లకైనా పార్టీ తన బలం మీద పెరిగే అవకాశం వుంటుంది కదా? బూర్జువా పార్టీలతో పొత్తు వల్ల పార్టీకి ఇప్పటి వరకు వచ్చిన లాభం ఏమిటి?**

**ఆర్. రాకేష్,**
గ్రీన్‌పార్క్ కాలనీ, రోడ్ నెంబర్ 14,
సరూర్ నగర్, హైదరాబాద్.

సిపిఐ (ఎం), సిపిఐలు బూర్జువా పార్టీలతో పొత్తు పెట్టుకోవడం మంచిదా? ఒంటరిగా పోటీచేయడం మంచిదా అన్న ప్రశ్నలు ఎడతెగకుండా చర్చకు వస్తున్నాయి.

వామపక్ష పార్టీల్లోనూ, బయట వామపక్ష శ్రేయోభిలాషుల్లోనూ ఇటువంటి అభిప్రాయాలు, ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయి. పార్లమెంటరీ రాజకీయాల్లో కమ్యూనిస్టులు పాల్గొంటున్నప్పుడు, ఎన్నికల్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పుడు ఏ మార్గం ప్రయోజనకరం అన్న మీమాంస తలెత్తడం సహజం.

మన దేశంలో బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలో భాగంగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో సామాన్య ప్రజలు విరివిగా పాల్గొంటున్నారు. పాల్గొనడమే కాదు దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో ప్రజలు బూర్జువా, భూస్వామ్య పార్టీల వెనుక సమీకరించబడుతున్నారు. బూర్జువా, భూస్వామ్య పార్టీలలోనూ వాటివాటి వర్గ ప్రాతినిధ్యాన్ని బట్టి, రాజకీయ లక్ష్యాల్లో వ్యత్యాసాలున్నాయి. కాంగీ, బిజెపిలు దేశంలో గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రధాన ప్రతినిధులుగా ఉన్నాయి. అయితే ఈ రెండూ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి ప్రతినిధులైనా, వాటి మధ్య మతోన్మాదం విషయంలో రాజకీయ వ్యత్యాసం ఉంది. బిజెపి కరుడుగట్టిన అభివృద్ధి నిరోధక మతోన్మాదానికి ప్రతినిధిగా ఉంది. మిగిలిన బూర్జువా, భూస్వామ్య పార్టీలు (ఉదాహరణకు టిడిపి, వైఎస్‌ఆర్‌పి, టిఆర్‌ఎస్, డిఎంకె, ఎఐఎడిఎంకె, వగైరా) ప్రాంతీయ బూర్జువా వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు, స్థానిక ప్రాంతీయ పెట్టుబడిదారీ శక్తులకు మధ్య వైరుధ్యాలు ఈ పార్టీల మధ్య వైరుధ్యాలుగా రాజకీయాలలో వ్యక్తం అవు తున్నాయి.

ప్రస్తుత ప్రజా ఉద్యమ స్థాయి, ప్రజల చైతన్యస్థాయిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు పాలక పార్టీల మధ్య ఉన్న ఈ వైరుధ్యాలను ఉపయోగ పెట్టుకోవడం ఉపయోగం అని సిపిఐ(ఎం) భావిస్తున్నందునే వాటితో ఎన్నికల సర్దుబాట్లు చేసుకుంటున్నది. బూర్జువా పార్టీలతో సర్దుబాటు చేసుకుంటున్నదంటే వాటి వర్గస్వభావాన్ని గమనించక కాదు. ఆ పార్టీలు నీతివంతమైన పాలన ఇస్తాయనీ కాదు. అవి అవినీతికి పాల్పడవనీ కాదు. వున్నంతలో ప్రజా ఉద్యమానికి ప్రమాదకరమైన గుత్త పెట్టుబడిదారీ శక్తులను నిలువరించడానికీ, ఉన్నంతలో ప్రజా ఉద్యమానికి లాభం జేసేందుకూ మాత్రమే వాటితో సర్దుబాటు చేసుకుంటున్నాయి. ప్రతి సందర్భంలోనూ సర్దుబాటు చేసుకోవాలని కూడా లేదు. ప్రజాస్వామ్య, లౌకిక, ఫెడరల్ విలువలకూ, ప్రజా సంక్షేమానికీ లాభం జరగనప్పుడు అవసరమైతే స్వతంత్రంగా వ్యవహరించడానికి వామపక్షాలు వెనుకాడవు.

ప్రాంతీయ బూర్జువా పార్టీలతో సర్దుబాట్లు చేసుకున్నప్పుడు వామపక్షాలు తమ స్వతంత్రతను నిలబట్టుకోవడంలో విఫలమైతే నష్టం జరుగుతుంది. అజాగ్రత్తగా ఉన్న చోట్ల కొంత నష్టం జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ప్రజా ఉద్యమాలను నిర్మిస్తూ, బూర్జువా పార్టీల వెనుకనున్న సామాన్య ప్రజలతో మమేకమై కృషిజేస్తూ కమ్యూనిస్టు పార్టీ వర్గ స్వతంత్రతను నిలబెట్టుకున్న చోట ప్రజా ఉద్యమానికి లాభం జరిగింది. బూర్జువా పార్టీలతో ఎన్నికల సర్దుబాట్లు మంచివా, చెడ్డవా అన్న చర్చకన్నా ఆ సర్దుబాట్లను ప్రజా ఉద్యమానికి తోడ్పడేట్లు వినియోగించు కుంటున్నామా లేదా అన్నది పరిశీలించు కోవా ల్సిన అంశం. కేవలం సీట్ల కోసం కాకుండా సరైన రాజకీయలక్ష్య సాధన కోసం సర్దుబాట్లు చేసుకోవడం ముఖ్యం. ⊙

## మార్క్సిస్టు పాఠకులకు మనవి

2014 మార్చి నెల నుండి 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక ధర కింది విధంగా సవరించబడింది. పాఠకులు గమనించగలరు.

| | |
|---|---|
| **విడి ప్రతి** | **రూ. 10/-** |
| **సంవత్సర చందా** | **రూ. 100/-** |
| **పోస్టల్ చందా** | **రూ. 120/-** |

పత్రికకు విరివిగా చందాలు చేర్పించి సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

**మేనేజర్,**
**మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక,**
**ఎంహెచ్ భవన్, (ప్రజాశక్తి భవనం)**
**అజామాబాద్, హైదరాబాద్ -20**

# అభిప్రాయాలు

## ప్రత్యామ్నాయ కూటమి అవసరం

'మార్క్సిస్టు' ఫిబ్రవరి సంచికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు కా॥ సీతారామ్ ఏచూరిగారు రాసిన వ్యాసం "ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం" చాలా బాగుంది. నేడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, భారత ఉపఖండంలో పెరుగుతున్న మితవాదం, దోహా చర్చలు, వాతావరణ సంక్షోభం, రాజకీయ ప్రత్యామ్నాయ అవసరాలపై కా॥ ఏచూరిగారు పాఠకులకు అర్థం అయ్యేవిధంగా రాశారు. 2008లో అమెరికాలో ఏర్పడిన ద్రవ్య సంక్షోభం నేడు ప్రపంచమంతా చట్టుముట్టింది. ప్రపంచ బ్యాంకు అప్పులకు తట్టుకోలేక, దాని షరతులకు లోబడి అనేక దేశాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయి. పనిగంటలు పెంచడం, కనీస వేతనాలు అమలు చెయ్యకపోవడం, వినిమయ సంస్కృతి పెరగడం, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వలన సామాన్య ప్రజలే కాక, మధ్య తరగతి ప్రజలు కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగం విపరీతంగా పెరుగుతున్నది. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాటాలు చెయ్యాల్సి వస్తున్నది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం మన దేశంపైన కూడా పడి జిడిపి 9 శాతం నుంచి 5 శాతానికి పడిపోయింది. వ్యవసాయ, చేనేత కార్మిక రంగాలు అధోగతివైపు పయనిస్తున్నాయి. ప్రయివేటీకరణలో భాగంగా విద్య, వైద్యం పెద్ద వ్యాపారంగా మారి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ కూటమి అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల కుంభకోణాల ఊబిలో మునిగిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం దేశ ప్రజలకు ఏమీ చెయ్యలేని పరిస్థితి ఉంది.

మరో ప్రమాదం బిజెపి మతతత్వ శక్తులద్వారా రాబోతున్నది. మతోన్మాద ప్రాబల్యం ఈ మధ్య బాగా పెరిగి ప్రజలమధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది. తద్వారా విప్లవోద్యమాలకు ఆటంకంగా ఉన్నది. ఈ మధ్య నరేంద్ర మోడీకి పత్రికలు, టివీలు మంచి ప్రచారం ఇస్తున్నాయి. ఆయన ప్రసంగాలు కార్పొరేట్ సంస్థలకూ, ప్రయివేటు పెట్టుబడిదారులకూ, భూస్వాములకూ ఉపయోగపడేవిధంగా ఉన్నాయి కానీ కార్మిక, కర్షక సమస్యలపైనా, వాటి పరిష్కారాలపైనా మాట్లాడింది చాలా తక్కువ.

రానున్నది ఎన్నికల సమయం. హడావిడిలో అన్ని పార్టీలూ లెక్కలు వేసుకుంటున్నాయి. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఏ పార్టీకి మద్దతివ్వాలి అన్న ఆలోచనలో ఉన్నారే తప్ప ప్రపంచ బ్యాంకుకు పెరిగిపోతున్న అప్పులగురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

కాంగ్రెస్, బిజెపీ దొందూ దొందే. ముసుగులు వేరేకానీ విధానాలు ఒక్కటే. ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటారుగానీ ప్రజావ్యతిరేక విధానాలు అమలు చెయ్యడంలో ఒకరికొకరు సహకరించుకుంటారు. అందుకే ఎన్డీఎ, యుపిఎ కూటములకు వ్యతిరేకంగా, వామపక్షాల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ కూటమి ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి కూటమిని గెలిపించాల్సిన అవసరం ప్రజలకు ఉంది. మంచి వ్యాసం రాసిన కామ్రేడ్ ఏచూరిగారికి ధన్యవాదాలు.

**హరి,**
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు
పెనుగొండ మండలం,
అనంతపురం జిల్లా.

## పటేల్‌పై నూరాని వ్యాసం విజ్ఞానదాయకంగా ఉంది

'కాంగ్రెస్ వాళ్లలో చాలా మంది జాతీయ వాదం ముసుగు వేసుకున్న మతతత్వ వాదులున్నారు. మెజారిటీ మతానికి చెందిన మతతత్వాన్ని జాతీయ వాదంగా భావించే ప్రమాదం నిరంతరం పొంచి ఉంటుంది' అన్న జవహర్‌లాల్ నెహ్రూ మాటలు అక్షర సత్యాలు. ఇది నేటికీ కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వర్తిస్తుంది. సర్దార్ పటేల్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కానీ కరడు గట్టిన హిందూ మతతత్వ వాది. అందుకే బిజెపి ఆయనను ఆకాశానికి ఎత్తి ప్రచారం చేస్తున్నది. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ఇటుకల సేకరణ పేరుతో దేశవ్యాపితంగా గ్రామాలు పర్యటించి మతతత్వాన్ని రెచ్చగొట్టినట్లు నేడు గుజరాత్‌లో నర్మదా నదికి దగ్గరలో 185 అడుగుల ఎత్తు పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి 6 లక్షల గ్రామాలలో పర్యటించి ఇనుము సేకరిస్తారట. దీని కొరకు 30 వేల ట్రక్కులు పని చేస్తాయి అంటున్నారు. ప్రపంచంలో ఇది అతి పెద్ద భారీ విగ్రహం అనీ, దీని నిర్మాణానికి 2,500 కోట్ల ఖర్చు అని తెలియజేస్తున్నారు. ఇదంతా మత ప్రాతిపదిక కార్యక్రమం. మార్క్సిస్టు 'ఈ మాసం ప్రత్యేకం' లో రచయిత సుప్రీం కోర్టు న్యాయవాది ఎజి నూరాని చాలా విషయాలు తెలియజేశారు. ఇతర వ్యాసాలు విజ్ఞాన దాయకంగా ఉన్నాయి.

**తుంపాల శ్రీరామమూర్తి,**
9-9-57/2,
జోగవానిపాలెం,
కొత్తగాజువాక,
విశాఖపట్నం - 26

# దభోల్కర్

(2వ పేజీతరువాయి)

మహారాష్ట్ర అంతటా దాదాపు 170 శాఖలుగా అన్ని జిల్లాలలో ఏర్పడి పని చేయటం ఆరంభించింది. ఆయన దాదాపు పదకొండు పుస్తకాలు రచించారు. అన్నీ కూడా సమాజంలో పాతుకు పోయిన మూఢ విశ్వాసాలు, తంత్రాలు, మంత్రాలు, తాయత్తులు, జంతు, నరబలులుకు వ్యతిరేకంగా శంఖాన్ని పూరించినవే. అడ్డగోలు పనులు చేసే ఎటువంటి వారినైనా ఆయన వదిలేవారు కాదు. 2013 మార్చి నెలలో, మహారాష్ట్ర అంతటా త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న నేపధ్యంలో ఆశారామ్ బాపు ఆయన అనుచరులు హెూలీ పండుగ జరుపుకోవటానికి నాగపూర్ మున్సిపల్ కార్పోరేషన్ వారు పంపిన మంచినీటి ట్యాంకర్లను వాడుకోవటం చూసి, పెద్ద ఎత్తున వారిపై ఆందోళన నిర్వహించారు. (అప్పటికి ఇంకా ఆశారాంబాపు నిజస్వరూపం సమాజానికి తెలియలేదు.)

### అంధ విశ్వాసాలు, చేతబడి నియంత్రణా చట్టం

2010 సంవత్సరంలో మహారాష్ట్ర శాసన సభలో అంధ విశ్వాసాలు, చేతబడుల నియంత్రణా చట్టం తేవటానికి దభోల్కర్ అనేక ప్రయత్నాలు చేసి విఫలమయ్యాడు. ఆయన పర్యవేక్షణలో మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన సమితి జాదూటోనా వ్యతిరేక బిల్లు (అంధ విశ్వాస, చేతబడి నియంత్రణ ఆర్డినెన్స్) రూపొందించింది. ఈ చట్టాన్ని కొన్ని రాజకీయ పార్టీలు, తెగలు వ్యతిరేకించాయి. భారతీయ జనతా పార్టీ, శివసేన వంటి పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ చట్టం అమలు జరిగితే హిందువుల ఆచారాలు, సాంప్రదాయాలు, కట్టబాట్లు తీవ్రంగా దెబ్బతింటాయని వారు వాదించారు. కొంతమంది విమర్శకులు ఆయనను మత వ్యతిరేకిగా ముద్రవేశారు. ఆయన వాటికి బెదరలేదు. 'ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్సీ' వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా తెలిపారు: ఈ మొత్తం చట్టంలో, దేవునికి లేదా మతానికి వ్యతిరేకంగా ఎక్కడా ఒక్క పదం కూడా లేదనీ, భారత రాజ్యాంగం ప్రజలందరికీ దేవుని పూజించుకునే హక్కునూ, స్వేచ్ఛనూ ఇచ్చిందని, దానికి ఎవరు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. కాని అదే సందర్భంలో వీటిని అడ్డం పెట్టుకొని మోసపూరితమైన కార్యక్రమాలు, ప్రజలను దోపిడీ చేసే విధానాలు ఏవైతే జరుగుతున్నాయో వాటిని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టంగా తెలియచేశారు.

దభోల్కర్ మరణించే కొన్ని వారాల ముందు ఆగస్టు 6వ తేదీన జరిగిన పత్రికా సమావేశంలో, ప్రభుత్వం ఏడుసార్లు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టినప్పటికీ ఒక్కసారి కూడా బిల్లుపై చర్చ జరపలేదనీ, రాజకీయ పార్టీల మోసపూరిత విధానాలకు ఇదొక నిదర్శనమనీ విమర్శించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృధ్విరాజ్ చౌహాన్ రాష్ట్రంలోని అభ్యుదయ కాముకులను, సంఘ సంస్కర్తలను, సంస్కరణవాదులను నిరాశపరిచారని ఘాటుగా విమర్శించారు. నరేంద్ర దభోల్కర్ మరణించిన ఒక రోజు తరువాత మహారాష్ట్ర శాసనసభ, మంత్రిమండలి మహారాష్ట్ర అంధ విశ్వాస, చేతబడుల నియంత్రణా ఆర్డినెన్స్‌ను ఆమోదించింది. కాని పార్లమెంట్ ఆమోదముద్ర లేనిదే ఆర్డినెన్స్ చట్ట రూపంలో రాదు. అప్పటి వరకు వేచి ఉండాల్సినదే.

1983 నుండి నరేంద్ర దభోల్కర్ అనేక సార్లు ప్రత్యర్ధుల నుండి (మతోన్మాదుల నుండి) హెచ్చరికలు, భౌతికదాడులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయినా ఆయన పోలీసుల రక్షణ కోరలేదు, తీసుకోలేదు. పోలీసు రక్షణ తీసుకోక పోవడంపై దభోల్కర్ ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ "నా దేశంలో నా ప్రజల మధ్యలో వారి నుండి రక్షణ కోసం నేను పోలీసులను ఆశ్రయించటమంటే నేనేదైనా తప్పు చేసి ఉండాలి. కాని, నేను భారత రాజ్యాంగ వ్యవస్థ పరిధిలోనే పని చేస్తున్నాను. ఇది ఎవరికో వ్యతిరేకంగా చేసే పోరాటం కాదు, ఇది అందరి మంచి కోసం చేసే పోరాటం" అని నిర్భయంగా చెప్పాడు.

ఆగస్టు 20వ తేదీ 2013న నరేంద్ర దభోల్కర్ పూనా నగరంలో ఓంకారేశ్వర స్వామి గుడి పరిసరాల్లో నడుస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని అగంతకులు 7 గంటల 20 నిమిషాలకు పాయింట్ బ్లాంక్ రేంజిలో ఆయనపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి, పక్కనే నిలబెట్టిన్న మోటారు సైకిల్‌పై పారిపోయారు. దభోల్కర్ తల, ఛాతిలో రెండు బుల్లెట్లు నేరుగా దూసుకెళ్ళటం వలన, ఆయన దగ్గరలో ససూన్ వైద్యశాలలో చికిత్స జరుగుతుండగానే కన్ను మూసారు. అంధ విశ్వాసాలకు, తాంత్రిక శక్తులకు వ్యతిరేకంగా నిలబడి పోరాటం చేసిన ఆ వైద్యయోధుడు, మతోన్మాద శక్తుల చేతిలో దుర్మరణం పాలయ్యారు. ఆయన దేహాన్ని ఖననం చేసిన తరువాత ఆ బూడిదను, సాంప్రదాయాలకు భిన్నంగా, ఆయన అభిమానించే సేంద్రీయ వ్యవసాయ క్షేత్రంలో వెదజల్లారు. ఆఖరికి ఆయన చితికి సాంప్రదాయాలను త్రోసిరాజని ఆయన కుమార్తె ముక్తా దభోల్కర్ నిప్పంటించింది. బతికి ఉన్నంత కాలం మాత్రమే కాకుండా మరణించిన తరువాత కూడా అదే సిద్ధాంతాన్ని ఆచరింపచేసేటట్లు తన కుటుంబ సభ్యులను కూడా ప్రేరేపించగలిగి, ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు నరేంద్ర దభోల్కర్.

వాస్తవానికి నరేంద్ర దభోల్కర్ తన మరణానంతరం తన దేహాన్ని తాను విద్యాభ్యాసం చేసిన వైద్య కళాశాలకు దానం చేయాలని నిర్ణయించారు. కాని జరిగిన హత్యాకాండ వలన ఆయన దేహానికి పోస్టుమార్టమ్ (అటాప్సీ) చేయటం వలన, అది వైద్య కళాశాలకు పనికి రాకుండా పోవటం వలన ఆయన కల నెరవేరలేదు.

దభోల్కర్ హత్యను అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి చవాన్ అగంతకుల సమాచారం ఇచ్చిన వారికి పది లక్షలు రివార్డు ప్రకటించారు. ఆగస్టు 21న పూనాలో అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు బంద్‌ని పాటించాయి. మహారాష్ట్ర పోలీసులు కూడా ఇది ఖచ్చితంగా ప్రణాళికాబద్ధంగా జరిగిన హత్యేనని, దభోల్కర్ పూనాలో కేవలం సోమ, మంగళవారాల్లోనే ౫ంటారని తెలుసుకునే ఈ హత్యా ప్రణాళికను రచించారని తెలిపారు.

మహారాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన ఈ బిల్లు మొత్తం దేశమంతటా ఆదర్శం కావాలి. అందుకేనేమో ఈ బిల్లు ఆమోదం పొందగానే ప్రక్క రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు కూడా ఇటువంటి బిల్లును తెచ్చే ప్రయత్నం చేశాయి. చీకటి కాలం నుండి కొనసాగుతున్న అరాచ కాలను ఎదుర్కోవటం, మతానికి అనుసంధానమైపోయి, పాతుకుపోయి ఉన్న అంధ విశ్వా సాలను, బాణామతి, చేతబడి, అఘోరి వంటి సామాజిక రుగ్మతల మీద దభోల్కర్ అసమాన్యమైన పోరాటం చేశాడు. అందుకేనేమో తాను ఎంచుకున్న మార్గాన్ని వదలకుండా కడదాకా పోరాడిన దభోల్కర్ ఆ కీచక శక్తులకే బలయ్యారు. ఏ శాస్త్రీయ ధృక్పథాన్ని ఆయన వైద్యశాస్త్రంలో అభ్యసించాడో, దానికి కేవలం శారీరక రుగ్మ తలకే పరిమితం చేయకుండా, సామాజిక రుగ్మతలో సైతం అన్వయించి సైన్స్ ఫలితాలు సమాజంలో అందరికీ అందించేందుకు అవిరళ కృషి చేశాడు. ఇటువంటి శాస్త్రీ దృక్పథమే ప్రశ్నించగలదని, నిలదీయగలదని, అది సమాజ పురోగభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని నమ్మాడు. ఋజువు చేశాడు. చూపించాడు. వైద్య విద్యను కేవలం వృత్తికే పరిమితం చేయకుండా, స్వంతలాభం కన్నా సమాజలాభం కోసం, సామాజిక వైద్యునిగా మారి, విజ్ఞానవంతులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలందరికి ఆదర్శప్రాయంగా నిలిచాడు. ●

RNI Reg. No. APTEL/2006/17554 Postal Regd. No L1/SD/407/13-15

# మార్క్సిజం - లెనినిజాన్ని రద్దుచేయడం ఎవరి తరమూ కాదు



– మాకినేని బసవపున్నయ్య

మార్క్సిస్టు సిద్ధాంతం విఫలమైందనీ, అది ప్రపంచానికి చూపిన సోషలిజం, కమ్యూనిజం అనే మహత్తర దృక్పధానికి కాలదోషం పట్టిందనీ జోస్యాలు చెప్పే వారందరికీ ఒక హెచ్చరిక చేయడం అవసరం. ఒక చారిత్రక దశలో ప్రభవించిన అత్యంత శాస్త్రీయ ఆలోచనా దృక్పధమైన మార్క్సిజం–లెనినిజాన్ని రద్దు చేయడం సాధ్యమయ్యే పనికాదు. దానికా విలువ, ప్రాధాన్యత రావడానికి కారణం ఒక శాస్త్రీయమైన సత్యం కావడమే. మార్క్సిజం–లెనినిజం ఆవిర్భావానికి కారణమైన సాంఘిక–ఆర్థిక పరిస్థితులను గుర్తు చేసుకోవాలి. ఆలోచనా క్రమాన్ని వెనక్కు మళ్ళించడం సాధ్యమయ్యే పనికాదు.

మొత్తం ఇరవయ్యవ శతాబ్దంలో మానవజాతి సాధించిన సాంఘిక ప్రగతిని వెనక్కుగొట్టడం, వమ్ము చేయడం సాధ్యం కాదు. 18వ శతాబ్దంలో, 19వ శతాబ్దంలోనో వుండిన జీవన శైలికి తిరిగి మళ్ళమని ప్రపంచాన్ని ఎవరూ నిరంకుశంగా శాసించలేరు.

మార్క్సిజం–లెనినిజం, సోషలిజం కోసం ప్రపంచమంతటా కమ్యూనిస్టులు అపారమైన త్యాగాలు చేశారన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరు. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ కాలంలోనే అనేక లక్షలమంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారు. గత డెబ్బయి సంవత్సరాలు, అంతకుముందు నుంచీ సోషలిజం కోసం సాగిన పోరాట చరిత్రలో ఈ వీరోచిత అధ్యాయం ఆశయం కోసం ప్రాణాలర్పించిన స్త్రీ పురుషుల రక్తాక్షరాలతో రచించబడింది. ఈ సత్యాన్ని ఎవరూ ఖండించలేరు. భవిష్యత్ తరాల వారు దీన్ని గేలి చేసేందుకు అవకాశం ఇవ్వరాదు.

అదే సమయంలో ప్రపంచవ్యాపితంగా గల కమ్యూనిస్టులు, మార్క్సిజం, సోషలిజం ఆశయాలు సాధించిన విజయాల పట్ల గర్వపడటం సముచితమే అయినా అదే తరుణంలో వారికి తమ వైఫల్యాలు, తీవ్ర తప్పిదాలు కూడా తెలుసు. తాము పొరబాట్లకు అతీతులమని కమ్యూనిస్టులు చెప్పుకోరు. అలా చెప్పుకొనేవారు ఎవరైనా వుంటే వారిని చూసి జాలిపడాలి.

**(కీ॥శే॥ మాకినేని బసవపున్నయ్య భారత దేశ కమ్యూనిస్టు ోద్యమ నిర్మాతల్లో ఒకరు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమ రూపశిల్పి. ఆయన రచనల సంకలనంలో 'సంచలనాత్మక దశాబ్దం : ఒక పరిశీలన' అన్న వ్యాసం నుండి పై వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.8, No.11, March 2014